ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 193 పేజీలు: 10+4 వెల: 6.50


'వందేమాతరం' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మరణ శిక్ష

5లో

పార్లమెంటు ఇక రెండు రోజులే..

## కీలక బిల్లులు గట్టెక్కేనా?

### డీలిమిటేషన్, ఎఫ్‌సిఆర్ఎ బిల్లులపై ఇంకా ప్రతిష్టంభన

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెడతారని భావిస్తున్న రెండు కీలక బిల్లులపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈరెండు బిల్లులు ఈసమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఎన్డీయే పక్షం యోచిస్తుంటే ఎట్టిపరిస్థితుల్లోను వీటిని ఆమోదింపచేయకూడదన్న పట్టులో విపక్షాలు ఇండియా కూటమి పార్టీలు మొండపట్టుతో ఉన్నాయి. విదేశీ విరాళాలనియంత్రణ సవరణ బిల్లుతోపాటు డీలిమిటేషన్ బిల్లును ఈసమావేశాల్లోనే ప్రవేశపెట్టాలన్నది ఎన్డీయే పక్షం ఆలోచన. ఇందుకోసం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్‌రిజిజు విపక్ష నేతలతో సంప్రదింపులు జరిపినా విప >>2



మంగళవారం పార్లమెంటు వద్ద ప్రధానితో కలిసి మంత్రులు, ఎంపీలు జాతీయ జెండాలు ఊపుతూ జై భారత్ మాత నినాదాలు చేసిన దృశ్యం

## మదిమదిలో స్వాతంత్ర్య తరంగం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి: దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు
- పార్లమెంటు వద్ద త్రివర్ణ పతాకాలతో ప్రధానికి స్వాగతం పలికిన మంత్రులు, ఎన్డీయె ఎంపీలు
- హోరెత్తిన 'భారత్ మాతాకీ జై' నినాదాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ కొత్త వీడియోను విడుదల చేసి ప్రజలను ఉద్దేశించి ఈ విజ్ఞప్తి చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని మోడీ అన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన అమరవీరులకు నివాళులర్పిస్తూ, అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవంగా జరుపుకోవాలని కోరారు. >>2

## నెత్తురోడిన రోడ్లు

జహీరాబాద్ వద్ద ఘోర ప్రమాదం

### ఆటోను ఢీకొన్న ఆయిల్ టాంకర్

ఐదుగురు కూలీల మృతి, ఏడుగురికి గాయాలు

మృతులంతా కర్ణాటకకు చెందినవారే..

**జహీరాబాద్, ఆగస్టు 11 (ప్రభాతవార్త):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. చిరాగ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం హుమ్నాబాద్ తాలూకా రాజగిరికి >>2



మంగళవారం కోహీర్ వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కోహీర్ ఎక్స్‌రోడ్ వద్ద కార్లు ఢీకొని ఇద్దరు మృతి 2లో

# ఆటల్లో ఇక దూకుడు

డిసెంబరులో 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

ప్రతిష్టాత్మకంగా నిర్వహణకు ఏర్పాట్లు

పోటీలు క్రీడా స్ఫూర్తిని చాటాలి..

మంత్రి, అధికారులతో సిఎం సమీక్ష



మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి వాకిటి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు11:** తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసిఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఖేలో ఇండియా యూత గేమ్స్ ఏర్పాట్లు, నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే ఈ పోటీలకు సంబంధించి మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సిఎం సూచించారు. డిసెంబరులో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని స్టేడియంలలో ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, క్రీడా పోటీలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు సంబంధించిన ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. మౌలిక వసతులు, క్రీడల నిర్వహణ, అతిథులకు కావాల్సిన సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి పని విభజన చేసుకుని బాధ్యత తీసుకోవాలని తెలిపారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు >>2

## ఫాస్ట్‌గా ఓల్డ్ సిటీ మెట్రో

త్వరలో టెండర్ల ప్రక్రియ

కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలి

అధికారులతో సిఎం సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు11:** హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతనగరం మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్ఎల్)పై సిఎం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా >>2



## ఏమిటా భూ పందేరం?

ఒక్క ఉద్యోగి లేని కంపెనీకి రూ. 200 కోట్ల భూ కేటాయింపా?

కొండల్ రెడ్డి టెక్సరాక్ట్ భూములపై విచారణ జరపాలి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు11:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డి చెందిన టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీకి విలువైన ప్రభుత్వ భూమి కేటాయించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. కంపెనీ వివరాలు, దానిమూలధనం, ఉద్యోగుల సంఖ్య, కార్యాలయ చిరునామా, కంపెనీ చైర్మన్ వ్యవహారం, ప్రభుత్వ భూమి కేటాయింపు తదితర అంశాలను పరిశీలిస్తే ఇందులో భారీ కుంభకోణం జరిగిందని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఈ వ్యవహారం రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద భూ కేటాయింపు అక్రమాల్లో ఒకటిగా తాము అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అనుముల కొండల్‌రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, భూపాల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు తాను బాధ్యత వహిస్తున్నట్లు పేర్కొన్నారని తెలిపారు. టెస్సరాక్ట్ సంస్థ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో పనిచేస్తున్నట్లు పేర్కొంటూ నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా కాన్సుల్ జనరల్ కూడా పాల్గొన్న విషయాన్ని ప్రస్తావిం >>2

నేడు రాష్ట్రంలోకి 35వ రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్ర 6లో

# విచారణ జరుపుతాం

గత ప్రభుత్వ భూ కేటాయింపుల గుట్టు బహిర్గతం చేస్తాం

పరిశ్రమలు రాకుండా కెటిఆర్ రహస్య అజెండాతో దుష్ప్రచారం

ముఖ్యమంత్రి సోదరులకు భూకేటాయింపు ఆరోపణలు బూటకం: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,ఆగస్టు 11,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూముల కేటాయింపులపై విచారణ చేయిస్తామని కెటిఆర్ చేసిన ఆరోపణలతో గతంలోవారు భూముల కేటాయింపునకు అనుసరించిన అక్రమపద్దతులు మాపై నీలాపనిందల్లా వేస్తున్నారేమో అని మాకు ఇప్పటి వరకు లేని ఆలోచనలు కల్పించారనీ శాసనసభ వ్యవహారాలు, ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సిఎల్‌పిలో మంగళవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు భూ కేటాయింపులు చేసారని కెటిఆర్ అవాస్తవాలు మాట్లాడుతున్నారనీ ఆరోపణల్లో వాస్తవం లేదని తిరస్కరించారు. బిఆర్ఎస్ హయాంలో 90 లక్షల కు ఎకరం ఇస్తే మేము కోటిన్నరకు ఎకరం ఇచ్చామనీ వివరించారు. బోర్డు డిసైడ్ చేసినదాని కంటే మేము రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదని ఖరాఖండిగా చెప్పారు. 32 మంది దరఖాస్తు చేసుకుంటె అందులో టెస్సరాట్ కంపెనీ ఒకటి ఉందని,ఏ కంపెనీ ప్రారంభంలో అయినా క్యాపిటల్ అమౌంట్ తక్కువ ఉంటుందనీ తెలిపారు. టెస్సరాట్ కంపెనీకి ముఖ్యమంత్రి సోదరులకు సంబంధం లేదని చెప్పారు. సోషల్ మీడియా పోస్ట్‌ల ఆధారంగా కెటిఆర్ ఆరోపణలు చేయడం ఆశ్చర్యంగా ఉందనీ శ్రీధర్‌బాబు ఆవేదన చెందారు. 5 ఎకరాలలో 34 కోట్లతో ఏర్పాటు అయ్యే కంపెనీ నీ రెండు వందల కోట్ల కంపెనీ అని కెటిఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా? మీరు ఎందుకు తక్కువ ధరకు భూములుఇచ్చారో కెటిఆర్ సమాధానం చెప్పాలనీ సవాల్ చేశారు. నియమ నిబంధనల ప్రకారమే కేటాయిం >>2

ఎయిర్‌ఫోర్స్‌వన్ ఎక్కి అదృశ్యమైన ట్రంప్!

3లో

పంద్రాగస్టుకు ముందే దేశంలో ఉగ్రదాడులు!

# 73,39,234 ఓట్లు తొలగింపు

- వలస వెళ్లిన వారు : 45 లక్షలు
- మరణించిన వారు: 9.22 లక్షలు
- అందుబాటులో లేని ఓటర్లు: 11 లక్షలు
- 17న ఓటర్ల ముసాయిదా విడుదల
- గుర్తింపు కార్డు చూపగలిగితే ఓటు భద్రం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు11:** తెలంగాణ రాష్ట్రంలో 'సర్' ప్రక్రియకు సంబంధించి ఎన్యూమరేషన్ వివరాలను మంగళవారం ఎలక్షన్ కమిషన్ తెలంగాణ సిఇఒ కార్యాలయం వెల్లడించింది. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా 2,64,87,214 (78.30శాతం) ఓటర్లుగా నమోదైనట్లు తెలిపింది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 73,39,234 (21.70 శాతం) ఓట్లు తగ్గినట్లు వెల్లడించింది. అందులో రాష్ట్రవ్యాప్తంగా 9,22,230 మంది మరణించినట్లు గుర్తించారు. 11,25,546 మంది అందుబాటులో లేని ఓటర్లుగా గుర్తించారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు 45,18,961, మరోచోట 6,70,203 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇతర కారణాలతో ఎన్యూమరేషన్ కాని 1,02,294 మంది ఓటర్లు ఉన్నారని తెలిపింది. ఈనెల 17న ఓటర్ల ముసాయిదా జాబితాను ఇసి ప్రకటించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎఎస్‌డిడి ఓట్లలో వలస వెళ్లిన ఓటర్లనే అధికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. సుమారు 45 లక్షలకుపైగా ఓటర్లు వలస వెళ్లినట్లు నమోదైనట్లు సమాచారం.

స్థానికంగా ఓటర్ల ఇంటికివెళ్లినప్పుడూ వారు అక్కడ ఉండడంలేదని, పూర్తిగా వేరేప్రాంతానికి వెళ్లిపోయినట్లు తమ దృష్టికి వచ్చినట్లు సిబ్బంది చెప్పారు. కొంతమంది ఓటర్లు చిరునామాలో లేకపోవడం, మృతి చెందడం వంటి అంశాలను గుర్తించారు. పలువురు ఓటర్లకు రాష్ట్ర పరిధిలోనే రెండు, మూడు చోట్ల ఓట్లు ఉండటంతో >>2

# చంద్రునిపై భారత్ అడ్రస్!



'మూన్ బేస్' లో చేరాలని ఇస్రోకు అమెరికా ఆహ్వానం

చంద్రుని దక్షిణ ధ్రువంలో మనుషుల స్థావరం ఏర్పాటు చేయాలని నాసా ప్రణాళిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రణాళికలో భారత్ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. నాసా ప్రతిపాదించిన మూన్ బేస్ కార్యక్రమంలో చేరాలని ఇస్రోను అమెరికా ఆహ్వానించింది. బెంగళూరులో ఆగస్టు 5,6 తేదీల్లో జరిగిన భారత్-అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ ఆహ్వానం అందింది. చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించే తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది నాసా ప్రణాళిక. వ్యోమగాములు అక్కడ నివసించడంతో పాటు పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం మానవ సహిత, మానవ రహిత మిషన్ల ద్వారా >>2

## బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం

భారీ వర్షాలకు అవకాశం

**హైదరాబాద్, అగస్టు 11, ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో ఈనెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే మూడు నుండి నాలుగురోజుల్లో తేలికపాటినుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశమున్నట్టు వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం లేదని వాతావరణ అధికారి జీఎన్ఆర్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతంరాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే 7శాతం లోటు నమోదైం దని, 13 జిల్లాల్లో మైనస్ 20 శాతంగా ఉన్నదని వెల్లడించారు.




జార్ఖండ్ విద్యార్థులపై పోలీసుల దాష్టీకానికి ఎంపి కంగనా రనౌత్ నిరసన ప్రకటించిన దృశ్యం

# భారత్ అడ్రస్!

>> అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికే నాసా ప్రాధాన్యం ఇస్తోంది. అక్కడ శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో మంచు రూపంలో నీరు ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆ నీటిని తాగడానికి, ఆక్సిజన్, రాకెట్ ఇంధనంగా మార్చుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో అంగారకుడిపై మానవ యాత్రలకు చంద్రుడిని కీలక కేంద్రంగా ఉపయోగించుకోవాలన్నది నాసా లక్ష్యం. చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 ఆగస్టులో చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ దిగాయి. ల్యాండింగ్ ప్రాంతానికి శివశక్తి పాయింట్‌గా పేరుపెట్టారు. నాసా ఇప్పుడు అదే ప్రాంతంలో స్థావరం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇస్రో అనుభవం కీలకంగా మారనుంది. మూన్ బేస్ సహకారం ఆర్టెమిస్ అకార్డ్స్ కింద భారత్-అమెరికా భాగస్వామ్యానికి కొనసాగింపుగా ఉండనుంది. శాంతియుత, పారదర్శక, సుస్థిర అంతరిక్ష అన్వేషణకు ఈ ఒప్పందం మార్గదర్శకంగా ఉంటుంది. 2023 జూన్ 21న భారత్ ఆర్టెమిస్ అకార్డ్స్‌పై సంతకం చేసింది. బెంగళూరు సమావేశంలో అంతరిక్ష పరిశోధనల నుంచి లభించే శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపైనా చర్చలు ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. భారత్, అమెరికా ఇప్పటికే నిసార్ ఉపగ్రహం ద్వారా భారీ అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్‌లో శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష ప్రయాణ సాంకేతికతపై కలిసి పనిచేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. భారత్ గగన్‌యాన్ కార్యక్రమంతో మానవ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతోంది. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, భవిష్యత్తులో చంద్రుడిపై మానవ కార్యకలాపాల వంటి లక్ష్యాలను 'స్పేస్ విజన్ 2047'లో భారత్ నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో నాసా ఆహ్వానం ఇస్రోకు కీలక అవకాశంగా మారనుంది.

# ఏమిటా భూ పందేరం?

>> చారు. అనంతరం యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో టెస్సరాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్స్ చైర్మన్‌గా కొండల్ అనుముల చేరినట్లు సంబంధిత సంస్థ స్వయంగా ప్రకటించిందని తెలిపారు. టెస్సరాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వివరాలను పరిశీలించినప్పుడు అనేక అనుమానాస్పద అంశాలు బయటపడుతున్నాయని కేటీఆర్ అన్నారు. కంపెనీ వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఫోన్ నంబర్ 123456789గా ఉందని, ఇలాంటి వివరాలు ఎలా ఉన్నాయో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, 2025 మార్చి 31 నాటికి కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేరని, ఉద్యోగుల సంఖ్య సున్నా అని కంపెనీ వివరాల్లోనే పేర్కొన్నట్లు తెలిపారు. కంపెనీ పెయిడ్‌అప్ క్యాపిటల్ కేవలం రూ.1 లక్ష మాత్రమేనని, పటాన్‌చెరు ప్రాంతంలో ఒక చిన్న చిరునామాను కార్యాలయంగా చూపిస్తున్నారని ఆరోపించారు.

ఇలాంటి ఆర్థిక సామర్థ్యం ఉన్న కంపెనీకి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిందని, ఆ భూమి విలువ సుమారు రూ.200 కోట్లు ఉంటుందని కెటిఆర్ ఆరోపించారు. అయితే ఆ భూమిని సుమారు రూ.7 కోట్లకే, గజానికి సుమారు రూ.3,700 చొప్పున కేటాయించినట్లు తమకు అందిన వివరాలను ప్రస్తావించారు. భూమి కేటాయింపునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, ధర నిర్ణయం, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు, ఉద్యోగాల కల్పన హామీలు, అధికారుల నిర్ణయాలు అన్నింటినీ ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

టెస్సరాక్ట్ కంపెనీకి, ముఖ్యమంత్రి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారని కెటిర్ అన్నారు. అయితే కొండల్‌రెడ్డి స్వయంగా తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో టెస్సరాక్ట్ చైర్మన్‌గా పేర్కొన్నారని, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ కూడా ఆయనను టెస్సరాక్ట్ చైర్మన్‌గా పేర్కొన్నప్పుడు మంత్రి ఎలా సంబంధం లేదని చెబుతున్నారని ప్రశ్నించారు. 'మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలియదా? ముఖ్యమంత్రి సోదరుడికి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా? అని శ్రీధర్‌బాబును కేటీఆర్ ప్రశ్నించారు.

కేవలం టెస్సరాక్ట్ వ్యవహారం మాత్రమే కాకుండా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన ఇతర వ్యాపారాలు, భూములు, ఒప్పందాలు, కాంట్రాక్టులపైనా గతంలో తాము ప్రశ్నలు లేవనెత్తామని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి మరో సోదరుడు అనుముల జగదీష్‌రెడ్డి అమెరికాలో ఉండగా, ముఖ్యమంత్రి అమెరికా పర్యటన సందర్భంగా స్వచ్ఛ్ బయో సంస్థతో సుమారు రూ.1,000 కోట్ల ఒప్పందానికి సంబంధించిన ఎంఓయూ జరిగిందని పేర్కొన్నారు. ఆ ఒప్పందం తర్వాత ఆ సంస్థకు ఎక్కడైనా భూములు కేటాయించారా? పెట్టుబడులు వచ్చాయా? అనే అంశాలను కూడా వెలికి తీస్తామని తెలిపారు.

# ఆటల్లో ఇక దూకుడు

>> సభ్యులు, ఒలింపిక్స్ అసోసియేషన్‌తో పాటు జాతీయస్థాయి క్రీడా ప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా 20 రకాల స్పోర్ట్స్‌కు సంబంధించిన పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో.. క్రీడా విభాగాల వారీగా పోటీ ప్రదేశాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడా స్ఫూర్తిని చాటేలా నిర్వహణ ఉండాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎస్‌ఏటిజి చైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌ఏటిజి ఎండీ సోనీబాల దేవి పాల్గొన్నారు.

# 73,39,234 ఓట్లు తొలగింపు

>> వాటిని గుర్తించడానికి ఎన్నికల సంఘం అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వాడారు. సుమారు 3.18 లక్షల ఓటర్లకు రెండు, మూడు చోట్ల ఓటరుగా గుర్తింపు కార్డు ఉన్నట్లు ఇసి అధికారులు గుర్తించారు. ఈ ఓట్లను కూడా తొలగిపోనున్నాయి. సర్ డిజిటలైజేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా అగ్ర స్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో 94.31 శాతం ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్ జరిగింది. చివరి స్థానంలో హైదరాబాద్ ఉంది. ఇక్కడ 58.89 శాతం పత్రాలను మాత్రమే డిజిటలైజేషన్ చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం జనగామ(91.98), మహబూబాబాద్(90.11), కుమురంభీంలో 89.43 శాతం, మంచిర్యాల (82.56శాతం), ఆదిలాబాద్(86.46శాతం), నిర్మల్(85శాతం), సిద్దిపేట(88.02శాతం), రంగారెడ్డి (65.16శాతం) వికారాబాద్ (79.32 శాతం), మేడ్చల్‌మల్కాజిగిరి(63.97శాతం), నిజామాబాద్ (85.28శాతం), కామారెడ్డి (87.89శాతం), జగిత్యాల(89.61శాతం), పెద్దపల్లి(88.59శాతం), కరీంనగర్(83.69శాతం), రాజన్న సిరిసిల్ల(87.70శాతం), సంగారెడ్డి(79.51శాతం), మెదక్(90.53శాతం), మహబూబ్‌నగర్(85.94శాతం), నాగర్‌కర్నూల్(84.54శాతం), వనపర్తి(86శాతం), జోగులాంబ గద్వాల(87.30శాతం), నల్గొండ (89.52శాతం), సూర్యాపేట(90.45శాతం), వరంగల్(87.22శాతం), హనుమకొండ(79.99శాతం), జయశంకర్ భూపాలపల్లి (87.07 శాతం), భద్రాద్రి కొత్తగూడెం(86.66శాతం), ఖమ్మం(87.30శాతం), ములుగు(88.24శాతం), నారాయణపేటలో 84.58 శాతం ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియ జరిగింది. ఓట్లను తొలగించే వాటిలో ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ జిల్లా పరిధిలోనే 43 లక్షల ఓట్లు ఉన్నాయి. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 1.14 కోట్ల ఓటర్లుండగా అందులో 71.05 లక్షల మంది మాత్రమే బిఎల్‌వోలకు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి వెనక్కి అందించారు. మిగతా 43.09 లక్షల మంది ఓటర్ల పత్రాలను తిరిగి ఇవ్వలేదు. ఈక్రమంలో తొలగిపోవడం అనివార్యమే. రాష్ట్ర వ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లుండగా సోమవారం సాయంత్రం 6 గంటల వరకు 2.64 కోట్ల మంది అంటే 78.26 శాతం పత్రాలకే డిజిటలైజేషన్ ప్రక్రియ జరిగింది. మిగతా 74 లక్షల మంది తమ పత్రాలను బీఎల్‌వోలకు ఇవ్వలేదు. తొలగిపోనున్న 74 లక్షల ఓట్లలో 73.40 లక్షల అంటే 21.70 శాతం ఓట్లు సేకరించడానికి వీలులేని (అన్‌కలెక్టబుల్) లిస్ట్‌లోఉందారు. శాశ్వతంగా వలస వెళ్లడం, స్థానిక చిరునామాలో లేకపోవడం, మృతి చెందడం, డూప్లికేట్ (ఏఎస్‌డిడి) కింద తొలగించనున్నట్లు చెబుతున్నారు. తేడాలున్న, మ్యాపింగ్ జరగని ఓటర్లలో సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించని వారు ఉంటే అదనంగా మరిన్ని లక్షల ఓట్లు తొలగిపోయే అవకాశం ఉంది. ఎన్యూమరేషన్ పత్రాల సమర్పణకు సోమవారంతో గడువు ముగియగా పత్రాల డిజిటలైజేషన్ కూడా ముగిసింది. సాయంత్రం 6 గంటల వరకు అందిన సమాచారం మేరకు డిజిటలైజేషన్ రిపోర్టు ప్రకారం ఈ ఓట్లు తొలగిపోవడం ఖాయమే. ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే కంటే ముందు చేపట్టిన మ్యాపింగ్ సర్వేలో సుమారు 89 లక్షల ఓట్లలో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఓటర్లకు సర్ 2002తో మ్యాపింగ్ జరిగినప్పటికీ 11 రకాల అంశాల్లో వ్యత్యాసాలున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బిఎల్‌వోలు ఎడిట్ ఆప్షన్ కల్పించడంతో చిన్న, చిన్న పొరపాట్లు ఉన్న ఓట్లను కరెక్షన్ చేశారు. ఎడిట్ అనంతరం రాష్ట్రంలో 61 లక్షల ఓట్లలో భారీ తేడాలున్నట్లు స్పష్టంగా బయటపడింది. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధి జిల్లాలోనే ఏకంగా 10 లక్షల ఓట్లు ఉన్నాయి. ఈ ఓటర్లకు ఎస్ఐఆర్ 2002తో మ్యాపింగ్ చేసినప్పుడు 11 రకాల అంశాల్లో భారీ తేడాలున్నట్లు కనిపించాయి. వీరందరికీ ఆగస్టు 17న విడుదల చేసే ముసాయిదా జాబితా అనంతరం నమస్లు అందనున్నాయి. ఈ ఓటర్లు ఇతర్లో ముందు హాజరై ఇసి పేర్కొన్న గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి తమ ఓటును సంరక్షించుకొనే వచ్చు. ఈ ఓటర్లలో కూడా భారీగా తొలగింపు అవకాశాలే కనిపిస్తున్నాయి.

# 3.43 కోట్ల మందికి స్మార్ట్ ఆహార భద్రత

## 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సిఎం రేవంత్ శ్రీకారం

### ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 11:** తెలంగాణలో ఆహార భద్రతకు ఇక స్మార్ట్ రూపంలోకి రానున్నదనీ రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణి స్వాతంత్ర దినోత్సవం రోజున సంగారెడ్డిలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారనీ, పౌర సరఫరాలు,నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెరగడంతోపాటు లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేశామని చెప్పారు. కొత్తగా జారీచేసిన కార్డుల వల్ల 61,08,544 మంది లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు.సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్‌టుమినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

# ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల అప్‌డేట్‌పై సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు11:** తెలంగాణలో నిర్మితమవుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లపై సిఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. మంగళవారం ట్విట్టర్ ద్వారా ఆయన స్పందిస్తూ భవనాలు నిర్మించడం సులభమే... కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి.ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు..ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ... కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ... ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు..పేద కుటుంబాల పిల్లలను రేపటిశాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయన్నారు.

# కీలక బిల్లులు గట్టెక్కేనా?

>> క్షాలు నీట్ అల్లర్లు, అరెస్టులు, లాఠిఛార్జిలతోపాటు అయోధ్య విరాళాల చోరీపైనే ముందు చర్చజరపాలని, పార్లమెంటులో మోడీ, అమిత్‌షాలు క్షమాపణ చెపితేనే సజావుగా సాగుతాయన్న హెచ్చరికలుచేస్తుండటంతో ఎన్డీయే పక్షం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఎఫ్‌సిఎన్‌ఆర్‌ఎ బిల్లును పంపించాలనినిర్ణయిస్తోంది. కేవలం రెండే రెండురోజులు ఇక వర్షాకాల సమావేశాలు జరుగుతాయి. ఈ లోపే ఈ రెండు బిల్లులను ఆమోదింపచేసుకోవడం అనేది ఎన్డీయే పక్షానికి కత్తిమీద సాములాంటిదే. ముందురోజు స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశంలో కూడా ఈ రెండు బిల్లుల ప్రస్తావనకు రాలేదు. దీన్నిబట్టి ఈసమావేశాల్లో ఉండకపోవచ్చన్న భావన కూడా అధికారపక్షంలోనే నెలకొంది. ఏది ఎలా ఉన్నా ఉభయసభల్లో ఈ రెండు బిల్లులను ఈసమావేశాల్లోనే ఆమోదింపచేసుకోడానికి ఎన్డీయే పక్షం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే కొన్ని విపక్షాలు బిల్లును విత్‌డ్రాచేసుకోవడం లేదా జెపిసికి పంపించాలని డిమాండ్‌చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎ చట్టంలోనిసెక్షన్ 15 తొలగించాలని డిఎంకె ఇప్పటికే డిమాండ్‌చేస్తోంది. కాంగ్రెస్, ఎస్పీ వామపక్షాలు కూడాఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి.

## జెపిసి పరిశీలనకు విదేశీ విరాళాల బిల్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** వివాదాస్పద విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి ముందు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్రమోడీతో సమావేశమైన తర్వాత కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. ఈ బిల్లుపై అధికార, ప్రతిపక్షాల మధ్య విభేదాలు తలెత్తడంతోనే జెపిసి ఆలోచనకు కేంద్రం వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలని కొన్ని విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇదిలా ఉంటే ముందురోజు జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లు, ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు ప్రస్తావనకు రాలేదు. ప్రభుత్వం ఈ రెండు బిల్లులను సమావేశ ఎజెండాలో చేర్చలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

# ఫాస్ట్‌గా ఓల్డ్ సిటీ మెట్రో

>> పూర్తి చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని తెలిపారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్‌కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచెస్‌ను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్2 లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

12-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
● తి.అమావాస్య రా.11.09
న.పుష్యమి ఉ.8.00
వ.రా.7.48-రా.9.16
దు.ఉ.11.46-మ.12.37
రాహు. మ.12.00-మ.1.30 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** చిన్ననాటి మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. నూతన వస్తువులు కొనుగోలు. వాహన సౌఖ్యం.

**వృషభం :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన పెట్టుబడులకు అనుకూలం. శుభకార్యాలు.

**మిథునం :** కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. ఇంటా బయటా మీదే పైచేయిగా ఉంటుంది.

**కర్కాటకం :** సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతారు. క్రయ విక్రయాలలో లాభాలు.

**సింహం :** కొత్త వ్యాపార, విద్యా సంబంధితమైన విషయములకు, గృహ నిర్మాణాలకు అనుకూలం. మిత్రుల కలయిక.

**కన్య :** సన్నిహితుల సహకారము పూర్తిగా లభించుట వలన కొన్ని కార్యక్రమములలో విజయాలను చవిచూస్తారు.

**తుల :** ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుట వలన మానసిక ఉల్లాసమును కలిగియుంటారు. వస్త్రా లాభాలు

**వృశ్చికం :** అధికారుల అండదండలు లభించుట వలన వృత్తి యందు రాణించగలుగుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు :** సంతాన, ఆధ్యాత్మిక విషయములు సంతృప్తి ఇస్తాయి. భార్య వైపు బంధువులకు సాయం చేస్తారు.

**మకరం :** అధికారులతో సహోద్యోగులతో స్నేహ భావముతో మెలగండి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కుంభం :** వ్యాపారములో, వృత్తిలో మీరు చూపించే నైపుణ్యమునకు గాను, మంచి అభివృద్ధిని సాధిస్తారు. మిత్రుల కలయిక.

**మీనం :** విదేశీయానములకు ఉద్యోగ ప్రయత్నములకు మీరుచేసే కృషి సానుకూల పడుతుంది. కాంట్రాక్ట్‌లు లాభిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో భారీ వర్షాలకు మోటార్ బ్రిడ్జి కూలిపోయిన దృశ్యం

# స్వాతంత్ర్యతరంగం

>>ఇదిలా ఉండగా, మంగళవారం పార్లమెంట్‌లో జరిగిన అధికార ఎన్డీఏ కూటమి వారపు పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోడీ హాజరైన సందర్భంగా ఎన్డీఏ ఎంపీలు, కేంద్ర మంత్రులు జాతీయ జెండాలు ఊపుతూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. వందే మాతరం, భారత్ మాతా కీ జై నినాదాలతో హోరెత్తించారు. పార్లమెంట్ లైబ్రరీలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు, ఎన్డీఏ నేతలు, కూటమిలోని వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు హాజరయ్యారు. ప్రధాని మోదీ సమావేశ ప్రాంగణంలోకి ప్రవేశించగానే మంత్రులు, ఎంపీలు జాతీయ జెండాలను చేతబూని నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా మోడీ కూడా జాతీయ జెండాను చేతిలో పట్టుకుని ఎంపీల వైపు ఊపారు.ఈ సమావేశానికి బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, ఎస్. జైశంకర్ తదితరులు హాజరయ్యారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలకు చెందిన హెచ్‌డీ కుమారస్వామి (జెడిఎస్), కింజరాపు రామ్మోహన్ నాయుడు (టిడిపి), రాందాస్ బండు అథవాలే, ప్రఫుల్ పటేల్ (ఎన్సీపీ), ఉపేంద్ర కుష్వాహా (ఆర్ఎల్ఎం), శతాబ్ది రాయ్ తదితర నేతలు కూడా సమావేశంలో పాల్గొన్నారు. జూలై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారంతో ముగియనున్నాయి.

**పలు బిల్లుల ఆమోదం**

ఈ సమావేశాల్లో తరచూ వాయిదాలు, నిరసనలు చోటుచేసుకోవడంతో పెద్దగా శాసన కార్యకలాపాలు జరగలేదు. ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నిరోధం) సవరణ బిల్లు2026తో పాటు మరో నాలుగు బిల్లులను పెద్దగా చర్చ లేకుండానే పార్లమెంట్ ఆమోదించింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య లోక్‌సభ మరో మూడు బిల్లులను కూడా ఆమోదించింది.తొలుత నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంతో పాటు అయోధ్య రామాలయ విరాళాల నిధుల దుర్వినియోగంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. అనంతరం నీట్ అంశంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై చర్చించాలని, ఈ అంశంపై ప్రధానమంత్రి మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ఉండి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

# విచారణ జరుపుతాం

>> పులు జరిగాయి ఎవ్వరికైనా పిర్యాదు చేసుకోవచ్చు వాళ్లకి పూర్తి స్వేచ్ఛ ఉంది అని అన్నారు. పత్రికల్లో రాస్తారని నోటికొచ్చినట్లు మాట్లాడడం సరి కాదని కెటిఆర్‌కు హితవు చెప్పారు. పిఎం ఏక్తా మాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయనీ ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ రూల్స్ ప్రకారం మాల్ నిర్మాణం జరుగుతుందనీ వివరించారు.200 కోట్ల సాఫ్ట్ లోన్ తిరిగి చెల్లించాల్సిందే అని చెప్పారు. పిపిపి మోడల్‌లో టెండర్ జరిగిందనీ ప్రీ బిడ్డింగ్‌లో 7మంది బిల్డర్లు పాల్గొంటె , ఇద్దరిని ఎంపిక చేసారని అన్నారు.పిఎం ఏక్తా మాల్ నిర్మాణంలో ప్రభుత్వపై భారం లేకుండా లాభం జరుగుతుందనీ చెప్పారు.పరిశ్రమలు రావొద్దనే రహస్య ఏజెండాతో కెటిఆర్ ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. కెటిఆర్ వాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నా శాఖలో ఎవరో చెప్తే నేను పనిచేసే రకం కాదు అని పునర్ఘటించారు, నా శాఖలో జరిగిన ప్రతీ నిర్ణయం నాకు తెలుసని ఆయన అన్నారు.బిఆర్ఎస్ హాయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేసారనీ అప్పుడు కెటిఆర్‌కు తప్పు అనిపించలేదా అని ప్రశ్నించారు. మేము హిల్ట్ పాలసీ ద్వారా నిరూపయోగంగా ఉన్న రెగ్యులరైజ్ అయిన భూములను బదలాయింపుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దోపిడీ చేసింది, మీరా మేమా? అని అడిగారు. బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం జరుగదని అది ఒక పగటి కల అని ఆయన కొట్టేశారు. మా కక్ష సాధింపు ధోరణి కానీ వ్యక్తిగతం ఇబ్బంది పెట్టాలనే ఆలోచన కానీ లేదు చట్ట ప్రకారం ముందుకు వెళుతున్నాం అని అన్నారు. కక్షసాధింపుతో ముందుకెళితే వీరంతా ఎక్కడో ఉండేవాళ్లు అన్నారు. ప్రతి పక్షాలు రెండున్నర సంవత్సరాలుగా దుష్ప్రచారం చేస్తున్నా, భయపెట్టినా పరిశ్రమలు వస్తున్నాయనీ అన్నారు. గత ప్రభుత్వం హయాంలో భూముల కేటాయింపుపై విచారణ చేయిస్తామనీ హెచ్చరించారు.

# నెత్తురోడిన రోడ్లు

>> చెందిన కూలీలు పనుల నిమిత్తం జహీరాబాద్‌కు వచ్చారు. పని ముగించుకుని ఆటోలో జహీరాబాద్ నుంచి హుమ్నాబాద్ వైపు వెళ్తుండగా సత్వార్ గ్రామ సమీపంలోని యూటర్న్ వద్ద ప్రమాదం జరిగింది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ప్రమాదంలో రేఖ, శ్రీదేవి, దేవదాస్, కవిత, రేష్మ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వీరంతా ఒకే గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. గాయపడిన వారిలో నిర్మల, నికిత, తుల్జమ్మ, చంద్రకళ, రాధిక, శిల్ప, శోభ ఉన్నారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే చిరాగ్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని హుటాహుటిన జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఆసుపత్రి వద్ద విషాదం ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు కూలీలు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకోవడంతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. తమ వారిని కోల్పోయిన కుటుంబ సభ్యుల రోదనలతో ఆసుపత్రి ఆవరణం దద్దరిల్లింది. ప్రమాదానికి గల పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

## కోహిర్ ఎక్స్‌రోడ్ వద్ద కార్లు ఢీకొని ఇద్దరు మృతి

**జహీరాబాద్ ఆగస్టు 11 ప్రభాతవార్త :** కోహిర్ చౌరస్తా సమీపంలో మంగళవారం రాత్రి కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. చనిపోయిన వారిలో సదాశివపేట పట్టణం 1 వ వార్డుకు చెందిన బోడగమా మల్లికార్జున్ 52 ,శంకర్ 52,లు ఉన్నారు చనిపోయిన వారిలో మల్లికార్జున్ లీళినీ ఎంప్లాయ్ కాగా శంకర్ సదాశివపేట మున్సిపల్ ఎంప్లాయి పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న కోయిరు పోలీసులు సంఘటన స్థలాలను చేరుకొని మృతి చెందిన వారిని గాయపడ్డ వారిని జహీరాబాద్ ప్రభుత్వం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఒక కారు పల్టీలు కొట్టి రహదారిపై పడగా వెనకాల ప్రయాణిస్తున్న మూడు కార్లు ఒకటి ఒకటి వెనుక నుండి ఢీకొనడంతో కారులో ప్రేమిస్తున్న ఇరువురు మృతి చెందినట్లు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## సంగారెడ్డిలో రోడ్డు ప్రమాదంపై సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు11:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

## ఏర్పాట్లపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు11:** తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు.



# పంద్రాగస్టుకు ముందే దేశంలో ఉగ్రదాడులు!

## భారీ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడవచ్చన్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేస్తూ కీలక చర్యలు చేపట్టింది. ఈనెల 15న ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో భద్రతా బలగాల దృష్టి వేడుకలపై కేంద్రీకృతమై ఉంటుందని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ భావిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు తెలిపారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఐఎస్ఐ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయడం, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా పంపడం వంటి ప్రయత్నాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా, భద్రత తక్కువగా ఉండే టైర్2 నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉంది. కొన్నిసార్లు భద్రతా ఏజెన్సీల దృష్టిని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ లేదా కశ్మీర్‌లో దాడులంటూ తప్పుడు సమాచారం సృష్టించి, మరోచోట దాడికి దిగే వ్యూహం కూడా ఐఎస్ఐ అనుసరించవచ్చని ఓ అధికారి వివరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఆపరేషన్ అలర్ట్‌ను ప్రారంభించింది. ఈనెల 10 నుంచి 17 వరకు కొనసాగే ఈ ఆపరేషన్‌లో భాగంగా బీఎస్ఎఫ్ సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా మరియు పెట్రోలింగ్‌ను గణనీయంగా పెంచారు. మరోవైపు, బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రతను పటిష్టం చేసేందుకు పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో సుమారు 40 సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) యూనిట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సరిహద్దు అత్యంత సున్నితమైనది కావడంతో శాశ్వత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి చొరబాట్లు, స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు

# తుమ్మిడిహెట్టి బ్యారేజీని ఎల్లంపల్లికి అనుసంధానం చేయాలి

## రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త:** తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మించి యుద్ధ ప్రాతిపదికన ఎల్లంపల్లికి అనుసంధానం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ జలసాధన సమితి,తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనర్ నైనాల గోవర్ధన్ అధ్యతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌ల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి టిజెస్ అధ్యక్షులు ఎంఎల్‌సి కోదండరాం, జస్టిస్ చంద్రకుమార్ సారంపల్లి మల్లారెడ్డి (ప్రముఖ నీటిపారుదల విశ్లేషకులు)టి శ్రీనివాస్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా కోదండరాం మాట్లాడుతూ మేడిగడ్డ అన్నారం సుందిళ్ల మూడు బ్యారేజీలు ఇప్పటికీ ఇప్పుడు ఉపయోగించడం ఎన్‌డిఎస్‌ఏ నివేదిక ప్రకారం సాధ్యం కాదు అన్నారు. హైదరాబాద్‌కు నీళ్ల అందించేది కేవలం ప్రాణహిత నది మాత్రమే అన్నారు. తక్షణమే తుమ్మిడి హెట్టి ప్రాజెక్టును నిర్మించాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు శ్రీరామ్ సాగర్ లో ఎల్లంపల్లిలో అన్యాయం జరిగింది. తుమ్మిడి హెట్టి నుండి తూర్పు జిల్లా ఆదిలాబాద్‌కు నీళ్ల ఇచ్చే విషయం కూడా ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీకి ఒక ఏటీఎంగా మారిందన్నారు. కేవలం ముగ్గురు ఇంజనీర్ల దగ్గర 1000 కోట్ల రూపాయలు అవినీతి నిరోధక శాఖ దాడిలో లభించాయన్నారు. కాళేశ్వరం నిర్మించిన బడా నాయకులు కాంట్రాక్టర్ల దగ్గర ఎంత డబ్బు ఉండి ఉంటదో తేలికగా అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్పటికైనా తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుని యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు ఎం. హన్మేష్, సజయ, సంధ్య, రామన్న, ఝాన్సీ, జైపాల్ సింగ్, లాల్‌కుమార్ శ్రీనివాస్, అనురాధ. సోగరా బేగం, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభలో మరో రెండు బిల్లులు ఆమోదం

## కొనసాగిన విపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ మంగళవారం మరో రెండు కీలక బిల్లులను ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు హాజరై తమ డిమాండ్లపై సమాధానం ఇవ్వాలని కోరుతూ విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు.మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పటికీ గందరగోళం కొనసాగింది. అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల నిధుల దుర్వినియోగం, చోరీ జరిగిందన్న ఆరోపణలపైనా విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. సభలో గందరగోళం నెలకొన్నప్పటికీ సభాధ్యక్ష స్థానంలో ఉన్న కృష్ణ ప్రసాద్ తెన్నేటి పత్రాలను సభలో సమర్పించేందుకు అనుమతించారు. కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026ను పరిశీలన, ఆమోదం కోసం చేపట్టారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. విపక్షాల నినాదాల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు వాయిస్ ఓటుతో ఆమోదం పొందింది. ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. కేరళలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్రం పేరు మార్పునకు అనుకూలంగా లేరని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సవరణ) బిల్లు, 2026ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లును కూడా విపక్షాల ఆందోళనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించారు. ఇప్పటివరకు లోక్‌సభలో మొత్తం 11 బిల్లులు ఆమోదం పొందగా, వాటిలో కేవలం రెండు బిల్లులపైనే చర్చ జరిగింది. మిగిలిన బిల్లులన్నీ విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. సభలో గందరగోళంపై ఓం బిర్లా ఆవేదనఅంతకుముందు ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే కొద్దిసేపటికే వాయిదా పడింది. వరుసగా సభా కార్యకలాపాలకు అంతరాయం కలుగుతుండటంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, విపక్షాలు పరస్పరం ఒక అవగాహనకు వచ్చి కీలకమైన బిల్లులపై చర్చ జరిగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశంలో దూరప్రభావం చూపే మార్పులకు దారితీసే బిల్లులపై సభలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజ్యసభలో నేషనల్ ట్రిబ్యునల్ కమిషన్ బిల్లుమరోవైపు రాజ్యసభ మంగళవారం వివిధ ట్రిబ్యునళ్లకు చైర్‌పర్సన్లు, సభ్యులను ఎంపిక చేసేందుకు నేషనల్ ట్రిబ్యునల్ కమిషన్ (ఎన్‌టీసీ) ఏర్పాటు చేసే బిల్లును ఆమోదించింది. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం రాజ్యసభలో బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు వాకౌట్ చేశాయి. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు చైర్ అనుమతించక పోవడంతో వారు సభ నుంచి బయటకు వెళ్లారు. బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ కేంద్ర న్యాయ, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ వేగవంతమైన న్యాయం అందించడంలో ట్రిబ్యునళ్లు కీలకమైన అనుబంధ వ్యవస్థగా పనిచేస్తాయని చెప్పారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం 2016లో ట్రిబ్యునళ్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించిందని, అనంతరం 2021లో ట్రిబ్యునల్ రిఫార్మ్స్ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. నాలుగు సభ్యులతో ఎన్‌టీసీఈ బిల్లులో ప్రధాన అంశం నేషనల్ ట్రిబ్యునల్ కమిషన్ ఏర్పాటు చేయడమేనని మేఘ్వాల్ చెప్పారు. కమిషన్‌లో ఇద్దరు న్యాయ సభ్యులు, ఇద్దరు సాంకేతిక సభ్యులు ఉంటారని, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి లేదా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కమిషన్‌కు నేతృత్వం వహిస్తారని వివరించారు. ఎన్‌టీసీ ద్వారా నియామక ప్రక్రియను పారదర్శకంగా, స్వతంత్రంగా, ప్రతిభ ఆధారంగా నిర్వహించేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ బిల్లు ద్వారా ట్రిబ్యునళ్ల అధికార పరిధిలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు.న్యాయం సులభంగా అందేలా చేయడంతోపాటు, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంలో ఈ బిల్లు దోహదపడుతుందని, ప్రపంచంలోని ఉత్తమ విధానాలను అనుసరించే దిశగా ఇది కీలక ముందడుగు అని మేఘ్వాల్ పేర్కొన్నారు.



# బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల కోసం కేంద్రానికి ప్రతిపాదన రాలేదు

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ఏర్పాటు నిమిత్తం సింగరేణి కాలరీస్ ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదన తమ శాఖకు రాలేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి వెల్లడించారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం, సింగరేణి నుంచి ప్రతిపాదనలపై రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంగళవారం మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు గణనీయమైన మూలధన పెట్టుబడి అవసరమని తెలిపారు. ఇది కొత్త రంగం కావడంతో సాధ్యాసాధ్యాల పరంగా పలు సవాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని వ్యూహాత్మక జాతీయ అవసరాల దృష్ట్యా గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని చెప్పారు. బొగ్గు మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఆర్థిక ప్రోత్సాహక పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలు సహా అర్హత కలిగిన దరఖాస్తుదారులందరూ ప్రయోజనం పొందేందుకు అవకాశం ఉందన్నారు.

సింగరేణి సంస్థ బొగ్గు గ్యాసిఫికేషన్ కార్యక్రమాల కోసం ఎలాంటి ఆర్థిక సాయం కోరలేదని, అందువల్ల తమ శాఖ నుంచి ఎలాంటి ప్రోత్సాహకం కేటాయించలేదని తెలిపారు. కాగా బొగ్గు గ్యాసిఫికేషన్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు ఆర్థిక ప్రోత్సాహక పథకాలకు ఆమోదం తెలిపిందని వెల్లడించారు. 2024 జనవరి 24న రూ.8,500 కోట్లతో, 2026 మే 13న రూ.37,500 కోట్లతో ఈ పథకాలకు ఆమోదం లభించిందన్నారు. గ్యాసిఫికేషన్ ప్లాంట్ల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ, భద్రత, చట్టబద్ధమైన కార్యకలాపాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# ఎయిర్‌ఫోర్స్ వన్ ఎక్కి అదృశ్యమైన ట్రంప్

## తుర్కియేలో అమెరికా సీక్రెట్ ఆపరేషన్



**వాషింగ్టన్, ఆగస్టు 11:** పశ్చిమాసియా ఘర్షణలు, బెదిరింపుల నేపథ్యం లో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ నేతలు శత్రువులకు చిక్కకుండా కొత్త మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శత్రువులకు దొరక్కుండా ఒక చిన్న విమానంలో ప్రయాణించారట. పటిష్ట భద్రతకు నెలవైన ఎయిర్‌ఫోర్స్ వన్‌ను వదిలి.. యుఎస్ మిలిటరీకి చెందిన చిన్న విమానాన్ని వాడారు. ఇటీవల తుర్కియేలో జరిగిన నాటో సదస్సు తర్వాత ఆ దేశాన్ని వీడేటప్పుడు ఈ రహస్య ఫ్లైట్‌ను ఎంచుకున్నారని అమెరికా మీడియా కథనం వెల్లడించింది. జులైలో తుర్కియే రాజధాని అంకారాలో నాటో సదస్సు జరిగింది. ఖతార్ కానుకగా ఇచ్చిన బోయింగ్ 747-8 లో అంకారాకు ట్రంప్ వెళ్లారు. కానీ వచ్చేటప్పుడు మాత్రం దానిని వాడలేదు. ఎయిర్‌ఫోర్స్ వన్ ఎక్కారు. ప్రపంచం మొత్తానికి అదే చూపించారు. కానీ అక్కడే సీన్ మారింది.. తర్వాత విమానం బెల్లీ నుంచి బయటకు తెచ్చి.. అక్కడే సిద్ధంగా ఉన్న ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కు (గ్రౌండ్ సపోర్ట్ వెహికల్)లోకి ట్రంప్‌ను మార్చారు. ఆ తర్వాత ఆయనను సి-32ఎ విమానంలోకి ఎక్కించి రహస్యంగా తుర్కియే దాటించారు. అక్కడి నుంచి బ్రిటన్ వెళ్లారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో పాత్రికేయులు, ఇతర సిబ్బంది ప్రయాణించారు. ట్రంప్ ఆ విమానంలోనే ఉన్నారని శత్రువులను నమ్మించేందుకు, ఆయన భద్రత దృష్ట్యా ఈ ఏర్పాటు చేశారని తెలుస్తోంది. జులై 8న ఈ ఘటన జరిగిందని మీడియా కథనం పేర్కొంది. అప్పటికే ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. అదీగాక తుర్కియేకు అత్యంతక సమీపంలో ఇరాన్ ఉంటుంది.

747-200బి విమానం ఎయిర్‌ఫోర్స్ వన్ హోదాలో అమెరికా అధ్యక్షులకు అధికారిక విమానంగా ఉంటూ వస్తోంది. జార్జ్ హెచ్‌డబ్ల్యు బుష్ నుంచి ట్రంప్ వరకు ప్రతి అధ్యక్షుడికి ఈ పాత విమానమే సేవలందిస్తోంది. యుఎస్ వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్-747 విమానాలు అందేవరకు.. ఖతార్ నుంచి గిఫ్ట్‌గా లభించిన 747 జంబో జెట్ తన అధికారిక ప్రయాణాలకు వాడతానని ట్రంప్ చెప్పారు. అయితే, తుర్కియే నుంచ వచ్చేటప్పుడు మాత్రం దానిని వదిలేసి.. పాత ఎయిర్‌ఫోర్స్‌ను వాడినట్లు ప్రపంచాన్ని నమ్మించారు. ట్రంప్‌ను తరలించేందుకు క్యాటరింగ్ ట్రక్కును ఆహారం, ఇతర సామగ్రి, సిబ్బందిని విమానంలోకి తరలించేందుకు ఉపయోగిస్తుంటారు.

# ఐసెట్ మొదటి విడతలో 19,536 సీట్ల కేటాయింపు

## ఎంబిఎలో 57 శాతం, ఎంసిఎలో 39 శాతం సీట్ల కేటాయింపు

## 14లోగా ఫీజు చెల్లించాలి.. 22 నుంచి 24 వరకు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐ సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి విడతలో 35,241 సీట్లకు గానూ 19,526 మందికి సీట్ల కేటాయింపు చేశారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 14లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని, ఈ నెల 22 నుంచి 24 వరకు కాలేజీల్లో చేరాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో ఎంబీఏలో 57 శాతం సీట్లను, ఎంసీఏలో 39 శాతం సీట్లను కేటాయించారు. ఐ సెట్-2026లో 46,654 మంది అర్హత సాధించారు. వారిలో 21,097 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. అందులో 20,469 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. ఆప్షన్లు ఇచ్చిన వారిలో 19,526 మందికి మొదటి విడతలో సీట్లను కేటాయించారు. రాష్ట్రంలో 309 ఎంబీఏ కాలేజీలు, 92 ఎంసీఏ కాలేజీలున్నాయి. వాటిల్లో కన్వీనర్ కోటాలో ఎంబీఏలో 29,457 సీట్లు, ఎంసీఏలో 6784 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అందులో మొదటి విడతలో ఎంబీఏలో 16,896 సీట్లను కేటాయించగా, ఎంసీఏలో 2630 సీట్లను కేటాయించారు.

ఎంబీఏలో 12,561 సీట్లు, ఎంసీఏలో 4154 సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఎంబీఏ కాలేజీల్లో యూని వర్సిటీ కాలేజీలు 25 ఉంటే వాటిల్లో 1550 సీట్లకు గానూ 1305 సీట్లను(84శాతం) కేటాయిం చారు. గవర్నమెంట్ కాలేజీలు 4 ఉండగా వాటిలో 260 సీట్లకుగానూ 248 సీట్లును (95శాతం) కేటాయించారు. ప్రైవేటు కాలేజీలు 280 ఉంటే వాటిల్లో 27,647 సీట్లకు గానూ 15,343 సీట్లను(55శాతం) కేటాయించారు. 309 ఎంబీఏ కాలేజీల్లో 29,457 సీట్లకుగానూ 16,896 సీట్లను(57శాతం) కేటాయించారు. ఎంసీఏ కాలేజీల్లో యూనివర్సిటీ కాలేజీలు 18 ఉంటే వాటిల్లో 1076 సీట్లకుగానూ 753 సీట్లను (70శాతం) కేటాయించారు. ప్రైవేటు కాలేజీలు 74 ఉండగా వాటిల్లో 5708 సీట్లకుగానూ 1877 సీట్లను(33శాతం) కేటాయించారు. మొత్తం 92 ఎంసీఏ కాలేజీల్లో 6784 సీట్లకుగానూ 2630 సీట్లను(39శాతం) మొదటి విడతలో కేటాయిం చారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 14లోగా ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని, ఈ నెల 22 నుంచి 24 వరకు కాలేజీల్లో చేరుగా చేరాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో స్పష్టం చేశారు

# అనామలిస్ ఓట్ల పరిశీలనలో అప్రమత్తంగా వ్యవహరించాలి

## పిసిసి చీఫ్ మహేష్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్

**హైదరాబాద్,ఆగస్టు11,ప్రభాతవార్త:** అనామలిస్ ఓట్లు పరిశీలనలో అప్రమత్తగా వ్యవహరించాలని అర్హత కలిగిన ఏ వయోజనుడు ఓటును కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టిపిసిసి చీఫ్‌మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కోరారు. మంగళ వారం జహీరాబాద్, మెదక్, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాల జూమ్ మీటింగ్ జరిగింది. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, సర్ కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ గంప వేణు, ఎలక్షన్ కమిషన్ కమిటీ చైర్మన్ రాజేష్ ఆయా జిల్లాల డిసిసి అధ్యక్షులు, ఎంపి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఇంచార్జ్‌లు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు. హైదరాబాద్ పరిధిలో ఓట్లు గణనీయంగా తగ్గిపోతున్నా యని, ఈ విషయంలో పార్టీ గట్టి నిఘా పెట్టాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. అనామలిస్ ఓట్ల పరిశీలన ఇప్పుడు చాలా కీలకమని ఇక్కడ ఏ మాత్రం నిరక్ష్యంగా ఉండకూడదని అన్నారు. బిఎల్ఎలు మరింత అప్రమత్తంగా ఉండి ప్రతీ ఓటును లోతుగా అధ్యయనం చేయాలని అన్నారు.

**ఉపాధ్యక్షులతో సచిన్‌సావంత్ వన్ టూ వన్ భేటీ**

ఎఐసిసి ఇన్‌చార్జ్ సచిన్ సావంత్ టిపిసిసి ఉపాధ్యక్షులను గత రెండు రోజులుగా వ్యక్తిగతంగా కలుసుకొని పార్టీ పటిష్టత పై చర్చిస్తున్నారు. మంగళవారం కూడా ఆయన సమావేశమై టిపిసిసి ఉపాధ్యక్షులు నియామకం అయినప్పటి నుంచి చేపట్టిన రాజకీయ కార్యక్రమాల గురించి మాట్లాడారు. బుధవారం నుంచి ప్రధాన కార్యదర్శులకు ముఖముఖి భేటి గాంధీభవన్‌లో నిర్వహిస్తారు. ప్రభుత్వం పార్టీ తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఎఐసిసికి అందిస్తారు.

# ప్రతి ఉద్యోగికీ క్రీడల్లో భాగస్వామ్యం

## సమైక్య భావంతోనే మెరుగైన సేవలు

## ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** తమ సంస్థలో పనిచేస్తున్న ప్రతీ ఒక్క ఉద్యోగికీ క్రీడల్లో భాగస్వామ్యం కల్పిస్తామని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కె వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో సమైక్య భావంతో పనిచేసినప్పుడే విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందివ్వగలమన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని హన్మకొండ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వివిధ క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా పోటీలు డిపార్ట్‌మెంట్ స్థాయిలో ఉద్యోగుల మధ్య అనుబంధాన్ని, ఐక్యతను మరింత బలపరుస్తాయని చెప్పారు. ఉద్యోగుల మధ్య సత్‌సంబంధాలు, బాండింగ్ పెరిగినప్పుడే సంస్థ పట్ల వారిలో అంకితభావం పెరిగి విద్యుత్ వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. క్రీడల్లో గడపడం వల్ల వృత్తిపరమైన ఒత్తిడి తగ్గి ఉద్యోగుల పనితీరును మరింత మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, ఉద్యోగుల మానసిక ఒత్తిడిని తగ్గించి వారిలో నూతనోత్సాహాన్ని నింపుతాయన్నారు. సంస్థలో శ్రమించే ప్రతీ ఉద్యోగి క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. బ్యాడ్మింటన్, క్రికెట్, క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ పోటీలలో వివిధ సర్కిళ్ల నుండి ఈసారి దాదాపు 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మోహన్ రావు, తిరుపతి రెడ్డి, మధుసూదన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన విద్యుత్ సామర్థ్యం

## రెండేళ్లలో 3139.7 మెగావాట్లు పెరిగిన సామర్థ్యం

## పీక్ డిమాండ్ 18266 మెగావాట్లు నమోదు

## రాష్ట్ర వినియోగంలో 37 శాతం టిజి జెన్కో వాటా

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం అనూహ్యంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా పీక్ డిమాండ్ కూడా రికార్డు స్థాయితో నమోదువుతోంది. గృహావసరాలే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు వంటి కీలక రంగాలు విద్యుత్ రంగంపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సామర్థ్యం పెంచే దిశగా విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం వైపు తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో దృష్టిసారించింది. ఫలితంగా గత నెలాఖరు వరకూ 9622.76 మెగావాట్ల అత్యధిక స్థాపిత సామర్థ్యాన్ని సాధించడమే కాకుండా, రాష్ట్ర చరిత్రలోనే నమోదైన 18266 మెగావాట్ల రికార్డు స్థాయి పీక్ డిమాండ్‌లో దాదాపు 37 శాతం వాటాను జెన్కో అందించింది. విద్యుత్ జెన్కో అధికారవర్గాలు విడుదల చేసిన ఒక ప్రకటనలో 2024 మార్చి 31 నాటికి, రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి స్థాపిత సామర్థ్యం 6485.26 మెగావాట్లు ఉండగా, రెండున్నరేళ్ల వ్యవధిలోనే, గత నెలాఖరు నాటికి ఇది 9624.96 మెగావాట్లకు చేరుకుంది. ఇందులో 7180 మెగావాట్లు థర్మల్, 2441.76 మెగావాట్లు జలవిద్యుత్, 3.2 మెగావాట్లు సౌర విద్యుత్‌కు సంబంధించి సామర్థ్యం కలిగిన ప్లాంట్లు ఉన్నాయి. ఇక తెలంగాణలో పెరిగిన రోజూవారీ విద్యుత్ ఉత్పత్తి. చూసినట్లయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర గ్రిడ్ విద్యుత్ అవసరాల్లో 36.97 శాతం వాటాను జెన్కో సమకూర్చింది. అదే కాలంలో 32568.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. అంతకుముందు 2024-25లో 26960.18 మిలియన్ యూనిట్ల ఉత్పత్తితో 30.2 శాతం వాటా జెన్కో కలిగి ఉంది.

# పంపులు ఆన్ చేయకుండా యాగాలు చేస్తే నీళ్లు రావు

## రాష్ట్ర ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్రను అడ్డుకోవాలి

## జిఆర్ఎంబి సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం బహిష్కరించాలి

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 11:** తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి సాధించిన నీటి ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసేందుకు జరుగు తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమ తులు ఇచ్చిన ఏడు తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరుతుండగా, ఆ అంశాన్ని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) అజెండాలో చేర్చడం దారుణ మన్నారు. మంగళవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న జీఆర్ఎంబీ సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం అనుమతులు ఇచ్చిన తర్వాత వాటిని రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం పట్టుబడుతుంటే, అదే అంశాన్ని కేంద్రం ఆధీనంలోని జీఆర్ఎంబీ అజెండాలో పెట్టడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వానికి ఆత్మగౌరవం, పౌరుషం ఉంటే సమావేశాన్ని బహిష్కరించాలని, ఏడు ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని అజెండా నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు.

జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించడంతో పాటు అజెండా నుంచి అనుమతుల రద్దు అంశాన్ని తొలగించక పోతే తెలంగాణలో జల ఉద్యమాన్ని నిర్మిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. అవసరమైతే జలసాధను ముట్టడిస్తామని, తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని తేల్చిచెప్పారు. పంపులు ఆన్ చేయకుండా యాగాలు చేస్తే రైతులకు నీళ్లు రావు.. మానవ ప్రయత్నం కూడా అవసరం అని కెటిఆర్ పేర్కొన్నారు.

తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీల వైఖరి చూస్తుంటే '8 + 8 = 0' అని తాము ఊరికే అనలేదని రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణ ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో ఒక్కరు కూడా గట్టిగా మాట్లాడటం లేదని విమర్శిం చారు. కేంద్ర ప్రభుత్వం కెన్-బెత్వా, పోలవరం, అప్పర్ భద్ర వంటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పిస్తుండగా, తెలంగాణలోని పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వబోమని పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పినా ఒక్క తెలంగాణ ఎంపీ కూడా ప్రశ్నించ లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని పాలమూరులో బీజేపీ నేతలు గతంలో హామీ ఇచ్చారని, ఇప్పుడు కేంద్రాన్ని నిలదీసే ధైర్యం కూడా తెలంగాణ ఎంపీలకు లేకపోవడం దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేసేది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. ప్రజలు భవిష్యత్తులో తెలంగాణ హక్కుల కోసం పోరాడే వారినే ఎన్నుకోవాలని కోరారు.



మంగళవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

పంప్‌హౌస్‌లను ఆన్ చేసి రైతులకు నీరు అందించకుండా ప్రభుత్వం యాగాల పేరుతో ప్రజల దృష్టిని మళ్లిస్తోందని కేటీఆర్ విమర్శించారు. నార్లాపూర్, కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. "వరుణ యాగాలు చేయడంలో తప్పులేదు. కానీ యాగంతో పాటు చేయాల్సిన పని కూడా చేయాలి. దైవ ఆశీర్వాదానికి మానవ ప్రయత్నం తోడవాలి" అని అన్నారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని రైతులకు సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కేటీఆర్ స్పష్టం చేశారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
RFP Tender Notice No.01/2026-27 /COC/Dt:11-08-2026
01. No. of Works : 1 (One) (RFP Tender)
02. Down loading Starting Date : 14-08-2026 10.30 AM
03. Down loading End Date : 31-08-2026 @ 5.00 PM
04. Last date for Submission of bid : 31-08-2026 @ 5.01 PM
Further details at http://www.eprocurement.gov.in
O/o the Executive Engineer (PD) Division
Sd/- Commissioner

వార్త


ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

- బెర్ట్రండ్ రస్సెల్

# 'సర్'కి హంసపాదులెన్నో !

ఎందుకో ఏమోకానీ ఏ ముహుర్తాన సర్ ప్రారంభించారో గానీ ఆది నుంచి అన్నీ హంసపాదులతోనే నడుస్తోంది. తాజాగా తెలంగాణలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ గడువు ముగిసింది. ఆఖరి క్షణాల్లో కూడా ఆదరాబాదరాగా తమ ఓటు ఉందో లేదో చూసుకోవడం 'సర్'కి అవసరమైన పత్రాలు చూసే పనిలో ఓటర్లంతా అప్రమత్తం కావడం విశేషం. అయినా తెలంగాణలో కోటి 31 లక్షల వయోజనుల ఓటు హక్కు అనిశ్చితిలోకి నెట్టబడిందన్న ఆరోపణలు నడుస్తున్నాయి. చాలా రాష్ట్రాలతో పోల్చి చూస్తే 'అనామలీస్' లెక్కల జాబితాలో దాదాపు 73 లక్షల ఓట్లు ఉండి ఉంటాయన్న అంచనా. వీరిలో చనిపోయినవారి ఓట్లు తొలగింపు, రెండేసి చోట్ల ఒకే వ్యక్తికి ఓటుహక్కు లభించగా వాటిలో ఒక దానిని తొలగించే విషయంలో బిఎల్ఓల యంత్రాంగం చేసిన ప్రయత్నాలు సానుకూల పడకపోవడంతో అన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. తెలంగాణలో మొత్తం 3.38 లక్షల పైచిలుకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తే వాటిలో చాలా ఫారాలు డిజిటలైజేషన్‌కు చేరలేదు. వివిధ రాజకీయ పార్టీలు తమ యంత్రాంగాన్ని సిద్ధం చేసినా ఓటర్ల జాబితాలో తొలగింపులు సమంజసంగా ఉన్నాయా? లేదో ప్రక్రియలో ముందడుగు వేయలేకపోయారు. ఈ రాష్ట్రంలో మొత్తం ఓటర్లలో వివరాల సరిపోల్చుకోలేని పరిస్థితులలో కొన్ని పోతే రేపు ఎన్నికల సమయంలో 'పోలింగ్ బూత్' వరకు ఎంత మంది వస్తారు? ఎందరు సెలెక్టిక్ ఓటర్లుంటారు. ఏ పార్టీని ఎన్నుకోవాలని ఆకాంక్షిస్తారో ఇవన్నీ లెక్కలేసుకుంటే అన్నిటి కన్నా ప్రధాన రాజకీయ పార్టీలకే సమస్యలు మెడకు చుట్టుకుంటాయి. ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించగానే ఓటు హక్కు పునరుద్ధరణ, పునర్విచారణలో వాటిలో కొన్ని తిరిగి జాబితాలో సర్దుబాటవుతాయి. తమ వివరాలతో మరోసారి ఎన్నికల కమిషన్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని కలిస్తేనే ఓటు హక్కు నిలిచే అవకాశం ఉంది. ఈ విషయంలో ఎంత మంది శ్రద్ధ వహిస్తారో ఎవరికీ అర్థంకాదు. ముసాయిదా జాబితా ప్రకటనలోగానే ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేసుకునే ప్రక్రియలో అధికార పార్టీ ముందుంది. ఎన్నికలవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించడం మంచిదే కానీ అనాలోచితంగా పెట్టిన షరతులు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తడమే ఆక్షేపణీయం. ఉనికి దొరకని ఓటర్ల పేరుతో దొంగ ఓటర్ల జమానాకు అవకాశమివ్వకుండా వాళ్ల పేర్లు తొలగించడం ఎంత ముఖ్యమో నిజమైన ఓటు హక్కును కాపాడడమూ అంతే ముఖ్యం. ఓటర్ల జాబితాలో లోపాలను గుర్తించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే కానీ ప్రతి తొలగింపును రాజకీయ ఆరోపణలకు ఆస్కారంగా తీసుకోవడం పార్టీలకు అంత మంచిది కాదు. కానీ 'సర్' ప్రకియ మొదలైనప్పట్నించి అన్ని రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియపై అనుమాన బీజాలు మొలకెత్తాయి. అందుకే 'సర్' ప్రక్రియ ఆసాంతం తప్పులతడకగా భావించే ఆస్కారం కలిగింది. దానికితోడు కారణాలేమైనా భారీ ఎత్తున తొలగింపుల సంఖ్య ఉండడంతో రాజకీయ పార్టీల్లో అలజడి రేగింది. జంటనగరాల్లో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ఇప్పటిదాకా 56.3శాతంమాత్రమే ఉంది. దాంతో విద్యావంతులకు చెందిన ఎన్నో ఓట్లు తొలగించబడినట్లుగా నిర్ధారణ జరగడంతో ఎక్కడో ఏదో తేడా ఉన్నట్లు గోచరిస్తోంది. ఇలాంటి సమస్యలు పరిష్కరించి అందరికీ ఓటు హక్కు కల్పించాలి. ఓటు హక్కు లేదని బాధపడే వారుండకూడదు. అనే లక్ష్యంతో ముందుకు నడిచేటప్పుడు కొన్ని సాధక బాధకాలుంటాయి. తెలంగాణకు సంబంధించి హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వలస జనాభా ఎక్కువ. సమస్యకు మూలం ప్రధానంగా 2002 నాటి ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవడమే కాగా 'సర్' ఉద్దేశం. నిజమైన ఓటర్లను తొలగించడం కాదు. జాబితాను ప్రక్షాళించడమేనని ఒకటికి పదిసార్లు విన్నవించుకున్నా జాబితా ప్రక్షాళన మరింత సంక్లిష్టం అయిపోతోందనే సంశయానికి దగ్గరలో వరకు తీసుకెళ్లింది. తాజా విషయాల్లోకెళ్తే, హైదరాబాద్‌లో 45 శాతం మాత్రమే మ్యాపింగ్ జరిగింది. ఈ కారణాల రీత్యా హైదరాబాద్‌లో ఓటరు జాబితాలో సవరణలు ఎంత గ్యాప్ ఉందో తెలుసుకోవచ్చు. డ్రాఫ్ట్‌జాబితా తర్వాత ప్రభుత్వం మరిన్నిజాగ్రత్తలు తీసుకోవాలి.ఆధార్, ఫోన్ నంబరు ద్వారా కూడా ఓటర్ల ధ్రువీకరణ విధానాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియలో మరిన్ని సహకార కేంద్రాల ఏర్పాటు కూడా అవసరం. మూడో దశలో 16 రాష్ట్రాలు,3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ కొనసాగుతోంది. ఇంతకు పూర్వమే జరిగిన రెండో దశ 10 రాష్ట్రాల్లో, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో 5.72 కోట్ల పేర్లు జాబితా నుంచి తొలగించారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 2.05 కోట్ల ఆంధ్రప్రదేశ్‌లో మూడో దశలో 44.89లక్షలు ఐదారు కోట్ల ఓట్లు తొలగింపు ప్రధానంగా జరిగింది. వీటికి లెక్కాపత్రాలుండవని చెప్పలేం కానీ ఎవరికి కొత్తగా ఓటుహక్కు కల్పించబడిందో ఎవరికి ఆ హక్కు తొలగించబడిందో తెలియని గందరగోళ పరిస్థితిఏర్పడింది. ఈరాష్ట్రంలో దాదాపు 44.89 లక్షలమేరకు ఉంది. ఇకపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల ప్రక్రియ ఉంది.పౌరుని ప్రజాస్వామ్య హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగింపునకు గురవరాదు. తెలంగాణలో ఓటర్ల వద్ద నుంచి సేకరించిన 78.26శాతం ఎన్యూమరేషన్ ఫారాల సమీక్ష, ఇంకా వారి నుండి సేకరించలేకపోయిన 22 శాతం ఫారాలను కూడా విస్తృత తనిఖీ, సేకరణ సమీక్షల ప్రాతిపదికన వారి హక్కులు తేల్చగలిగితేనే ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గండం గడిచి మెట్లెక్కుతుంది. దాదాపు ఐదో వంతు ఓటర్ల పేర్లు తుది జాబితా నుంచి తొలగించే ప్రమాదం నుంచి కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషనరే.

మిమ్మల్ని ప్రతిదానికీ పొగిడేవాడు మీకో రహస్య శత్రువని గమనించాలి.



అరిస్టాటిల్

వినపడనివారు కాదు, మంచి మాట వినిపించుకోనివారు నిజమైన బధిరులు.



డబ్ల్యు.ఎమర్సన్

## ప్రజావాక్కు



### కల్తీ నూనెలతో కేన్సర్

మననగరాలు,పట్టణాలలో హోటళ్ళుఅనేకంగా ఉన్నాయి. ఈ హోటళ్ళలో వంటలకు, మిఠాయిలకు, తిను బండారా తయారీకివాడే వంటనూనెలను ఒకసారికంటే ఎక్కువ సార్లు వాడటంతో ప్రజలు క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు గురిఅవుతున్నారు. వాడిన వంటనూనెను పదేపదే వాడటం నిషేధంఅయినా అనేక హోటళ్ళ యజమానులు పట్టించుకోవటం లేదు. అయితే దీనికో పరిష్కారం ఉంది. వాడేసిన వంటనూనెలను ప్రాసెస్ చేసి బయోడీజిల్ తయారీకి ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు మన దేశంలో అనేకపట్టణాలు,నగరాలలో హోటళ్ళవారి నుంచి వాడేసిన వంట నూనెలను సేకరిస్తున్నారు. దీనివల్ల హోటళ్ళ వారికి రాబడేకాకప్రజల ఆరోగ్యాలు కాపాడబడతాయి.శిలాజ ఇంధనాల కంటే బయోడీజిల్ ఉత్తమం. ఆహార భద్రతాధికారులు ఈ విషయమై లోతుగా ఆలోచించి ఒక ప్రణాళిక రూపొందించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### శిక్షణా సదుపాయాలు కల్పించాలి

గ్లాస్గోలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ 13 స్వర్ణాలతో సహా మొత్తం 39 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలవడందేశ క్రీడారంగానికి ప్రోత్సాహకరమైన పరిణామం.ఈవిజయం యాదృచ్ఛికంగా రాలేదు. సరైన ప్రణాళిక,మెరుగైన కోచింగ్, ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం, ఆధునిక శిక్షణా కేంద్రాలు, క్రీడాకారుల నిరంతర శ్రమకలిసి ఈ ఫలితాన్ని అందించాయి. ఇది భారత క్రీడా విధానానికి కొత్తదిశనుసూచిస్తోంది.భారత్ ఇంకా ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగాలంటే భారీ క్రీడా ఈవెంట్ల నిర్వహణ కంటే క్రీడాకారుల అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచస్థాయి స్టేడియాలు నిర్మించడం అవసరమే అయినప్పటికీ, వాటిని వినియోగించే ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడం మరింత ముఖ్యమైనది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### జీవితం శాశ్వతం కాదు

ఈ బాహ్య ప్రపంచంలో సాధారణ మానవుని జీవితం ఎప్పుడూ ఎలా నిర్జీవంగా మారుతుందో అంచనా వేయలేం. అందుకే ప్రతిక్షణం కుటుంబ సభ్యులతో, సన్నిహితులతో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతూ జీవన విధానాన్ని ముందుకు సాగించాలి. ఆరోగ్యానికి ఎక్కువ సమయం కేటాయించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### వాన నీటిని ఒడిసి పడదాం

ప్రకృతి మనకు అందించే అమూల్యమైన వరం వాన నీరు. ఇంటి పరిసరాల్లో చిన్న ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వాన నీటిని నిల్వ చెయ్యాలి. ఇలా చేయడం వల్లవర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా భూమిలోకి ఇంకి భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడుతుంది. ప్రతి ఇంట్లోనూ సాధ్యమైనంత మేరకు వాననీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి కొరతను ఎదుర్కోవాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి. నీరు లేకుండా జీవనం సాధ్యం కాదు కాబట్టి, వాన నీటిలో ప్రతి చుక్కను విలువైనదిగా భావించి సంరక్షించాలి.నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం కూడా ప్రతిపౌరుడి బాధ్యత. మనం కాపాడే ప్రతినీటిచుక్క భవిష్యత్తు తరాలకు ఎంతోవిలువైన సంపదగా మారుతుంది. వాననీటిని ఒడిసి పట్టి, భరోసా కల్పిద్దాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### విశ్వాస ఘాతుకులదే రాజ్యం

వీరిని నేనెందుకు పోషించాలి, వీరిభారం నేనెందుకు మోయాలి, వీరి కోసం నా డబ్బు ఎందుకు ఖర్చు చేయాలి అనుకునే పుత్రరత్నాలు తల్లిదండ్రులనువృద్ధాశ్రమాలకు తరలిస్తున్నారు. అది కూడా దండగ అనుకునే ప్రబుద్ధులు నడిరోడ్డుమీద వదిలిపెట్టిపోతున్నారు. కొందరు మంచి వాళ్ల తల్లిదండ్రులపై ప్రేమగౌరవం ఉన్నవారుకూడా పెళ్లికాగానే మారిపోతున్నారు. భార్య చెప్పే మాటలు విని తల్లిదండ్రులను చూడ్డం మానేస్తున్నారు. వారిలానే ఈ మధ్య కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థబుద్ధిని చూపుతున్నారు. అధికారం ఉన్నన్ని రోజులు ఒకపార్టీలో ఉండి పదవులు అనుభవించి ఆ పార్టీ అధికారం కోల్పోగానే పార్టీకి ద్రోహం చేస్తున్నారు.

- రాశి, హైదరాబాద్

### ఉపాధి హామీలో ప్రత్యామ్నాయ పంటలు

పంటల వైవిధ్యం గురించి ఇప్పటి ఎల్‌నీనో ప్రభావం గురించి రాష్ట్రాలు మాట్లాడుతూనే ఉన్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో తిరిగినప్పుడు పంటల వైవిధ్యానికి రైతులు కొన్ని ప్రయత్నాల ద్వారా ముందుకు వస్తున్నా ప్రభుత్వ సబ్సిడీల గురించి వారు అడుగుతున్నారు. మాఖన అని బీహార్ హర్యానలో పండే పంట ఈ పంట పండించడానికి అణువైన పరిస్థితులు తెలంగాణలో కూడాఉంది. తెలంగాణ ఫారం పౌండ్స్ కుంటలు చెరువులు ఆ మాఖానా సాగుకు అనువుగా ఉన్న పరిస్థితులు. కావున ఒక పంటకు ఉపాధి హామీలో కొంత మెయింటనెయన్స్ ఇస్తే రైతులు ముందుకు వస్తారు.

-భారత అవినాష్, జనగామ

# కొత్త ఒడంబడికలతో మరిన్ని సంఘర్షణలు!

**ప్రస్తుత కాలంలో ఒడంబడికలు కుదరట మనేది మేలు చేకూరుస్తుందని ఏ దేశమూ నమ్మే పరిస్థితిలో లేదు!కాలమే ఈ ఒడంబడికల కాలం ఇంకా చెల్లుబాటు అవుతుందా అన్న సందేహాన్ని తీర్చగలదు. కృత్రిమ మేథ తెర మీదికి వచ్చిన నేపథ్యంలో సాంప్రదాయ రీతుల్లో యుద్ధాలను కొనసాగించే స్థితి కనుమరగవుతున్నది. ప్రస్తుతం వున్న సంఘర్షణల్లోంచి ఇలాంటి రక్షణపరమైన ఒడంబడికలు మరిన్ని పుట్టుకొని వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు! ఇజ్రాయిల్ అమెరికా, మొదట్లో గోటితో పోతుందనుకున్న సమస్య గొడ్డలిదాకా రావటం అందర్నీ ఆశ్చర్యపరుస్తునే వుంది! అయితే సాంకేతికంగా వృద్ధి పొందుతూ ఎ.ఐ ని అనుకూలంగా ఉపయోగించు కొనేందుకు సిద్ధపడుతున్న దేశాలు ఎలాంటి విపరీత పరిణామాలకు దారితీసే విధంగా ప్రవర్తిస్తాయో వేచి చూడాల్సిందే!**



రావులపాటి సీతారాంరావు

వెస్ట్ ఆసియా దేశాలు పాకిస్థాన్లో మక్కాలో చేసుకున్న ఒడంబడిక ఒక విధంగా అమెరికా ఇజ్రాయిల్ దేశాలకు అనుకూలంగా ఇరాన్ యుద్ధ నైపుణ్యాన్ని నియంత్రించటానికి అమెరికా పన్నిన ఎత్తుగడా అని అంతర్జాతీయ విశ్లేషకులు సందేహిస్తున్నారు! ఒక్క పాకిస్థాన్ దేశానికే అణ్వాయుధాలు వున్నాయి! వెస్ట్ ఆసియాలోని సౌత్ అరేబియా, టర్కీ దేశాలలో అమెరికా యుద్ధ స్థావరాలను ఎన్నో సంవత్సరాల క్రింద ఏర్పరుచుకొని ప్రపంచదేశాల నాయకత్వాన్ని పదిలంగా ఉంచుకోటానికి నాటో సియస్ సంస్థలను స్థాపించి సోవియట్ రష్యా, చైనాలను అదుపులో ఉంచేందుకు వేసిన ప్రణాళికలో భాగమని అందరికీతెలుసు! అప్పట్లో అలీన విధానాన్ని రూపొందించి ఇండియా ముస్లిం దేశాలతో మరికొన్ని దేశాలకు నాయకత్వం వహించి తటస్థంగా వుండటం ఎంత మంచిదో తర్వాత కాలాల వారికి తెలిసింది! యు.యన్.ఓ ఈ రాజకీయ సమీకరణకు కాస్తఊతం ఇచ్చినట్లయితే యు.యన్.ఓ స్థాపనకు ఒక అర్థమూ ప్రయోజనమూ సమకూరేది! దురదృష్టవశాత్తు అది జరగక పోవటం వల్ల ప్రపంచ దేశాల మధ్య వచ్చే గొడవలకు ఎంపైర్ లేకుండా పోయినట్లయింది! యు.యన్. ఓ ఎంపైరింగ్‌జాబ్ వదిలేసి 'సైలెంట్ స్పెక్టేటర్'గా మారింది! అందువల్లే ఏ అంతర్జాతీయ సమస్య అయినా, సంఘర్షణలు ఐనా పరిష్కారం లేకుండా ఏళ్ల తరబడి ఇబ్బందులను కలిగిస్తూనే ఉన్నాయి! ఆగస్టు 7న జరిగిన ఈ మక్కా ఒడంబడిక, ఒక విధంగా ఇరాన్‌ను నిలువరించే శక్తియుక్తులు క్రమేపీ కరిగిపోవటంతో, యు.యస్.ఏ ఈ కొత్త ప్రణాళికకు తెరదీసిందా అన్న అనుమానం సామాన్యులకు గూడా కలుగుతున్నది! ఈ మూడు దేశాలు 'జాయింట్ సెక్యూరిటీ' పేరుతో చేసుకున్న ఈ అగ్రిమెంట్ ఈ మూడు దేశాలలోని ఏ ఒక్క దేశంపై మరో దేశం దాడిచేయ ప్రయత్నించినా మిగతా రెండు దేశాలు తమ దేశాల మీద దాడిగానే భావించి సమిష్టి రక్షణలో భాగంగా దాడిచేసిన దేశం కానీ దేశాలను కాని, నిలవరించి, దాడులను త్రిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపేందుకే ఈ 'ఒడంబడిక' పనికి వస్తుంది! నాటో అంతరించిన నేపథ్యంలో ఈ సమిష్టి రక్షణ ఒడంబడికలు ఎంతవరకు ఉపయోగపడ్తాయో అప్పుడే చెప్పటం కష్టం కానీ అణ్వాయుధాలతో డ్రోన్‌లతో నవ్యతతో కూడుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో అన్నిటినీ మించి ప్రస్తుతం వరంగా వెలిసిన 'కృత్రిమ మేధ' (ఎ.ఐ) ఆయుధంతో, ఇలాంటి రక్షణ ఒడంబడికలు నామమాత్రంగానే మిగులుతాయేమో! పాకిస్థాన్ ఇండియాతో వున్న పరిస్థితులను ఎదుర్కోటానికి, పి.ఒ.కే (పాకిస్థాన్ ఆక్యుపైడ్ కాశ్మీర్)ను నియంత్రించటానికి, బెలూచిస్థాన్ రెబెలియన్ తట్టుకోలేక ఈ ఒడంబడికకు సిద్ధపడిందా అన్న అనుమానం కూడా యుద్ధ నిపుణులకు కలుగుతున్నది! నిన్న మొన్నటిదాకా, అమెరికా సందిట చేరి, ఇరాన్ ఇజ్రాయిల్ దేశాల మధ్య మధ్యవర్తిత్వం నెరిపిన పాకిస్థాన్, అమెరికా, ఇరాన్‌ను పూర్తిస్థాయిలో ఎదుర్కోలేని దశలో, ఈ కొత్త పాచికకు తెరతీసినట్లుంది! హోర్ముజ్ జలసంధి ద్వారా తమకు సంబంధించిన చమురు నౌకలను క్షేమంగా తమ తీరాలకు చేరాలనుకున్న పాకిస్థాన్‌కు ఇరాన్ స్పష్టంగా పాక్ నౌకలను అనుమతించమని తేల్చి చెప్పటంతో విధిలేని పరిస్థితులలో ఈనిర్ణయం తీసుకోవల్సి వచ్చినట్లుంది! ఇరాన్, పాక్ దేశాల మధ్య షియా, సున్నీ



మతపరమైన గొడవలు అనాది నుంచీ వున్నాయి! పైపైన కనపర్చిన స్నేహ సంబంధాలు ఈమధ్య కాలంలో ఏర్పడిన మార్పుల వల్ల బహిరంగంగా వదులుకోక తప్పటం లేదు! ఇండియా, చైనా దేశాలకు ఇరాన్ ఆయిల్ షిప్స్ అనుమతిస్తున్నట్లు ప్రకటించటంతో ఇరాన్‌తో వున్న సంబంధం పూర్తిగా తెగినట్లయింది! అమెరికా వెస్ట్ ఏషియా ఇజ్రాయిల్‌దేశాల సమిష్టి బలాలకు ధీటుగా ఇండియా, రష్యా చైనా తమ స్నేహ సంబంధాలను మరింతగా మెరుగుపర్చుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. బహుశా రానున్న కాలంలో అదే జరగొచ్చు! మాటిమాటికి ట్రంప్ ఉపయోగిస్తున్న 'శాంక్షన్స్' ఆయుధం వాడితగ్గిపోయింది! ఈమూడు దేశాలు అమెరికా డాలర్ విలువను తగ్గించటానికి తమ కరెన్సీ తమ తమ దేశాలలో చెల్లేట్లు చేసుకొని డాలర్‌ను బలహీనపర్చేందుకు చేసిన ఆలోచన ఇతర దేశాలు ముఖ్యంగా యూరోపియన్ స్కాండినేవియన్ దేశాలను కూడా కలవరపరుస్తున్నది! ఫ్రాన్స్,అమెరికా దేశాలు దూరమవుతున్న సంకేతాలు ఈ మధ్య ఇరు దేశాల నేతల మధ్య జరిగిన గొడవ స్పష్టపరుస్తున్నది! ఇదివరకు జరిగిన అంతర్జాతీయ ఒడంబడికలు రెండు బలమైన దేశాలు అమెరికా, రష్యాల నాయకత్వాన్ని ప్రోత్సహించేం దుకు, బలపర్చేందుకు ఏర్పడినవే! ఇప్పుడు కాలం మారింది! ప్రాంతీయంగా బలంగా వున్న దేశాలు, తమ తమ బలాలను పెద్ద దేశాలకు ధీటుగా తమ స్వీయ రక్షణకు ఏర్పరుచుకొనేందుకు సిద్ధంగా వున్నట్లు ఈ 'మక్కా ఒడంబడిక' బహిర్గత పరుస్తున్న మాట నిజం! అమెరికా దేశంలో అన్ని రకాల ఆయుధాలు ఈ మధ్య ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో ఉపయోగించటం వల్ల వాటి నిలవల సంఖ్య బాగా తగ్గిపోయి ఆయుధాలు ఉత్పత్తి చేసే కార్మాగారాలు, కొత్త సామాగ్రిని అందుబాటులో ఉంచితేనే ఇజ్రాయిల్‌కు మరింత వత్తాసు పలికే అవకాశం ఉంది. అందుకే ప్రెసిడెంట్ ట్రంప్ రోజుకోమాట చెప్తూ చర్చలు సాగుతున్నాయనే అభిప్రాయం కలగచేసే పనిలో ఉన్నారు. అది ఒక విధంగా అమెరికా బలహీనతను ప్రతిబింబిస్తున్నది. నిజానికి ఈ డిఫెన్స్ డీల్ దాదాపు నెల క్రితమే డీల్ మీద సంతకం చేసిన దేశాలు భయంతో ఉండటంతో హడావిడిగా ఈ డీల్ కుదుర్చుకున్నారు. ఇరాన్ మీద దాడి ఇంకా ఒక పరిష్కారానికి రాకపోవటం వెస్ట్ ఏషియా దేశాలకు పెద్ద దెబ్బే! అన్ని అరబ్ గల్ఫ్ దేశాలు ఇరాన్ దాడుల వల్ల ఒత్తిడిని ఎదుర్కోలేని స్థితిలో ఉన్నాయి. ఇరాన్‌తో సంబంధం ఉన్న హౌతీస్ (అన్సరన అల్లా) గత నెలలో సౌదీ ఆయిల్ వనరుల మీద దాడి చేసి రెడ్ సీపోర్టుల మీద బ్లాకేడ్ విధించటం వల్ల కోలుకోలేని దెబ్బకు ఈ దేశాలు గురి అయ్యాయి. ఆయిల్ సరఫరా ఆగిపోయే స్థితి వచ్చింది. ఈ డీల్ వల్ల సౌదీ అరేబియాకు రక్షణ కలిగే అవకాశం లేదని ఇరాన్ అధికార ప్రతినిధి బాహాటంగా చెప్పటం ప్రస్తుతం అమెరికా వత్తాసు పలుకుతున్న వెస్ట్ ఏషియా దేశాలు ఎంతటి క్లిష్టస్థితిలో ఉన్నాయో చెప్పకనే చెప్పినట్లయింది. పాకిస్థాన్ ఈ డీల్‌లో ఉండటం వల్ల ఒడంబడిక నమ్మశక్యంగా కనపడటం లేదు. ఎందుకంటే సెక్యూరిటీ పార్టనర్‌గా మక్కా డీల్‌లో సంతకం చేసి మీడియేటర్‌గా ఇరాన్ యుద్ధంలో ఉండటం వల్ల ఈ ఒడంబడిక ఒక కొలిక్కి వచ్చేట్లు లేదని విదేశాంగ విజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ఏ ఒడంబడిక అయినా సంఘర్షణలు ప్రారంభమయితే ఆపలేదన్నది చరిత్ర చెప్పకనే చెబుతున్నది. కేవలం ఇలాంటి ఒడంబడికలు మేమూ యుద్ధానికి 'సై' అంటున్నాం అని గంభీరంగా సంకేతాలు ఇవ్వటానికే పనికివస్తాయి! ప్రస్తుత కాలంలో ఒడంబడికలు కుదరట మనేది మేలు చేకూరుస్తుందని ఏ దేశమూ నమ్మే పరిస్థితిలో లేదు!కాలమే ఈ ఒడంబడికల కాలం ఇంకా చెల్లుబాటు అవుతుందా అన్న సందేహాన్ని తీర్చగలదు. కృత్రిమ మేథ తెర మీదికి వచ్చిన నేపథ్యంలో సాంప్రదాయ రీతుల్లో యుద్ధాలను కొనసాగించే స్థితి కనుమరగవుతున్నది.ప్రస్తుతం వున్న సంఘర్షణల్లోంచి ఇలాంటి రక్షణపరమైన ఒడంబడికలు మరిన్ని పుట్టుకొని వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు! ఇజ్రాయిల్ అమెరికా, మొదట్లో గోటితో పోతుందనుకున్న సమస్య గొడ్డలిదాకా రావటం అందర్నీ ఆశ్చర్యపరుస్తునే వుంది! అయితే సాంకేతికంగా వృద్ధి పొందుతూ ఎ.ఐ ని అనుకూలంగా ఉపయోగించు కొనేందుకు సిద్ధపడుతున్న దేశాలు ఎలాంటి విపరీత పరిణామాలకు దారితీసే విధంగా ప్రవర్తిస్తాయో వేచి చూడాల్సిందే! ●

# మత్స్యకారుల భద్రతకు ఏదీ భరోసా?

కామిడి సతీష్ రెడ్డి

కొందరు మత్స్యకారులు లైసెన్స్, రిజిస్ట్రేషన్లు వంటివి సరిగా లేకుండానే చేపల వేటకు వెళుతూఉన్నారు. బైక్, కారు, లారీ ఇలా వాహనం ఏదైనా నడపాలంటే లైసెన్స్ ఉండాలి. టూ వీలర్ అయితే హెల్మెట్ ధరించాలి. కారు నడిపితే సీటు బెల్ట్ పెట్టుకోవాలి. ప్రమాదం జరిగితే ఆర్థికంగా నష్టపోకుండా తప్పనిసరిగా బీమా తీసుకోవాలి. వీటిలో ఏది లేకపోయినా అధికారులు జరిమానా వేస్తారు. ఇందుకోసం రహదారులపై ఎక్కడికక్కడ పోలీసులు కాపుకాసి తనిఖీలు చేస్తుంటారు. మరి సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో బోటు యజమానులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?,వాటిని పాటిస్తున్నారా?, లేదా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.విశాఖ జిల్లా గంగవరం పోర్టు సమీపాన ఈ నెల మొదటి వారంలో బోటు మునిగిపోయి ఆరుగురు మత్స్యకారులు మరణించారు. బోటు యజమాని ఒక్కడే బతికి బయటపడ్డాడు. ప్రభుత్వం తనకు ఏమీ సాయం చేయలేదని, చనిపోయిన కుటుంబాలకే రూ.10 లక్షల నష్టపరిహారం ఇచ్చిందని వాపోతున్నారు. నిన్నటికి నిన్న ఓ బోటు బ్రేక్ వాటర్స్ సమీపాన బోల్తాపడింది. ఇద్దరు గాయపడ్డారు. తమకు బోటుకు రూ.2 లక్షలు, వలకు రూ.2.5 లక్షల నష్టం జరిగిందని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ (ఏపీఎంఎఫ్ఆర్) చట్టం ప్రకారం సముద్రంలో చేపల వేటకు వెళ్లే ప్రతి బోటు తప్పనిసరిగా మత్స్య శాఖ అధికారుల వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. లైసెన్స్ తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.25 మాత్రమే. లైసెన్స్ ఫీజు రూ.50. నిబంధనల ప్రకారం రెన్యువల్ చేయించుకోవాలి. వేటకు వెళ్లే ప్రతిసారి ముందుగా సమీపంలోని సాగర మిత్రకు సమాచారం ఇవ్వాలి. ఏ బోటు వేటకు వెళుతుంది?,ఎంతమంది (పేర్లతో సహా) వెళుతున్నారు?, ఏ దిక్కున వెళుతున్నారు?, ఎంత ఆయిల్ పోయించుకొని వెళుతున్నారు? అనే వివరాలు అందించాలి.వేటకు వెళ్లే బోటు ఫిట్‌గా ఉందని సర్టిఫై చేయించుకోవాలి. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సర్వేయర్ సంయుక్తంగా బోటునుతనిఖీ చేసి, బాగుందని, వేటకు అనువైనదని, అందులో అన్నీ ఉన్నాయని సర్టిఫై చేస్తేనే రెన్యువల్ చేస్తారు. అప్పుడే అది వేటకు వెళ్లాలి. ప్రతి బోటులో ఎంత మంది ఉంటే అంత మందికి ప్రమాదంలో ఉపకరించే లైఫ్‌జాకెట్లు, అగ్నిప్రమాదం సంభవిస్తే నివారించడానికి ఫైర్‌ఫైటింగ్ ఎక్విప్‌మెంట్, బీమా పత్రాలు ఉండాలి. విశాఖపట్నంలో లక్ష రూపాయల నుంచి రూ.50 లక్షల వరకు ఖరీదు చేసే బోట్లు చేపల వేటకు వెళుతున్నాయి. చాలామంది పాత బోట్లను కేరళ, తమిళనాడు ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ వేటకు ఉపయోగిస్తున్నారు. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయించడం లేదు. రోడ్లపై వాహనాలను తనిఖీ చేసినట్టు హార్బర్‌లో బోట్లను ఎవరూ తనిఖీ చేయడం లేదు.అక్కడ కూడా రాజకీయాలు నడుస్తున్నాయి. సంఘాల నాయకులు తనిఖీలుజరగకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. తోటి మత్స్యకారులకు ప్రాణాపాయం అని తెలిసినా అధికారులకు సహకరించడం లేదని ఈత వచ్చునని, గంగమ్మ ఒడిలో పెరిగామని, ఏ నష్టం జరగదని సమర్థించుకుంటున్నారు. బీమా చేయించుకున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే కంపెనీయే నష్టపరిహారం ఇస్తుంది. ఆ దిశగా కూడా వారికి హితబోధ చేయడం లేదు. ఇకనైనా బోటుయజమానులు నిబంధనలు పాటించేలా చూడాలి. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు లేకుండా, బీమా చేయ కుండా సముద్రంలోకి పంపించే బోట్ల యజమానులపై క్రిమినల్ కేసులు పెడితే ప్రమాదాలూ తగ్గుముఖం పడతాయి. ప్రాణనష్టం తగ్గుతుంది.బోటు ఖరీదు రూ.లక్ష అయినా రూ.1.2 లక్ష సాయం మత్స్యకారులపట్ల కూటమి ప్రభుత్వం చాలా ఉదారంగా వ్యవహరిస్తోంది. లక్ష రూపాయల ఖరీదు చేసే బోటు అయినా సరే చేపల వేట నిషేధ సమయంలో బోటుకు ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున రూ.1.2లక్షల ఆర్థికసాయం చేస్తోంది. చేపల వేటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అధికారులు ప్రతి బోటును తనికీ చేయాలి. బోట్ డ్రైవర్స్ మద్యం సేవించి బోట్స్ నడపకుండా తగిన చర్యలు తీసుకోవాలి. కాలం చెల్లిన బోట్లను సముద్రంలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ●

# తలసరి ఆదాయంలో ముందుకు, పెట్టుబడుల్లో వెనుకకు



డాక్టర్ తిరునహరి శేషు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన ఈ 12 వసంతాల తన ప్రయాణంలో అనేక మైలురాళ్లను చేరుకుంటూ దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోటీపడుతూ అనేక ఆర్థికాభివృద్ధి సూచికలలో తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఫ్రంట్ రన్నర్ స్టేట్‌గా తెలంగాణ దేశంలో 11వ స్థానంలో పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో 13వ స్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్, అలాగే తలసరి జిఎస్‌ఐలో మూడవ స్థానం దక్కించుకుందని ప్రపంచ బ్యాంక్ తన నివేదికలలో వెల్లడి చేసింది. ఒక అస్పిరేషనల్ స్టేట్‌గా తెలంగాణ 2014 నుండి జి.ఎస్.డి.పిలోనూ తలసరి ఆదాయంలోనూ గణనీయమైన ప్రగతిని సాధించింది.5407 డాలర్ల తలసరి జిఎన్‌ఐతో తెలంగాణ రాష్ట్రం ఎగువ మధ్య స్థాయి ఆదాయ రాష్ట్రంగా (యుఎంఐఎస్) ఢిల్లీ కర్ణాటకల తర్వాత దేశంలోమూడవ స్థానాన్ని దక్కించుకుందని ఇటీవల ప్రపంచ బ్యాంక్ తన కంట్రీ ఇన్కమ్ క్లాసిఫికేషన్ 2026 నివేదికలో వెల్లడి చేసింది.6217 డాలర్ల తలసరి జిఎన్‌ఐతో ఢిల్లీ, 5579 డాలర్ల తలసరి జిఎన్‌ఐతో కర్ణాటక రాష్ట్రాలు దేశంలో తెలంగాణ కంటే ముందు వరుసలో నిలబడినాయి. తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు దక్షిణాది నుండి తలసరి జిఎన్‌ఐలో మొదటి ఐదు స్థానాలలో స్థానం దక్కించుకున్నాయి. ఆర్‌బిఐ నివేదిక ప్రకారంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను4,18,931 రూపాయల తలసరి ఆదాయంతో కర్ణాటక(4,33,326)తరువాత తెలంగాణ దేశంలో రెండవ స్థానంలో నిలిచింది. ఆర్‌బిఐ, నీతి ఆయోగ్‌ల నివేదికల ప్రకారంగా తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో దేశంలో రెండు మూడు స్థానాలలో నిలవటం రాష్ట్రఆర్థిక సామర్థ్యాన్ని తెలియజేస్తుంది.తెలంగాణ రాష్ట్రానికె చెందిన రంగారెడ్డి జిల్లా 11.46 లక్షలరూపాయల తలసరి జిఎన్‌ఐతో దేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుంది. దేశంలోని ప్రఖ్యాత సంస్థలు విడుదల చేస్తున్న నివేదికల ప్రకారంగా గడిచిన 12సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో గణనీయమైన వృద్ధిని సాధించినట్లుగా కనపడుతుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలు అభివృద్ధి సాధన ప్రక్రియలో భాగంగా పెట్టుబడులకి అనువైన వాతావరణాన్ని కల్పించే చర్యలు చేపడుతున్నాయి.2014 నుండి తెలంగాణ రాష్ట్రం కూడా విదేశీ, దేశీయ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల నుండి పెట్టుబడులను ఆకర్షించడానికి పెట్టుబడుల సాధన కోసం రాష్ట్రంలో అనువైన వాతా




వరణాన్ని కల్పించడానికి చర్యలు చేపడుతున్నా పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ రాష్ట్రం 13వ స్థానంలో నిలబడటం కొంత నిరాశపరిచిందనే చెప్పాలి. ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ 2026 నివేదిక ప్రకారంగా పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉన్న 28రాష్ట్రాలు 8 కేంద్రపాలిత ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్రం 13వ స్థానంలో పెద్ద రాష్ట్రాల జాబితాలో 10వ స్థానం దక్కించుకుంది. రాష్ట్ర ఏర్పాటు నుండి తెలంగాణ రాష్ట్రం కూడా పెట్టుబడిదారుల పెట్టుబడులకు రక్షణ కల్పించి పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం టీఎస్ ఐపాస్,ఐటి,ఎంఎస్ఎం ఈ పాలసీలను రూపొందించడమే కాదు పెట్టుబడులసాధన కోసం తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047తో పాటు హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుని కూడా నిర్వహించింది. హైటెక్ సిటీ తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్ సిటీని (ఫ్యూచర్ సిటీ) నిర్మిస్తుంది. అదేవిధంగా పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి స్వయంగా దావోస్ పెట్టుబడిల సదస్సులలో పాల్గొనటంతో పాటు అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ లాంటి దేశాలలో కూడా పర్యటించారు. హైదరాబాద్ లాంటి నగరం, పారిశ్రామిక అవసరాల కోసం 30వేల హెక్టార్ల భూమి ఉన్న ఏకైక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో 13వ స్థానంలో నిలబడటం కొంత నిరాశ కలిగించే అంశమే.పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే మెకానిజంగా కాకుండా పరిశ్రమలతో కలిసి నడిచే భాగస్వామిగా ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వ దృక్పథమని ప్రభుత్వం చెబుతున్నా ఆశించిన స్థాయిలో తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించలేకపోతుంది. పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడంలో గుజరాత్, మహారాష్ట్ర,తమిళనాడులు మొదటి వరుసలో నిలబడటంతో ఆ రాష్ట్రాలు ఎక్కువ మొత్తంలో పెట్టుబడులను సాధించగలుగుతున్నాయి.టీఎస్ ఐపాస్ లాంటి పారిశ్రామిక విధానం,పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నప్పటికీ ఈఅంశంలో రాష్ట్రం తన పరిస్థితిని మెరుగుపరచుకోవటానికి ప్రభుత్వ సంస్థాగత విధానాలను మరింత సరళీకరిస్తూ, మౌలిక సదుపాయాలను మరింత బలపరుస్తూ, పర్యావరణ స్థిరత్వాన్ని మెరుగుపరుస్తూ, సైబర్ ఆర్థికనేరాలను నియంత్రించటం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైనవాతావరణాన్ని కల్పిస్తే రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి యువతకి ఉద్యోగ అవకాశాలను విస్తృత పరచగలుగుతాం, రాష్ట్ర ఆదాయాన్ని కూడా పెంచే అవకాశాలుంటాయి. రాష్ట్ర ఆదాయం,తలసరి ఆదాయం ఎంత పెరిగినా ఉపాధిరహిత వృద్ధి నిజమైన ఆర్థికాభివృద్ధిని ప్రతిబింబించదు కాబట్టి దేశంలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో రెండవ స్థానంలో, మూడో స్థానంలో నిలిచినా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలను విస్తృత పరచకపోతే వాస్తవిక అభివృద్ధి లక్ష్యాన్ని తెలంగాణ రాష్ట్రం చేరుకోనట్లుగానే భావించాలి. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సిరియా మాజీ అధ్యక్షుడు బషేర్ అల్ అసద్‌కు మరణశిక్ష



**డమాస్కస్, ఆగస్టు 11:** సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు అక్కడి కోర్టు మంగళవారం మరణశిక్ష విధించింది. 14 ఏళ్ల అంతర్యుద్ధం సమయంలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించిన కోర్టు ఆయన పరోక్షంలోనే ఈ తీర్పు ఇచ్చింది. ఈ అంతర్యుద్ధంలో సుమారు 5 లక్షల మంది ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అసద్ సోదరుడి కుమారుడు అతెఫ్ నజీబ్‌కు కూడా కోర్టు మరణశిక్ష విధించింది. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేసేందుకు చేపట్టిన చర్యలకు నజీబ్ నాయకత్వం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యలే అనంతరం తిరుగుబాటుకు, అంతర్యుద్ధానికి దారితీశాయి. తీర్పు వెలువడే సమయంలో నజీబ్ కోర్టులోనే ఉన్నాడు.అసద్ 2011లో దారా ప్రావిన్స్‌లోని పొలిటికల్ సెక్యూరిటీ బ్రాంచ్‌కు అధిపతిగా పనిచేసిన మాజీ సిరియా ఆర్మీ బ్రిగేడియర్ జనరల్. అనంతరం ఆయనను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. 2024 డిసెంబర్‌లో తిరుగుబాటుదారులు డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవడంతో అసద్, ఆయన సోదరుడు మహెర్ రష్యాకు పారిపోయారు. దీంతో అసద్ 24 ఏళ్ల పాలనకు తెరపడింది. హయత్ తహ్రీర్ అల్‌షామ్ నేతృత్వంలోని తిరుగుబాటు దళాలు అసద్ డమాస్కస్ ప్యాలెస్‌ను స్వాధీనం చేసుకుని, ఫెరారీ, ఆస్టన్ మార్టిన్, రోల్స్ రాయిస్, బీఎండబ్ల్యూ వంటి విలాసవంతమైన కార్లతో నిండిన భారీ గ్యారేజీని కూడా తనిఖీ చేశాయి. అసద్‌కు మరో దగ్గరి బంధువు అతీఫ్ నజీబ్‌కు కూడా మరణశిక్ష విధించారు. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా ఉన్నారు. ఆ సమయంలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించినట్లు కోర్టు పేర్కొంది. 15 ఏళ్లలోపు చిన్నారులను ఉద్దేశపూర్వకంగా హతమార్చడం, హింసకు పాల్పడి మరణాలకు కారణం కావడం వంటి నేరాలకు నజీబ్ పాల్పడ్డారని కోర్టు నిర్ధారించింది. సిరియాలో కొత్తగా ఏర్పడిన తాత్కాలిక పాలకుల హయాంలో మాజీ ప్రభుత్వ నేతలపై జరుగుతున్న విచారణల్లో ఇది కీలక పరిణామంగా నిలిచింది. గత ప్రభుత్వంలో పనిచేసిన పలువురిపై ప్రస్తుతం కేసులు నడుస్తున్నాయి. ఇస్లామిస్ట్ నేతృత్వంలోని బలగాలు డమాస్కస్ వైపు దూసుకెళ్లడంతో 2024 డిసెంబరులో అసద్ కుటుంబంతో కలిసి సిరియా నుంచి పారిపోయారు. అనంతరం మాస్కోలో ఆశ్రయం పొందారు. మరోవైపు నజీబ్‌ను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. మాజీ ప్రభుత్వంలో విచారణ ఎదుర్కొంటున్న అత్యున్నత స్థాయి అధికారుల్లో ఆయన ఒకరు.

# కొలంబియాను కుదిపిన భూకంపం

## పెద్దసంఖ్యలో భవనాలు, ఆసుపత్రులు ధ్వంసం, 130మందిపైగా మృతి



**బొగోటా, ఆగస్టు 11:** పశ్చిమ కొలంబియాలో సంభవించిన శక్తివంతమైన భూకంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో కనీసం 132 మంది మృతి చెందగా, భారీగా ఆస్తి నష్టం జరిగింది. పలు భవనాలు, ఆసుపత్రులు దెబ్బతిన్నాయి. మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు సమాచారం. కొలంబియా జియోలాజికల్ సర్వీస్ ప్రకారం 21వ శతాబ్దంలో దేశంలో నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపం ఇదే. కొలంబియా అధ్యక్షుడిగా ఉన్న అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది రోజులకే ఈ విపత్తు చోటుచేసుకుంది. ఇదే సమయంలో పొరుగున ఉన్న వెనిజులాలోనూ జూన్‌లో వరుసగా సంభవించిన రెండు భారీ భూకంపాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ఆ ఘటనల్లో ఆరువేల మందికి పైగా మృతి చెందినట్లు సమాచారం. అనేక ప్రధాన టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులపై లాటిన్ అమెరికా ప్రాంతం ఉండటంతో భూకంపాలు ఈ ప్రాంతానికి తరచూ ముప్పుగా మారుతున్నాయి. గత శతాబ్దాల్లో ఈ ప్రాంతంలో సంభవించిన పలు భూకంపాలు భారీ ప్రాణనష్టానికి దారితీశాయి.హైతీలో సంభవించిన భూకంపం ఆధునిక చరిత్రలో అత్యంత ప్రాణాంతక ప్రకృతి విపత్తుల్లో ఒకటిగా నిలిచింది ఈ విపత్తు కారణంగా సుమారు 8 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం సంభవించింది. ఈక్వెడార్-కొలంబియా వరుసగా సంభవించిన శక్తివంతమైన భూకంపాలు ఈక్వెడార్, పలు ప్రాంతాలను ధ్వంసం చేశాయి. చారిత్రక అంచనాల ప్రకారం మొత్తం 70వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈక్వెడార్‌లో 40,000 మంది, కొలంబియాలో 30,000 మంది ఉన్నారు. పెరూ తీరానికి సమీపంలో సంభవించిన ఈ భూకంపం అనంతరం జరిగిన పరిణామాలు మొదటి భూకంపం కంటే కూడా ఎక్కువ ప్రాణనష్టానికి కారణమయ్యాయి. పర్వతంలోని భారీ భాగం కూలిపోవడంతో రాళ్లు, హిమనదుల మంచుతో కూడిన ప్రవాహం యుంగే, రన్రాహిర్కా తదితర ప్రాంతాల వైపు దూసుకెళ్లింది.ఈ శిథిల ప్రవాహం గంటకు 335 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినట్లు అంచనా. యుంగే పట్టణం దాదాపు పూర్తిగా పూడుకుపోయింది. అక్కడ సుమారు 19,000 మంది మృతి చెందారు. 10 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఈక్వెడార్‌లో సంభవించిన ఈ భూకంపం దేశంలోని విస్తారమైన ప్రాంతాలను తీవ్రంగా నాశనం చేసింది. రియోబాంబా, క్విటో, లతకుంగా, అంబాటో ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి ఈక్వెడార్ చరిత్రలో నమోదైన అత్యంత ప్రాణాంతక భూకంపంగా నిలిచింది. ప్రపంచంలో ఇప్పటివరకు నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపం 1960లో చిలీలో సంభవించిన 9.5 తీవ్రత గల వాల్డివియా భూకంపం. 30,000 మంది మృతి చెందారు. వెనిజులాలో సంభవించిన విపత్తు ఒకే భూకంపం కాకపోవచ్చని తరువాతి అధ్యయనాలు సూచించాయి. రాజధాని కారకాస్‌లో సుమారు 90 శాతం ప్రాంతం దెబ్బతిన్నట్లు సమాచారం. బార్కిసిమెటో, మెరిడా, లా గైరా, శాన్ ఫెలిపే ప్రాంతాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఆరికా సంభవించిన భారీ భూకంపం అప్పట్లో పెరూలో భాగంగా ఉన్న అరికా నగరాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అరెక్విపా, మొక్వెగువా, మొల్లెండో, ఇలో తదితర నగరాల్లోనూ భారీ నష్టం జరిగింది. గ్వాటెమాలాలో భూకంపంలో ఎక్కువ మంది నిద్రలో ఉండటంతో భారీ ప్రాణనష్టం జరిగింది.దాదాపు లక్ష చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విధ్వంసం చోటుచేసుకుంది. మట్టి ఇటుకలతో నిర్మించిన ఇళ్లు పెద్ద సంఖ్యలో కూలిపోయాయి. అనంతరం వచ్చిన ప్రకంపనలు కూడా మృతుల సంఖ్యను పెంచాయి.సుమారు 12 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

# 'వందేమాతరం' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

## జాతీయ గీతంతో సమానంగా చట్టపరమైన రక్షణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** జాతీయ గీతం జనగణమనతో సమానంగా జాతీయ గేయం వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి ఆమోదంతో ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 చట్టంగా మారింది. వందేమాతరం గీతాన్ని ఉద్దేశపూర్వకంగా పాడకుండా అడ్డుకోవడం లేదా గీతం ఆలపిస్తున్న సభకు ఆటంకం కలిగించడం ఇకపై నేరంగా పరిగణించబడుతుంది. ఈ చర్యలకు జాతీయ గీతం విషయంలో ఉన్న చట్టపరమైన రక్షణనే వందేమాతరానికి కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ బిల్లును జూలై 29న రాజ్యసభ ఆమోదించగా, జూలై 30న లోక్‌సభ ఆమోదం తెలిపింది. జూలై 24న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్, 1971లోని సెక్షన్ 3కు సవరణలు చేసింది.ఇప్పటివరకు జాతీయ గీతం జనగణమనను ఉద్దేశపూర్వకంగా పాడకుండా అడ్డుకోవడం లేదా దానిని ఆలపిస్తున్న సభకు అంతరాయం కలిగించడం మాత్రమే నేరంగా ఉండేది. ఈ నేరాలకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉండేది. రెండోసారి, ఆ తర్వాత జరిగే ప్రతినేర నిర్ధారణకు కనీసం ఏడాది జైలు శిక్ష విధించే నిబంధన కూడా ఉంది. భారత రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న చేసిన ప్రకటనను కూడా బిల్లులో ప్రస్తావించారు. బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం' భారత స్వాతంత్ర్య పోరాటంలో చారిత్రక పాత్ర పోషించిందని, జాతీయ గీతం జనగణమనతో సమానంగా దానికి గౌరవం, హోదా ఉండాలని అప్పట్లో రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ ఆరు చరణాల పూర్తి ఆలాపనకు సుమారు 3నిమిషాల 10సెకన్లు పడుతుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకల్లో తొలిసారిగా ఎర్రకోటప్రాకారాల నుంచి వందేమాతరంగీతాన్ని ఆల పించనున్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్‌షా వెల్లడించారు.

# జపోరిజ్జియాపై రష్యా క్షిపణి దాడి.. ఐదుగురు మృతి, 20 మందికి గాయాలు

**జపోరిజ్జియా, ఆగస్టు 11:** ఉక్రెయిన్‌లోని ఆగ్నేయ నగరం జపోరిజ్జియాపై రష్యా జరిపిన దాడిలో కనీసం ఐదుగురు మృతి చెందగా, మరో 20మంది గాయపడ్డారు. రష్యాదాడులతో మృతులు, క్షతగాత్రుల సంఖ్య మరింత పెరుగుతోందని జపోరిజ్జియా ప్రాంతీయ సైనిక పరిపాలన అధిపతి ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు.రష్యా బలగాలు నగరంలోని పారిశ్రామిక సంస్థలు, మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నాయని ఫెడోరోవ్ వెల్లడించారు. ఈదాడుల్లో గ్యారేజ్ కోఆపరే టివ్‌తో పాటు పలు నివాస భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. దాడి జరిగిన ప్రాంతంలో మంటలు చెలరేగిన దృశ్యాలను ప్రాంతీయ అధికారులు విడుదలచేశారు. నగరంపై క్షిపణులు, గైడెడ్ ఏరియల్‌బాంబులతో దాడి జరిగినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.అధికారులు తొమ్మిది మంది గాయపడినట్లు ప్రకటించగా, అనంతరం మృతుల సంఖ్య ఐదుకు, గాయపడిన వారి సంఖ్య 20కి పెరిగినట్లు వెల్లడించారు.

# కేన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించాలి: సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** దేశంలో క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించని 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వెంటనే ఆదిశగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. క్యాన్సర్ కేసులను తప్పనిసరిగా నమోదు చేయడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించడంతో పాటు బాధితులకు సరైన వైద్యం అందేలా చూడాలని స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసుల నేపథ్యంలో దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇప్పటికే 17 చోట్ల క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించినట్లు కోర్టుకు తెలియజేశారు.

# జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన

## పరీక్షల రద్దుకు సిద్ధమన్న సిఎం హేమంత్ సోరెన్



**రాంచీ, ఆగస్టు 11:** జార్ఖండ్‌లో జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ నియామక పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలు జరిగా యంటూ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ఆం దోళన 19వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. 14వ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షతో పాటు బ్యాక్‌లాగ్ పరీక్షలను రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మంగళవారం ప్రకటించారు.జేపీఎస్సీ పరీక్షల నిర్వహణకు బాధ్యత వహించిన లక్నోకు చెందిన ఐటీ సంస్థ టీడీపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలపై దర్యాప్తు జరిపిస్తామని సోరెన్ తెలిపారు. నియామక పరీక్షల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి ఐఐటీలు, ఐఐఎంలు వంటి ప్రముఖ విద్యాసంస్థల నిపుణుల సలహాలు తీసుకుంటామని చెప్పారు.పరీక్షల్లో ఫిర్యాదులు, ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమైన సందర్భాల్లో దర్యాప్తుకు ఆదేశించేందుకు ప్రభుత్వం వెనుకాడదని సోరెన్ స్పష్టం చేశారు. నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, సురక్షితంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.పరీక్షలు నిర్వహించిన టీడీపీఎల్ సంస్థపై కూడా సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ సంస్థకు బీహార్‌తో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి సంస్థలకు రాష్ట్ర యువత భవిష్యత్తును దెబ్బతీసే అవకాశం ఎలా కల్పించారని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీలో సీఎం సోరెన్ ప్రసంగిస్తున్న సమయంలోనూ ప్రతిపక్ష సభ్యులు నిరంతరం నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరీక్షలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని, ప్రతిపక్షాల ఆందోళనలతో సంబంధం లేకుండా తమ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తామని సోరెన్ స్పష్టం చేశారు.సోమవారం విద్యార్థుల అసెంబ్లీ మార్చ్‌ను ప్రస్తావించిన సీఎం పరిపాలన, పోలీసులు సంయమనంతో వ్యవహరించారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్, శాసన మండళ్ల వంటి రాజ్యాంగ సంస్థల పరిసరాల్లో సాధారణంగానే భద్రతా ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

# అమెరికాకు ఆంక్షల వ్యసనం పట్టింది: ఇరాన్



టెహ్రాన్, ఆగస్టు 11: తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు.అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని బఘాయీ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొన సాగిస్తే సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయ టపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజి టల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు.

**ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు:** ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జీసీ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

# ముందు సరిగ్గా బట్టలేసుకోండి

## ఆప్ ఎమ్మెల్యేకు ఢిల్లీ సిఎం రేఖాగుప్తా హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అండర్‌వేర్ మాత్రమే ధరించి మహిళల నుంచి వినతులు స్వీకరించిన ఆప్ ఎమ్మెల్యేపై ఢిల్లీ సిఎం రేఖాగుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. దుస్తులు సరిగ్గా వేసుకోవాలంటూ ఎమ్మెల్యేకు సూచించారు. ఢిల్లీ వాయువ్య ప్రాంతంలోని కిరారి నియోజకవర్గం నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి అనిల్ ఝా వాట్స్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాడు. అతడు తాజాగా తన ఇంటి దగ్గర బయట కుర్చీ, టేబుల్ వేసుకుని కూర్చున్నాడు. ప్రజల దగ్గర నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. కొందరు మహిళలు కూడా ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. అయితే, ఇవి స్వీకరించే సమయంలో ఆ ఎమ్మెల్యే ఒక ఫుల్ బనియన్, చిన్న నిక్కరు మాత్రమే ధరించి ఉన్నారు. అవి పూర్తిగా లోదుస్తులు. అలాంటి దుస్తులు ధరించి, ఇంటి బయట బహిరంగంగా కూర్చుని ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక ఎమ్మెల్యే ఇలా సరిగ్గా దుస్తులు వేసుకోకుండా ప్రజలకు సేవలందించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ అంశంపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా స్పందించారు. ఎమ్మెల్యే సరిగ్గా దుస్తులు వేసుకోవాలని సూచించారు.

# నిజాయితీ ఐఎఎస్‌కు లేచి నిలబడి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

**ముంబయి, ఆగస్టు 11:**నిబంధనల అమలులో కఠినంగా వ్యవహరిస్తారని పేరున్న ఓ ఐఏఎస్ అధికారికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయన వేదికపైకి వస్తుండగా అంతా లేచి నిలబడి కరతాళధ్వనులతో అపూర్వ స్వాగతం పలికారు. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) కమిషనర్ తుకారాం హరిభావు ముంధేకు పూణెలో ఈ అరుదైన గౌరవం లభించింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహారాష్ట్రలో ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై ఎఫ్‌డీఏ కమిషనర్‌గా తుకారాం ముంధే కొరడా ఝుళిపిస్తున్నారు. ఆయన నేతృత్వంలో ముంబైతో సహా రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత, ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని సుమారు 100 సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేశారు. ఈ కఠిన చర్యలు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. ఈ నేపథ్యంలోనే పూణెలోని బాల్ గంధర్వ రంగ మందిర్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి ముంధే హాజరయ్యారు. ఆయన వేదిక వైపు నడుస్తుండగా, సభలోని ప్రేక్షకులంతా ఒక్కసారిగా లేచి నిలబడి పెద్ద పెట్టున చప్పట్లు కొడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. చాలా మంది తమ ఫోన్లలో ఈ దృశ్యాలను బంధించారు. ఆయన తీసుకుంటున్న చర్యలకు ప్రజల నుంచి లభిస్తున్న మద్దతుకు ఈ సంఘటనే నిదర్శనం. బీడ్ జిల్లాలోని ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన, చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందుల మధ్య పెరిగారు. జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతూనే, తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేసేవారు. కష్టపడి చదివి, ఔరంగాబాద్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మరాఠ్వాడా యూనివర్సిటీలో ఉన్నత విద్యను పూర్తి చేశారు.

# సంక్షిప్త వార్తలు

## సిజెపి ప్రచారంపై పిల్.. సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** న్యాయ విచారణల సమయంలో చేసిన మౌఖిక వ్యాఖ్యలను సోషల్ మీడియా ప్రచారాలు, డిజిటల్ కంటెంట్ ద్వారా వాణిజ్యపరంగా దుర్వినియోగం చేయడం, డబ్బు సంపాదించడం వంటి ఆరోపణల నుండి రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై సుప్రీంకోర్టు మంగళవారం నోటీసు జారీచేసింది. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సిబిఐల నుండి స్పందనలను కోరి, తదుపరి విచారణను సెప్టెంబర్ 10కి వాయిదా వేసింది.

# నేతాజీ అస్థికల తరలింపు

## కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** స్వాతంత్ర్య సమరయోధుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ పార్థివ దేహాన్ని జపాన్ నుంచి భారత్‌కు తీసుకురావాలని ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రం స్పందనను కోరింది. నేతాజీ కుమార్తె అనితా బి. ఫాఫ్ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి, విదేశాంగ మంత్రిత్వ శాఖకు, హోం మంత్రిత్వ శాఖకు నోటీసులు జారీ చేసింది. సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు నేతాజీ కుమార్తె తరఫున సీనియర్ న్యాయవాది డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 28కి వాయిదా వేశారు. దశాబ్దాలుగా సుభాష్ చంద్రబోస్ అస్థికలుగా భావిస్తున్న వాటిని భద్రపరిచిన జపాన్‌లోని టోక్యోలో ఉన్న రెంకోజీ ఆలయం నుంచి నేతాజీ పార్థివ దేహాన్ని తిరిగి తీసుకురావాలని ఈ పిటిషన్‌లో కోరారు. నేతాజీ కుమార్తె చట్టబద్ధమైన వారసురాలు అయినందున, అనితా బోస్ ఫాఫ్ ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో ప్రస్తావించే హక్కు ఉందని పేర్కొన్నారు. పార్థివ దేహాన్ని భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు.

## అదానీపై అమెరికా కోర్టులో కేసు కొట్టివేత



**న్యూయార్క్, ఆగస్టు 11:** భారత బిలియనీర్, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై నమోదైన క్రిమినల్ మోసం, లంచం ఆరోపణల కేసును అమెరికా కోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ కేసులో విచారణను ముగించాలని అమెరికా న్యాయ శాఖ నిర్ణయించడంతో, బ్రూక్లిన్‌లోని అమెరికా జిల్లా న్యాయమూర్తి నికోలస్ గరాఫిస్ కేసును కొట్టివేయాలన్న ఫెడరల్ ప్రాసిక్యూటర్ల అభ్యర్థనకు అనుమతి ఇచ్చారు. కేసును ఉపసంహరించుకోవడానికి గల కారణాలపై న్యాయమూర్తి ప్రశ్నలు సంధించారు.కేసును ఉపసంహరించుకోవడానికి ప్రతిఫలంగా ఏవైనా హామీలు లేదా ఒప్పందాలు జరిగాయా అని న్యాయమూర్తి గౌతమ్ అదానీని నేరుగా ప్రశ్నించారు. అలాంటి ఒప్పందం గురించి తనకు తెలియదని అదానీ తెలిపారు.కేసు కొట్టివేతపై అదానీ స్పందిస్తూ, అమెరికా కోర్టు నిర్ణయాన్ని వినయంతో, న్యాయ ప్రక్రియపై గాఢమైన గౌరవంతో స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

## హార్ముజ్ జలసంధిలో భారీగా పడిపోయిన నౌకల రాకపోకలు



**వాషింగ్టన్/టెహ్రాన్:** అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ఆశలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో కీలకమైన హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు భారీగా తగ్గిపోయాయి. కేవలం ఆరు నౌకలు మాత్రమే ఈ జలసంధి మీదుగా ప్రయాణించినట్లు కేప్లర్ డేటా వెల్లడించింది. గత పది రోజుల సగటు రోజువారీ రాకపోకలు సుమారు 11 నౌకలుగా ఉన్నాయి. నాలుగు కమోడిటీ నౌకలు జలసంధిలోకి ప్రవేశించాయి. వీటిలో రెండు ఖాళీ ఆయిల్ ట్యాంకర్లు ఉన్నాయి. మరోవైపు ద్రవీకృత పెట్రోలియం వాయువు (ఎల్‌పీజీ)తో వెళ్తున్న చిన్న ట్యాంకర్, రిజిడ్యువల్ ఫ్యూయల్స్‌ను తీసుకెళ్తున్న మరో నౌక జలసంధి నుంచి బయటకు వెళ్లాయి.

# మిస్సింగ్‌లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాల్సిందే

## తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

## నివేదికివ్వాలంటూ కేంద్రం, రాష్ట్రాలకు నోటీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** తప్పిపోయిన వ్యక్తుల కోసం తక్షణమే ప్రథమ సమాచార నివేదికలను (ఎఫ్ఐఆర్‌లు) నమోదు చేయాలన్న తన ఆదేశం, వయస్సు లేదా లింగంతో సంబంధం లేకుండా పెద్దలు, పిల్లలు ఇద్దరికీ వర్తిస్తుందని భారత సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. జి. గణేష్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు అండ్ అదర్స్ కేసులో ఆగస్టు 5న వెలువరించిన తీర్పులో ఈ స్పష్టత ఇవ్వబడింది. 'వ్యక్తి' అనే పదాన్ని కేవలం పిల్లలకు మాత్రమే వర్తిస్తుందని కొన్ని రాష్ట్రాలు తప్పుగా అర్థం చేసుకోవడం పట్ల జస్టిస్‌లు అహ్సానుద్దీన్ అమానుల్లా, ఆర్. మహాదేవన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యానం కొన్ని రాష్ట్రాలు ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశంతో సృష్టించిన బూటకపు ప్రచారం అని కోర్టు పేర్కొంది. మే 22 నాటి మునుపటి ఉత్తర్వులో, తప్పిపోయిన వ్యక్తి గురించి సమాచారం అందిన వెంటనే ప్రతి పోలీస్ స్టేషన్ ఆలస్యం చేయకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. వయస్సు లేదా లింగంతో సంబంధం లేకుండా 'వ్యక్తి' అనే పదంలో అందరు వ్యక్తులు ఉంటారని స్పష్టతనిచ్చింది. ఈ ఆదేశాన్ని పాటించడంలో విఫలమైన ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం అయినా కోర్టు ధిక్కరణ చర్యలకు గురవుతుందని కోర్టు హెచ్చరించింది. అటువంటి సందర్భాలలో, ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై, వారు ఆదేశాన్ని పాటించకపోవడానికి గల కారణాలపై వివరణ ఇవ్వవలసి ఉంటుంది. ఒక వ్యక్తి అదృశ్యమైన తర్వాత, తరచుగా 'గోల్డెన్ అవర్స్' అని పిలువబడే తొలి గంటల ప్రాముఖ్యతను గుర్తించాలని పేర్కొంది. ఈ సమయంలో తప్పిపోయిన వ్యక్తిని విజయవంతంగా గుర్తించే అవకాశం గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, తప్పిపోయిన వ్యక్తి కేసు దర్యాప్తు కోసం వనరులను సమీకరించే ముందు 24 గంటల పాటు వేచి ఉండి పోలీసులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయకూడదు. అంతేకాకుండా, మే 22న ఇచ్చిన ఆదేశాలకు సంబంధించి తాజా స్థితి నివేదికలు, తీసుకున్న చర్యలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తప్పనిసరిగా సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అలా చేయని వారిని ప్రాథమికంగా కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా పరిగణిస్తారు. ముఖ్యంగా లడఖ్‌ను, సముచితంగా స్పందించడంలో తన వైఫల్యాన్ని స్పష్టం చేయడానికి వ్యక్తిగత అఫిడవిట్‌లను సమర్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా సంబంధిత డేటాబేస్‌లను తప్పనిసరిగా ఏకీకృతం చేయాలని ఆదేశించబడింది, దీనిని ఆరు వారాలలోగా పూర్తి చేయడానికి గడువు విధించబడింది. సుప్రీం కోర్టు ఈ విషయాన్ని అక్టోబర్ 5న మళ్లీ విచారించనుంది.

# రాజస్థాన్‌లో 106 నకిలీ సంస్థలు

**జైపూర్, ఆగస్టు 11:**రాజస్థాన్‌లో నకిలీ సంస్థల ద్వారా పన్ను ఎగవేత, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు వాణిజ్య పన్నుల శాఖ భారీగా తనిఖీలు చేపట్టింది. రాష్ట్రంలోని మొత్తం 16 జోన్లలో ఏకకాలంలో ప్రత్యేక తనిఖీలను నిర్వహించి అనుమానాస్పద సంస్థల కార్యకలాపాలను పరిశీలించింది. ఈ తనిఖీల్లో మొత్తం 137 సంస్థలను తనిఖీ చేయగా 106 సంస్థలు నకిలీవిగా తేలాయి. మరో 31 సంస్థలు వాస్తవంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నవిగా గుర్తించినప్పటికీ, వాటిలోనూ పన్ను సంబంధిత అవకతవకలు బయటపడ్డాయి.

# టిఎంసి బ్యాంక్ ఖాతాలు ఇడి జప్తు

## జోక్యానికి సుప్రీం 'నో', రెండు పిటిషన్లు కొట్టివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:**మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) స్తంభింపజేసిన తృణమూల్ కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలపై కోల్‌కతా హైకోర్టు విధించిన ఆంక్షల విషయంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ఇడి తమ ఖాతాలను స్తంభింపజేయడాన్ని సవాలు చేస్తూ టీఎంసీదాఖలు చేసిన పిటిషన్‌పై ఎలాంటి మధ్యంతర ఉపశమనం కల్పించేందుకు కోల్‌కతా హైకోర్టు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ [illegible] నేతృత్వంలోని టిఎంసి వర్గం దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పిబి వరలేలతో కూడిన ధర్మాసనం విచారించింది. అక్రమ ఆర్థిక లావాదేవీలు,వట్టిదర్యాప్తులో డబ్బు వసూలు చేయడం, కొన్ని పార్టీ ఖాతాల ద్వారా అనుమానాస్పద నిధులను మళ్లించడం వంటి ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ పోలీసులనమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా, మొత్తం రూ.440.42 కోట్ల నిల్వలు ఉన్న మూడు బ్యాంకు ఖాతాలను ఇడి స్తంభింపజేసిన విషయం తెలిసిందే.

# ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ కరెన్సీ!




**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** దేశంలో త్వరలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్‌లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీ చేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటుకు వెల్లడించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు ఆర్ బీ ఐ చట్టం1934 లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీ చేసే అవకాశం ఉంటుంది.

# డోర్నకల్ గద్వాల సర్వే డిపిఆర్ వేగవంతం చేయండి

## రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు ఎంపి మల్లు రవి వినతి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ మీదుగా డోర్నకల్-గద్వాల రైల్వేలైన్ ప్రతిపాదనపై వెంటనే సర్వే చేసి డిపిఆర్ రూపొందించడం వేగవంతం చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి కోరారు. మంగళవారం పార్లమెంట్ హౌజ్‌లో మల్లు రవి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గంతో పాటు తెలంగాణలోని మారు మూల ప్రాంతాలను ఈ మార్గం ద్వారా అనుసంధానం చేయడమే కాకుండా ప్రజల జీవనోపాధులు మెరుగు పరచడానికి, సామాజికఆర్థిక అభివృద్ధిని పెంపొందించడానికి ఈ రైల్వే లైన్ ప్రాముఖ్యతను కలిగి ఉందని వివరించారు. ప్రతిపాదిత రైల్వే లైన్ సర్వే, డిపిఆర్ వేగవంతం చేయడానికి పరిశీలన చేస్తామని, త్వరగా మంజూరు చేయడానికి వీలు ఉందాలేదా సాంకేతిక నిపుణులతో చర్చిస్తామని రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని మల్లు రవి తెలిపారు.

# సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చరిత్రను భావితరాలకు చాటిచెప్పాలి

## సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఈ నెల 21న విడుదల కానున్న సర్దార్ సర్వాయి పాపన్న సినిమా ట్రైలర్‌ను మినిస్టర్ క్వార్టర్స్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఆవిష్కరించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని, పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించి, మన ప్రాంతాన్ని మనమే పరిపాలించుకోవాలనే ఆలోచనతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం సాగించారన్నారు. గోల్కొండను వేదికగా చేసుకొని బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు ఆయన కృషి చేశారని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అనేక కోటలను జయించి, గోల్కొండ కోట వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరించారని మంత్రి పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, స్వయం పాలన, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను, ఆయన చేసిన పోరాటాలను నేటి తరానికి, భావితరాలకు పరిచయం చేయడంలో సినిమా, పుస్తకాలు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఆయన చరిత్రను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం అభినందనీయమని మంత్రి తెలిపారు. పాపన్న గౌడ్ చరిత్రను వెండితెరపై ఆవిష్కరిస్తున్న చిత్ర యూనిట్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు ప్రతాని రామకృష్ణ, దర్శకుడు, నిర్మాత లింగంపల్లి వెంకటేష్‌గౌడ్, డిస్ట్రిబ్యూటర్ పేపర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలి

## కాంగ్రెస్ మేనిఫెస్టో చైర్మన్ మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సిపిఎస్ యూనియన్ వినతి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సీపీఎస్ ఈయు) డిమాండ్ చేసింది. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని కోరుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో చైర్మన్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతోపాటు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంనరతి పొన్నం ప్రభాకర్‌ని కలిసి సీపీఎస్ యూనియన్ నాయకులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. టిఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధులు మంత్రులను వేర్వేరుగా కలిసి సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరారు. గత 22 సంవత్సరాలుగా సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కష్టార్జితంతో పాటు ప్రభుత్వ వాటా సొమ్ము కూడా షేర్ మార్కెట్ పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి రూ.20వేల కోట్లు ఎన్‌పిఎస్ ట్రస్ట్ ద్వారా షేర్ మార్కెట్‌కు వెళ్లాయని, పెన్షన్ విలువను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల ముందు వరంగల్ డిక్లరేషన్ సభలో ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని మంత్రులకు గుర్తుచేశారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం మేరకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని, అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం సీపీఎస్ విధానం శాపంగా మారుతోందని, ఇందులో కనీస పెన్షన్ గ్యారెంటీ లేదని, పాత పెన్షన్ విధానంలో రిటైర్మెంట్ సమయంలో బేసిక్ పేలో సగం పెన్షన్‌గా వచ్చేదని, కానీ సీపీఎస్ విధానంలో రిటైర్మెంట్ తర్వాత కనీస పెన్షన్ ఎంత వస్తుందో ఎలాంటి గ్యారెంటీ లేదన్నారు. సీపీఎస్‌లోని లోపాలను ఓపికగా విన్న మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారని ఈ అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తుందని, తప్పకుండా చేద్దామని, ముఖ్యమంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ.. మంత్రి వర్గంలో చర్చిస్తామని చెప్పారన్నారు.

# తెలంగాణ అస్తిత్వాన్ని హేళనచేసే బిజెపికి భవిష్యత్ లేదు

## బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావుపై విప్ బల్మూర్ వెంకట్ ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** తెలంగాణ విభజనను, అస్థిత్వాన్ని హేళన చేసిన బిజెపికి ఈ గడ్డపై భవిష్యత్ లేదనీ, ఎన్‌డిఎ భాగస్వామ్యులు కూడా పొరుగురాష్ట్రం ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రులు కూడా తెలంగాణ ప్రజలపై నిత్యం విద్వేషం కక్కినా కట్టడి చేయడంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విఫలమైనారని ప్రభుత్వవిప్ బల్మూరి వెంకట్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన మోసాలపై జనం తిరగబడుతున్నారనీ అన్నారు.జెన్ జీ దెబ్బకు ఢిల్లీలో మీ ప్రధాని, హోం మంత్రికే దిక్కులేకుండా పోయిందనీ ఇక మీ పని ఖతమే అని జోస్యం చెప్పారు. పార్లమెంట్ సాక్షిగా బిజెపి ఎంపి తేజస్వీ సూర్య తప్పుగా మాట్లాడిన తెలంగాణ నేతలు ఖండించలేదనీ ఆవేదన చెందారు.తెలంగాణ విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధుల విషయంలో రాష్ట్ర బిజెపి నేతలు, ఎంపిలు, కేంద్రంపై ఎందుకు మాట్లాడటం లేదనీ ప్రశ్నించారు.మిగతా రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదు ఈ విషయంలో బిజెపి నేతలు కేంద్రంతో ఎందుకు చర్చించడం లేదనీ ఆయన అడిగారు. ప్రజల సంక్షేమం కోసం వర్షాలు పడాలని, ముఖ్యమంత్రి వరుణ యాగం చేస్తే హిందువులమని చెప్పుకునే బిజెపి నేతలు యాగాన్ని కూడా కూడా వక్రీకరించడం బాధాకరమని అన్నారు.

# నేటి నుంచి పిఇసెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

## 14 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో చేరడం కోసం నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్(పీఈ) సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానుంది. 14 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం ఈ నెల 15న అర్హుల జాబితాను ప్రకటించనున్నట్టు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 18 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 18న వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 21న సెకండ్ ఫేజ్, ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీటు పొందిన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 27 వరకు కాలేజీల్లో చేరాలని కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. మొదటి విడతలో 1106 మందికి సీట్లను కేటాయించారు.

# ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ దసరా నాటికి అందుబాటులోకి రావాల్సిందే

## నిర్లక్ష్యం, పనుల్లో ఆలస్యాన్ని ఏమాత్రం సహించేది లేదు

## కారిడార్ కింద బిటి రోడ్డు పనులు నెలాఖరుకు పూర్తి చేయాల్సిందే

## ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 11,ప్రభాతవార్త:** ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ అక్టోబర్‌లో జరిగే దసరపండగ నాటికి అందుబాటులోకి రావాల్సిందే అని ఆర్ అండ్‌బి మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి ఖరాఖండిగా ఆదేశాలు జారీచేశారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షలో ఆర్ అండ్ బి సి.ఇధర్మారెడ్డి,పలువురు అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని, నిరక్ష్యాన్ని,పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.వరంగల్ రోడ్డుపై నిత్యం ప్రయాణించే వారికి ఏళ్ల తరబడి నరకప్రాయంగా మారిందని ఇంకా ఎన్ని సంవత్సరాలు వాళ్ళను ఇబ్బంది పెట్టాలే అని ఆగ్రహం వ్యక్తం చేశారు, 2026 దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చాను ఆమాట ప్రకారం చేసి తీరాల్సిందేనని సమీక్షలో మంత్రి పునరుద్ఘాటించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో కార్మికుల సంఖ్యను పెంచాలని మూడు షిఫ్టుల్లో పనులు చేయాలనీ ఆయన ఆదేశించారు,రాత్రి వేళల్లో 11 నుండి ఉదయం 6గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలనీ మంత్రి సూచించారు. కారిడార్ కింద 6.25కి.మీ బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయి పనుల పురోగతి సమీక్షిస్తానని ఇక మూడు నెలలలో పూర్తి కావాలని అందుకు తగ్గట్టుగా రోజువారీ వర్క్ ప్రోగ్రెస్ అధికారులు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో నడుస్తున్న పనులపై మంత్రి కూలంకషంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనుల వల్ల,వర్షాల వల్ల నిర్మాణ పనుల్లో ఆలస్యం జరుగుతోందని వందశాతం పూర్తి చేయడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదనీ నిర్మాణ సంస్థ సమీక్ష సందర్భంగా క్షేత్రస్థాయి అంశాలు వివరించింది. అక్టోబర్ 31 నాటికి అందుబాటు లోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నామనీ ఏం చెప్పినా వినేది లేదని మంత్రి అన్నారు. వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.పనుల్లో మరింత వేగం పెంచాలని,మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది. 2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని ఆర్ అండ్ బి అధికారులు,వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# వెంకయ్యకు 'భారతరత్న' ప్రదానం చేయాలి

## దేశ జెండా సృష్టికర్తను విస్మరిస్తున్న బిజెపి పాలకులు

## బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఆగస్టు 14 తిరంగాయాత్ర చేస్తున్నారు కానీ బిజెపి పాలకుల జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్యను విస్మరిస్తున్నారని ఆయనకు భారత రత్న పుస్కారం ఇవ్వాలని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ సలహాదారు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. బిసి సంక్షేమశాఖ సలహాదారు హను మంతరావు ఈ మేరకు భారతప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖను రాసినారు. దాని ప్రతిని లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీకి పంపారు.జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తెలంగాణ బిసి సంక్షేమ శాఖ సలహాదారుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడుకి, భారత జాతీయ పతాక రూప కర్తకు దేశం అందించగల ఏకైక సముచితమైన నివాళి అవుతోందని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. భారత జాతీయ త్రివర్ణ పతాకం ప్రాథమిక రూపాన్ని రూపొందించిన ఘనత పింగళి వెంకయ్యకే మాత్రమే లభిస్తోందని హైదరా బాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని తాను ఏర్పాటు చేసినట్లు ప్రధానికి రాసిన లేఖలో చెప్పారు. భారత జాతీయ పతాకం ప్రపంచవ్యాప్తంగా దశాబ్దకాలంగా ఇప్పుడు ప్రాముఖ్యాన్ని, విస్తృత గుర్తింపును సాధించిందని వి.హనుమంతరావు నరేంద్రమోడీకి రాసిన లేఖలో కొని యాడారు. దివంగత పింగళి వెంకయ్య సేవలను తక్కువ చేసి చూడటం తగదని, దేశానికే అవమానమన్నారు. జాతీయ పతాక రూపకర్తకు భారతరత్న ఇవ్వాలనీ దేశ ప్రజలు అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని తెలిపారు. ప్రధాని మోడీ హార్ ఘర్ తిరంగా అంటున్నారు మంచిదే. జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు సరైన న్యాయం జరగాలంటే భారతరత్న ఇవ్వాల్సిందే అని వివరించారు. పింగళి వెంకయ్యకు న్యాయం జరగడం వల్ల ప్రజల్లోకి ఒక మంచి సందేశం వెళ్తుంది. స్వాతంత్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు అని ప్రధానికి వీహెచ్ రాసిన లేఖలో పేర్కొన్నారు.

# సామాజికవేత్త పొడిశెట్టి నారాయణస్వామి కుటుంబ సభ్యులకు మంత్రి సీతక్క పరామర్శ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు11:**ములుగు ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు పొడిశెట్టి నారాయణస్వామి (95) అనారోగ్యంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. నారాయణస్వామి మరణ వార్త తెలుసుకున్న మంత్రి సీతక్క మంగళవారం ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. నారాయణ స్వామితో తనకున్న గురుతుల్య అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మంత్రి సీతక్క, చిన్ననాటి పాఠశాల రోజుల్లో ఆయన తనకు పాఠశాల యూనిఫారాలు కుట్టి ఇచ్చేవారని తెలిపారు. అంతేకాకుండా చిన్ననాటి నుంచే పిల్లలు పొదుపు నేర్చుకోవాలని ఆయన సుధాకర్ చిన్న పిల్లల పొదుపు పథకం పేరుతో పథకాన్ని ప్రారంభించారని, తాను ఆ పథకానికి సభ్యురాలినని గుర్తు చేసుకున్నారు. ఆయన అమేజింగ్ తెలంగాణ ఎడిటర్ రమేష్ కుమార్ తండ్రి కావడం గమనార్హం.

# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీ య హోదా ఇవ్వాలి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పట్ల కేంద్రం వివక్షత తగదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ప్రకటించే అంశం పరిశీలనలో లేదని ప్రకటించటం ద్వారా తెలంగాణ పట్ల బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వివక్షా ధోరణి స్పష్టమవుతోందన్నారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా వేసిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయమంత్రి ఇచ్చిన సమాధానంలో ఈ అంశం వెల్లడైందన్నారు. అత్యంత క్షామ పీడిత వెనుకబడిన మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలకు కృష్ణా జలాలను అందించే ఈ ప్రాజెక్టుకు జాతీయహోదా, కేంద్ర సహాయం విషయం లో కేంద్రం తాత్సారం చేయడం తగదన్నారు. అంతర్ రాష్ట్ర అంశాలు, కృష్ణా నదీ జలాల ట్రిబ్యునల్ 2, న్యాయవివాదాల పేరిట మెలికపెట్టడం సరైంది కాదన్నారు. తెలంగాణకు సంబంధించి కృష్ణా, గోదావరి ప్రాజెక్టులకు సంబం ధించి అనుమతులు, ఇతర విషయాలలో దశాబ్దాల జాప్యం కారణంగా కొన్ని తరాలు నష్టపోయాయని, మరింత ఆలస్యమవడం ద్వారా నష్టం పెరగడంతో పాటు, వ్యయం కూడా పెరుగుతోందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ఏర్పడి 12 యేళ్లు అవుతోందని, సాచి వేత ధోరణిని మాని ఇప్పటికైనా రాష్ట్రానికి సంబంధించి ప్రాజెక్టులకు అనుమతులు, సహాయాన్ని నిర్ణీత కాలవ్యవధిలోగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులుండవు




## ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రానున్న పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వ హించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, ఒకరిద్దరి కారణంగా మొత్తం వ్యవస్థలకు చెడ్డపేరు రాకుండా వ్యవహరించాలన్నారు. కేంద్ర, రాష్ట్రలు సమన్వయంతో రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పత్తి కొనుగోలులో మధ్యవర్తుల జోక్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఈ సీజన్‌లో అటువంటి లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోందని తద్వారా సుమారు 25.85 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కేంద్రం క్వింటాల్‌కు రూ.8,667 మద్దతు ధర ఉండగా దాని కంటే తక్కువకు పత్తిని విక్రయించే పరిస్థితి ఉండకూడదన్నారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిపై చేసి కొనుగోళ్ల సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత సీజన్‌లో 122 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో 131 కు పెంచినట్లు వెల్లడించారు. పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి, రైతు మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుట్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలన్నారు. పత్తి అధికంగా ఉత్పత్తి అయ్యే జిల్లాల్లో అవసరమైన మేరకు కాటన్ టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల లో తేమశాతం తదితర నాణ్యత ప్రమాణా లను పరీక్షించే పరికరాలు అందుబా టులో ఉం చాలని స్పష్టం చేశారు. రైతుల సమ స్యలు, ఫిర్యా దుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను రైతులు వినియోగించుకునేలా ప్రచారం చేయాలని చెప్పారు.

# నాణ్యమైన, నిరంతర విద్యుత్ లక్ష్యం

## కొనసాగుతున్న ప్రజాబాట

## దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** తమ సంస్థ పరిధిలోని వినియోగదార్లకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాయే లక్ష్యమని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. అలాగే తమ పరిధిలోని 21 సర్కిళ్లలో ప్రజాబాట కొనసాగుతోందన్నారు. ఈ మేరకు హైదారబాద్ లోని సంస్థ ప్రధాన కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో ప్రజల వద్దకే వెళ్లి విద్యుత్ సంబంధిత సమస్యలను ప్రత్యక్షంగా తెలుసు కోవడం, క్షేత్రస్థాయిలోనే పరిష్కార చర్యలు చేపట్టడం, విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రజా బాట కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. సంస్థ సిబ్బంది విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల వల్ల ఏర్పడే అంతరాయాలు, లూజ్ కనెక్షన్లు, వంగిపోయిన విద్యుత్ స్తంభాలు వంటి సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. సబ్‌స్టేషన్ల ఆధునీకరణ, శ్రమదానం తో సేవా భావం ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలోని 33/11 కేవీ యాదిర సబ్‌స్టేషన్ వద్ద ఉద్యోగులు స్వచ్ఛంద శ్రమదానంతో యార్డ్ శుభ్రపరిచేపనులు, కలుపు మొక్కల తొలగింపు, నిర్వహణ మరమ్మతులు, సబ్ స్టేషన్ సుందరీకరణ పనులు చేపట్టారన్నారు.

# కరవును కూడా రాజకీయం చేస్తున్న కెటిఆర్, హరీశ్‌రావు

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** కరవును కూడా రాజకీయం చేయాలని కెటిఆర్, హరీష్ రావు ప్రయత్నం చేస్తున్నారనీ, కరవు సమయంలో రైతులకు అండగా నిలబడాల్సి పోయి విమర్శలు చేయడం మంచిది కాదనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసర్ హితవు చెప్పారు. సోమవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లడుతూ ప్రతిపక్షం మాటలను రైతులు, ప్రజలు విశ్వసించరనీ ధీమా వ్యక్తంచేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు ఛాయలు కనిపిస్తుండటంతో తెలంగాణలో వర్షాలు సమృద్ధిగా కురవాలని మా ప్రభుత్వం వరుణ యాగం చేసిందనీ ప్రాజెక్టులు నెమ్మదిగా నిండుతున్నాయనీ ఆది వివరించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో వరుణ యాగం చేయగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్ణాహుతిలో పాల్గొన్నారనీ చెప్పారు.

బిఆర్‌ఎస్ నాయకులు మాత్రం రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారనీ చివరకు వరుణ యాగంపైన కూడా కామెంట్ చేసే స్థాయికి దిగజారిపోయారనీ ఆవేదన చెందారు.వరుణ యాగం చేయడం ప్రభుత్వ వైఫల్యం అంటూ దేవుడిపై భారం వేస్తున్నారని, యాగంతో డ్రామా ఆడుతున్నారని బుద్ధి లేకుండా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని అన్నారు. గతంలో అయుత చండీయాగం, సహస్ర చండీయాగం, రాజశ్యామల యాగం, నవగ్రహ చండీ యాగాలను కెసిఆర్ దంపతులు నిర్వహించారనీ గుర్తుచేశారు.తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది వేద పండితులు, రుత్వికులు ఈ యాగాల్లో పాల్గొన్నారు.డిసెంబర్ 2015లో కెసిఆర్ చేసిన అయుత చండీ యాగానికి ఎపి సిఎం చంద్రబాబుతో పాటు అనేక మంది ప్రముఖులు హాజరయ్యారనీ అప్పుడు మేం ఇలాగే మాట్లాడామా? ఆయన విశ్వాసాలను దెబ్బతీసేలా విమర్శలు చేయలేదు కదా? ఎల్‌నీనో ప్రభావం తగ్గాలని వేములవాడలో వరుణయాగం చేశాం, కొండగట్టు గిరి ప్రదక్షణలు చేశామనీ ఐతే మాజీ మంత్రి హరీశ్ రావు మాకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు.ప్రాజెక్టులు ఎక్కడ కట్టాలి, ఎలా కట్టాలి, ఎలా నీళ్లు ఇవ్వాలి, ఎప్పుడు పంపులు ఆన్ చేయాలో మాకు తెలుసు అని శ్రీనివాస్ చెప్పారు.సాగునీటి పారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు ఫైయిల్ అని ఆయన మామ కెసిఆర్ తేల్చి చెప్పాడనీ, ఆయన అసమర్థతను చూసి ఆ శాఖ నుంచి హరీశ్ రావును తప్పించి తన దగ్గర పెట్టుకున్నాడని అపహాస్యంచేశారు. రిజర్వాయర్లు నింపాలంటూ లేఖలు రాయడంతోపాటు కాళేశ్వరంలో కన్నెపల్లి పంపులు ఆన్ చేయాలని హరీశ్‌రావు ఇలాగే హడావిడి చేశాడు కానీ వరద నీటితో ఎల్లంపల్లి నిండడంతో హరీశ్‌రావు గొంతు మూగబోయిందనీ అన్నారు. రెండేళ్లలో కాళేశ్వరం నుంచి చుక్కనీరు తీసుకోకుండా రైతులకు నీళ్లు ఇచ్చామని అన్నారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

# నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికై కృషి

## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 11, ప్రభాతవార్త:** నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి శాంతియుత నిరసన సభ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంకు ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అంజిరెడ్డిలు హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరిం చేందుకు ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో గత 20 ఏండ్లుగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు శాసనమండలిలో లేవనెత్తి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జేఏసీ నేతలు డాక్టర్ పుట్టా మహేందర్, డాక్టరన భరత్‌కుమార్, ఎండీ రుక్మీద్దీన్‌లు మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

# నేడు రాష్ట్రంలోకి 35వ రాజీవ్‌జ్యోతి సద్భావనాయాత్ర

## రాయచూరు నుంచి మక్తల్‌లోకి ప్రవేశం

## 15న నాగపూర్‌కు ఆదిలాబాద్ నుంచి నిష్క్రమణ

## రాజీవ్ జ్యోతి సద్భావనాయాత్ర విజయవంతానికి కార్యకర్తలు కృషిచేయాలి: పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్ర బుధవారం కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి తెలంగాణలోని మక్తల్‌కు చేరు కొంటుంది. శ్రీపెరంబదూర్ నుంచి ఢిల్లీ వరకు వెళ్లే రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర 14న హైదరాబాద్‌లోని గాంధీభవన్ రానుంది. 15వ తేదీన ఆదిలాబాద్ మీదుగా నాగపూర్ వెళ్లనుంది. తెలంగాణలోకి ప్రవేశించే 35వ రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్రకు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేశారు. రాజీవ్‌గాంధీ జాతీయ సమైక్యత యాత్ర రాష్ట్రంలో నాలుగురోజుల పాటు మత సామరస్యం, జాతీయ సమగ్రత, ఉగ్రవాదం విభజనవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం వంటి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై చైతన్యం కలిగిస్తోంది. 35వ రాజీవ్ జ్యోతి సద్భావనా యాత్ర 9న శ్రీపెరంబుదూర్ నుంచి ప్రారంభమైంది. ఆగస్టు 20న న్యూఢిల్లీలోని వీర్ భూమిలో రాజీవ్‌గాంధీ సమాధి వద్ద ముగియనుంది. కర్ణాటకకు చెందిన 150 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సాగుతున్న ఈ యాత్ర తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల మీదుగా ప్రయాణించ నుంది. తొలిరోజు యాత్ర 12న రాయచూర్-మక్తల్- నారాయణపేట్- యాదగిరి- గుల్బర్గాలో జరుగుతోంది. రెండో రోజు ఆగస్టు 13న గుల్బర్గా- హుమ్నాబాద్- బసవకళ్యాణ్- బీదర్- హైదరా బాద్‌కులో యాత్ర కొనసాగుతోంది. మూడోరోజు ఆగస్టు 14న హైదరాబాద్- కామారెడ్డి- నిజామాబాద్- నిర్మల్-ఆదిలాబాద్‌లో రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర నడుస్తోంది. నాల్గవ రోజు ఆగస్టు 15న ఆదిలాబాద్- హింగన్‌ఘాట్- నాగ్‌పూర్- బేతుల్ మార్గంలో యాత్ర సాగనుంది. తెలంగాణలో యాత్ర విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఘన స్వాగతం పలకాలని మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.

# డిసెంబర్‌లోపు మూడు టిపిఎస్‌ల పనులు పూర్తి చేయాలి

## పైలట్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి

### మంచాల, వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలపై

### పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్‌నికోలస్ ఉన్నతస్థాయి సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** డిసెంబర్‌లోపుగా మరో మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్(టీపీఎస్) పనులను పూర్తి చేయాలని పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అధికారులను ఆదేశించారు. మంచాల, వంగూరు, పోల్కంపల్లి పబ్లిక్ స్కూల్స్ పనులను డైరెక్టర్ మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పైలట్ ప్రాజెక్టులో చేపడుతున్న మంచాల, వంగూరు, పోల్కంపల్లి పబ్లిక్ స్కూళ్లపై ప్రతి బుధవారం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న విద్యాకమీషన్ పనుల్లో మరింత వేగం పెంచాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా డిసెంబర్ నాటికి పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న విద్యాకమీషన్ దీనిపై సమీక్షించింది. ఈ సమీక్షలో డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్, జోష్నా శివారెడ్డి, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్, ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఈడబ్ల్యుఐడీసీ) ఎండీ గణపతి రెడ్డి పాల్గొన్నారు. ఆ మూడు పాఠశాలల్లో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతి, నిధుల విడుదల, మౌలిక వసతులు, ఫర్నిచర్ అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంచాల, వంగూరు, పోల్కంపల్లి పాఠశాలల్లో పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైలట్ ప్రాజెక్టులోని మూడు పాఠశాలల్లో మిగిలిన పనులను వేగవంతం చేసి, డిసెంబర్ గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలకు అవసరమైన ఫర్నిచర్‌ను జైళ్ల శాఖ నుంచి సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. చర్లపల్లి, చంచల్ గూడ జైళ్లో ఖైదీలు తయారు చేసే ఫర్నిచర్‌ను టీపీఎస్‌లకు ఉపయోగించుకోవాలని... దీనికి సంబంధించి ప్రతి పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ వివరాలతో పూర్తి ఇండెంట్‌ను సిద్ధం చేయాలని హెచ్ఎంలను నవీన్ నికోలస్ ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల అవసరాలకు అనుగుణంగా డెస్కులు, బెంచీలు, టేబుళ్లు, కుర్చీల ఫర్నిచర్ అవసరాలను ముందుగానే గుర్తించి ఇండెంట్ సిద్ధం చేయాలన్నారు. పాఠశాల భవనాల పనులు పూర్తయ్యే సమయానికి ఫర్నిచర్ కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించారు. మూడు టీపీఎస్‌లలో ఇప్పటి వరకు పూర్తయిన పనులకు సంబంధించి ఎంబీలు (మెజర్‌మెంట్ బుక్స్) నమోదు చేయడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని టీజీఈడబ్ల్యుఐడీసీ ఎండీ గణపతి రెడ్డి తెలిపారు. డిసెంబర్ నాటికి మూడు పబ్లిక్ స్కూళ్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంతోపాటు, ఆధునిక వసతులతో కూడిన మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

### 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

### ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు:మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు11:** నిషేధిత ఆస్తుల పీఓబి / 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజేషన్ సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ పెట్టేందుకు వీలుకలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహాణీలు కూడా సబ్ రిజిస్ట్రార్లకు ఎక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది జెన్యూన్ ఏది కాదు గుర్తించి జెన్యూన్ ఉన్నవాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

# హార్ ఘర్ తిరంగా యాత్రపై బిజెపి సన్నాహక సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 11:** ఈనెల 14న ట్యాంక్‌బండ్‌పై పెద్దఎత్తున జాతీయ జెండాలతో తిరంగా యాత్ర.హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా ఆగస్టు 14న మధ్యాహ్నం 3 గం.లకు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించనున్న భారీ తిరంగా యాత్రకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సన్నాహక సమావేశం నిర్వహించారు.ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు జరగనున్న ఈ తిరంగా యాత్రను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణపై జీహెచ్‌ఎంసీ పరిధిలోని 8 జిల్లాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, ఇతర ముఖ్య నాయకులతో రాంచందర్ రావు సమగ్రంగా చర్చించి దిశానిర్దేశం చేశారు.దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటేలా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జాతీయ జెండాలతో తిరంగా యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌జోషి, మాళిని, హరిహరన్, రఘునాథయ్య, జగన్మోహనశర్మ తదితరులు

# నకిలీ సంఘాలు పెట్టి బ్రాహ్మణుల పరువు తీయొద్దు

### అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ప్రదీప్ జోషి

**హైదరాబాద్, ఆగస్టు 11,ప్రభాతవార్త:** నకిలీ సంఘాలు పెట్టి బ్రహ్మణుల పరువు తీయవద్దని అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పండిత్ ప్రదీప్ జ్యోషి అన్నారు. మంగళవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు బ్రాహ్మణ సంఘాల పేరుతో బ్రహ్మణుల పరువు దిగజార్చే విధంగా నకిలీ సంఘాలను ఏర్పాటు చేసి బ్రహ్మణుల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పౌరహిత్యం చేస్తు సమాజంలో గౌరవంగా బ్రతికిన కుటుంబాలు తమవని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నఖిలీ సంఘాల నిర్వాహకులు ఇప్పటికైన ఇటువంటి తప్పుడు కార్యక్రమాలను చేయకుండా జాగ్రత్తగా ఉండాలని లేని పక్షంలో బ్రహ్మణుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈసమావేశంలో అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య జాతీయ మహిళా అధ్యక్షురాలు మాళిని, సభ్యులు హరిహరన్, చెరుకుచెర్ల రఘునాథయ్య, వన్నెపల్లి జగన్మోహన్ శర్మ, మొతుకూరు రామేశ్వర రావు, గాయత్రి కులకర్ణి, మునిపల్లి శ్రీనివాస్, నివేదిత తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో మెకానిక్ మృతి

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), ఆగస్టు 11, ప్రభాతవార్త:** మెకానిక్ ఆర్‌టిసి బస్సును రిపేర్ చేస్తుండగా ఆది గమనించని డ్రైవర్ బస్సును తీసేం దుకు యత్నించగా మెకానిక్ అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల ఆర్‌టిసి బస్సు డిపోలో తీవ్రఆందోళనకరంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఆర్టీసి డిపోలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు కింద ఉండి మరమ్మతులు చేస్తున్న ఓ ఉద్యోగి ఆదే బస్సు కిందపడి మృతి చెందాడు. ఈ ఘటనతో డిపోలో విషాదఛాయలు అలుముకున్నాయి. జీడిమెట్ల ఆర్టీసి డిపోలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో సంతోష్‌కుమార(39) మృతి చెందాడు. బస్సు బ్రేకుల్లో తలెత్తిన ప్రమాదం తన ప్రాణాలకే ముప్పు తెచ్చింది. జీడిమెట్ల డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్న సంతోష్‌కుమార్ ఆర్‌టిసి బస్సు బ్రేకుల్లో తలెత్తిన సమస్యపై పరిశీలిస్తున్నారు. ఆయన బస్సు కింద ఉన్నాడన్న విషయాన్ని గమనించని డ్రైవర్ వేగంగా బస్సును తీసేందుకు ప్రయత్నించడంతో బస్సు కింద ఉన్న మెకానిక్ సంతోష్‌కుమార్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు.

# బ్యాంకు లాకర్‌లో రూ.50 లక్షల నగలు మాయం

**కాన్పూర్, ఆగస్టు 11:** బ్యాంకు లాకర్‌లో దాచుకున్న రూ.50 లక్షల విలువైన బంగారం, వెండి నగలు కనిపించకపోవడంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 55 ఏళ్ల మహిళ తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాన్పూర్‌కు చెందిన రష్మి అరోరా 2003లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెన్‌కోర్‌లో లాకర్ తీసుకుని అందులో నగలను భద్రపరిచారు. కొన్నేళ్ల తర్వాత లాకర్ తెరిచి చూడగా అది ఖాళీగా ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు.2003 ఫిబ్రవరి 26న రష్మి అరోరా తన భర్తతో కలిసి బ్యాంకులో సేవింగ్స్ ఖాతా తెరిచారు. అదే సమయంలో వారికి లాకర్ నంబర్ 23 కేటాయించారు. అందులో సుమారు రూ.50 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను భద్రపరిచారు. కొన్నేళ్లపాటు వారు క్రమం తప్పకుండా బ్యాంకుకు వెళ్లి లాకర్‌లోని నగలను పరిశీలించేవారు.అయితే రష్మి భర్త మరణించిన తర్వాత ఆమె కాన్పూర్‌లోని స్వరూప్ నగర్ నుంచి లక్నోకు వెళ్లి కుమార్తె, అల్లుడితో కలిసి నివసించడం ప్రారంభించారు. దూరం కారణంగా బ్యాంకుకు వెళ్లడం తగ్గిపోయింది. లాకర్‌లోని ఆస్తులు భద్రంగానే ఉంటాయని భావించారు.నాలుగు నెలల క్రితం రష్మి తన చిన్న కుమార్తెతో కలిసి బ్యాంకుకు వెళ్లగా, ఎస్బీటీ ప్రత్యేక సంస్థగా లేదని, అది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనమైందని అధికారులు తెలిపారు.

# ఆరేళ్ల తర్వాత శ్రీశైలంలో విద్యుత్ సరఫరా ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** శ్రీశైలం 900 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం యొక్క 4వ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ విద్యుత్ కేంద్రానికి మంగళవారం తెల్లవారుజామున రాష్ట్ర గ్రిడ్‌తో విజయవంతంగా అనుసంధానించారు. దీంతో 2020లో ప్రారంభమైన అగ్నిప్రమాద నష్టం, పలుమార్లు మరమ్మతులు, ట్రయల్ వైఫల్యాలతో కూడిన సుదీర్ఘ ప్రక్రియకు తెరపడింది. 6+150 మెగావాట్ల ప్రాజెక్టులో భాగమైన 150 మెగావాట్ల యూనిట్ 2020 ఆగస్టు 20న అగ్నిప్రమాదానికి గురైంది. దీనివల్ల దాని స్టేటర్, రోటర్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. మరమ్మతు పనులను రెండు సంస్థలకు అప్పగించారు. 2022 ఫిబ్రవరిలో శ్రీ అభిరామి ఇంజనీరింగ్ వర్క్స్, 2021 ఆగస్టులో నోయిడాకు చెందిన వోయిత్ హైడ్రో ప్రైవేట్ లిమిటెడ్‌కు మరమ్మతు పనులకు జెన్కో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో మొదటి విడత మరమ్మతుల తర్వాత, 2023 జూలై 29న యూనిట్‌ను ప్రారంభించారు. కానీ స్టేటర్ ఎర్త్ ఫాల్ట్ కారణంగా కొన్ని వారాల్లోనే అది ట్రిప్ అయి, స్టేటర్ బార్‌లు, కోర్‌ను దెబ్బతీసింది.
యూనిట్ ఇంకా గ్యారెంటీలో ఉన్నందున, స్టేటర్ రీవైండింగ్‌ను ఉచితంగా తిరిగి చేయడానికి వోయిత్ అంగీకరించింది, కానీ రోటర్‌ను కిందకు దించడం, అలైన్‌మెంట్, ఆన్‌లైన్ ఎయిర్‌గ్యాప్, పార్షియల్ డిశ్చార్జ్ మానిటరింగ్ సిస్టమ్‌ల ఏర్పాటు కోసం అదనంగా రూ.2.95 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. 2025 ఏప్రిల్‌లో పనులు ప్రారంభమయ్యాయి. ఈ యూనిట్‌ను అక్టోబర్ 2, 2025న తిరిగి ప్రారంభించారు. కానీ ఎయిర్‌గ్యాప్ ప్రొటెక్షన్ అలర్ట్ కారణంగా మరుసటి రోజే అది ఆగిపోయింది. వోయిత్, జపనీస్ సంస్థ హెచ్ఎం హైడ్రో చేసిన తనిఖీలలో, ఇతర సమస్యలతో పాటు రోటర్ పోల్స్ వదులుగా ఉన్నట్లు కనుగొన్నారు.
ఈ యేడాది జనవరిలో జరిగిన సమీక్ష అనంతరం, అన్ని సవరణ పనులను పూర్తి చేయాలని వోయిత్‌కు ఆదేశాలు జారీ చేసింది. ప్రధాన విద్యుత్ ఇన్‌స్పెక్టర్ నుండి అనుమతి లభించిన తర్వాత, మంగళవారం ఉదయం 3.21 గంటలకు యూనిట్‌ను సింక్రొనైజ్ చేశారు. కేంద్రం యొక్క ఆరు యూనిట్లు ఇప్పుడు పనిచేస్తుండటంతో, పీకింగ్ పవర్ సపోర్ట్ మెరుగుపడుతుందని, అలాగే శ్రీశైలం జలాశయం నుండి విడుదలయ్యే నీటిని మరింత మెరుగ్గా వినియోగించుకోవచ్చని తెలంగాణ జెన్కో భావిస్తోంది.



# జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' అతిపెద్ద పరిశోధన కేంద్రం

### మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఒయు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు11:** గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో బేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు.
యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసిని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌవరమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు.ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

# 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్సీసిని ప్రకటించాలి

### ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలి

### సిఎంఒ కార్యదర్శి శ్రీధర్‌కు జాక్టో స్టీరింగ్ కమిటీ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రక టించాలని, ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లు సత్వరమే పరిష్కరించాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (జాక్టో) డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎంవో కార్యదర్శి ఎన్ శ్రీధర్‌కి, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కి జాక్టో నేతలు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఎస్‌టియు భవన్‌లో మంగళవారం జాక్టో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. తొలిదశలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలుత పాఠశాల విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్‌తో భేటీ అయి సమస్యలపై చర్చించారు. అనంతరం సచివా లయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్‌కు 12 ప్రధాన డిమాండ్లతో కూడిన మెమోరాండం సమర్పించినట్టు జాక్టో ఛైర్మన్ జి సదానందం గౌడ్ తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్క రించాలని, లేని పక్షంలో తదుపరి ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జాక్టో ఛైర్మన్ జి. సదానందం గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను




ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులలను, 5 డీఏలను సత్వరమే విడుదల చేయా లన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిం చాలని, కేంద్ర ప్రభుత్వం మెమో నెం.57/4, 57/5 ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల తరహాలో డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో స్టాఫ్ ప్యాటర్న్‌ను పునఃసమీక్షి ంచి, జీవో 25ను సవరించాలన్నారు. 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించి ఖాళీగా ఉన్న ఎంఈవో, డిప్యూటీ ఈవో, డీఈవో, డైట్ లెక్చరర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయా లన్నారు. ఎంఈవో పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, రాష్ట్రంలోని ఎడ్యుకేషన్ డివి జన్లను పునర్వ్యవస్థీకరించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాక్టో సెక్రటరీ జనరల్ కె. కృష్ణుడు, కోఛైర్మన్ పర్వతి సత్యనారాయణ పాల్గొన్నారు.

# జిసిపిఇలో 22 లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

### ఫారెన్ సర్వీసెస్ విధానంలో డిప్యూటేషన్‌లో నియామకాలు

### నోటిఫికేషన్‌ను రిలీజ్ చేసిన పాఠశాల విద్య డైరెక్టర్

### 17 నుంచి ఇన్‌సర్వీస్ పిఇటిల నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** దోమల్‌గూడలోని గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(జీసీపీఈ)లోని 22 లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం ఇన్ సర్వీస్ టీచర్స్ స్కూల్ అసిస్టెంట్స్(ఫిజికల్ ఎడ్యుకేషన్) నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ మంగళవారం జారీ చేశారు. పాఠశాల విద్యా శాఖ నిబంధనలు మరియు షరతుల ప్రకారం వారి సేవలను వినియోగించుకోవడం కోసం అర్హులైన ఎస్ఏ(ఫిజికల్ ఎడ్యుకేషన్)లను దోమల్‌గూడలోని ప్రభుత్వ శారీరక విద్యా కళాశాలకు డిప్యుటేషన్‌పై పంపడం కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న, అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ల (ఫిజికల్ ఎడ్యుకేషన్) నుండి, ప్రభుత్వ శారీరక విద్యా కళాశాల (జీసీపీఈ)లో ప్రస్తుతం ఉన్న 22 లెక్చరర్ల ఖాళీ పోస్టులలో ఫ్యాకల్టీగా పనిచేయడానికి సుముఖంగా ఉన్నవారి నుండి దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. ఫారెన్ సర్వీసెస్ నిబంధనలు, షరతులపై వెయిటేజ్ ఆధారంగా జీసీపీఈలో డిప్యుటేషన్‌పై 22 ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్‌ను జారీ చేశారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు (ఫిజికల్ ఎడ్యుకేషన్)లు పాఠశాల విద్య శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. విద్యా అర్హతలు, అనుభవం ఉన్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి భర్తీ చేయనునానరు. ఈ నెల 17 నుంచి 27 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ నెల 28న సమర్పించిన దరఖాస్తుల్లో ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం కల్పించారు. డెమానిస్ట్రేషన్, ఇంటర్వ్యూల ద్వారా లెక్చరర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ డైరెక్టర్(సర్వీసెస్) మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా అడిషనల్ డైరెక్టర్(కోఆర్డినేషన్), జీసీపీఈ ప్రిన్సిపాల్‌తోపాటు ఇద్దరు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు కొనసాగుతారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తరువాత ఇంటర్వ్యూ తేదిలను ప్రకటించనున్నారు.

# 40 కులాలను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చాలి

### త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రిని కోరిన బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 కులాలను కేంద్ర ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీ) జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మరోసారి కోరారు. ఈ అంశంపై మంగళవారం ప్రధానమంత్రికి పంపిన లేఖలో తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ప్రధానంగా కులాల వారి సెన్సెస్-2027 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ అంశాన్ని త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గతంలో ఏప్రిల్ 13న దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ అంశంపై గతంలో సమర్పించిన వినతికి స్పందిస్తూ, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ తెలంగాణకు చెందిన 40 కులాల వివరాలను కోరిందని గుర్తు చేశారు. అందుకనుగుణంగా తెలంగాణ బీసీ కమిషన్ జూలై 18న 40 కులాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని తెలిపారు.
అనంతరం ఈ నెల 3న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ పంపిన లేఖలో, కేంద్ర ఓబీసీ జాబితాలో కులాలను చేర్చడం లేదా తొలగించడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఏ నిబంధనల ప్రకారం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని జి. నిరంజన్ తెలిపారు. సంబంధిత కులాల్లో కొన్ని 2008లోనే తెలంగాణ రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చబడ్డాయని, అయితే అప్పటి నుంచి మిగతా కులాలు కేంద్ర ఓబీసీ జాబితాలో స్థానం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు.
ఈ అంశానికి సంబంధించి జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ) న్యూఢిల్లీలో రెండు దఫాలుగా విచారణలు నిర్వహించిందని తెలిపారు. మొదటి విచారణ 22 డిసెంబర్ 2021 నుంచి 24 డిసెంబర్ 2021 వరకు, రెండవ విచారణ 5 సెప్టెంబర్ 2023న జరిగాయని పేర్కొన్నారు. అయినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఏ ప్రకారం ఈ అంశానికి ఇంకా తుది పరిష్కారం లభించలేదని తెలిపారు.
కాబట్టి తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి తగిన జోక్యం చేసుకోవాలని బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ విజ్ఞప్తి చేశారు.

# స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

### 13, 14 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్

### ప్రకటించిన ఎంహెచ్ఎస్ఆర్‌బి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:** మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) మరో 10 స్పెషాలిటీ విభాగాలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను అధిగమించి, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు సంబంధించిన 692 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తికాగా, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాలకు సంబంధించిన మరో 500 పోస్టుల భర్తీ ప్రక్రియను ఇటీవలే బోర్డు పూర్తి చేసింది. దీంతో ఇప్పటివరకు 1,192 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయింది. తాజాగా ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ, పాథాలజీ, డెర్మటాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విభాగాల్లోని సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టులను బోర్డు మంగళవారం విడుదల చేసింది. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ ఆధారంగా నోటిఫై చేసిన ఖాళీలకు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఎంహెచ్ఎస్ఆర్‌బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.ఆగస్టు 13, 14న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లో పేర్కొన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వెంగల్‌రావునగర్‌లో నిర్వహించనున్నట్లు బోర్డు వెల్లడించింది. ఏదైనా కారణంతో నిర్ణీత తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాలేని అభ్యర్థులు, పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాలను సమర్పించాల్సిన అభ్యర్థుల కోసం ఈనెల 17వ తేదీని రిజర్వ్ డేగా నిర్ణయించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ప్రతి సర్టిఫికెట్‌కు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని బోర్డు సూచించింది. ఆధార్, డేట్ ఆఫ్ బర్త్‌కు సంబంధించిన ఎస్ఎస్‌సీ లేదంటే ఈక్వల్ సర్టిఫికెట్, కమ్యూనిటీ/కుల ధ్రువీకరణ పత్రం తదితర ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా, వెరిఫికేషన్ షెడ్యూల్‌తో పాటు పూర్తి వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత లేకుండా చూడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 1,616 పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టగా, ఇప్పటికే 1,192 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# బాబ్ ఎల్‌మందెబ్ జలసంధిలో హూతీల దాడి.. ముగ్గురు నావికుల మృతి

**సనా, ఆగస్టు, 11:** బాబ్ ఎల్‌మందెబ్ జలసంధిలో నౌకలపై దాడులు తరచూ జరుగుతుండటంతో ఆందోళన పెరుగుతోంది. తాజాగా ఓ చిన్న కార్గో నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు సిబ్బంది మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పాకిస్థాన్‌కు చెందినవారు కాగా, మరొకరు ఇండోనేషియాకు చెందిన వ్యక్తి.యెమెన్‌కు చెందిన ఇరాన్ అనుకూల హౌతీ తిరుగుబాటుదారులు మంగళవారం బాబ్ ఎల్‌మందెబ్ జలసంధిలో ఓ చిన్న కార్గో నౌకపై దాడి చేసినట్లు యెమెన్ కోస్ట్‌గార్డ్‌కు చెందిన ఇద్దరు అధికారులు, ప్రభుత్వానికి చెందిన ఇద్దరు సైనిక అధికారులు తెలిపారు. ఒమన్‌లోని సలాలా నుంచి జిబౌటి మీదుగా నౌక ప్రయాణిస్తుండగా దాడి జరిగినట్లు సమాచారం.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VIZAG
RFP Tender Notice No.01/2026-27 /COC/Dt:11-08-2026

| | | |
|---|---|---|
| 01. No. of Works | : | 1 (One) (RFP Tender) |
| 02. Down loading Starting Date | : | 14-08-2026 10.30 AM |
| 03. Down loading End Date | : | 31-08-2026 @ 5.00 PM |
| 04. Last date for Submission of bid | : | 31-08-2026 @ 5.01 PM |

Further details at http://www.eprocurement.gov.in
O/o the Executive Engineer (PD) Division
Sd/- Commissioner

## పండుగలా ప్రపంచ ఆదివాసి దినోత్సవాలు

### బాలికలతో థింసా డాన్స్ చేసిన మంత్రి సంధ్యారాణి



**సాలూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా 4వ రోజు ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు జరుపుకోవడం నా భూతో నా భవిష్యత్ అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. మంగళవారం ఆమె ఆధ్వర్యంలో ఆదివాసి దినోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి సంధ్యారాణి ఇంకా గిరిజన నాయకులు అలాగే ఉద్యోగులు బారీర్యాలీగా బయలుదేరి సంస్కృతిక, థింసా, కోలాటం, వాయిద్యాలు మధ్య బాలికలు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. అలాగే జాతీయ రహదారి గుండా ఎమ్మార్వో ఆఫీస్ కూడలి వద్దకు చేరుకుని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మంత్రి సంధ్యారాణి చేతుల మీదగా పూలదండ వేసి అంజలి ఘటించారు. అనంతరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో గిరిజనులతో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం అనేది కేవలం ఒక వేడుక కాదని మన గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీక, చరిత్రకు గౌరవం, హక్కులకు గుర్తింపు, భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు. అలాగే ఐక్యరాజ్య సమితి ప్రపంచంలోని ఆదివాసి సమాజాల సంస్కృతి, సాంప్రదాయాలు, జీవన విధానం, హక్కులను గౌరవించడానికి ప్రత్యేక ప్రపంచ ఆదివాసి దినోత్సవం ప్రకటించిందని క్లారిటీ ఇచ్చారు. అంతే కాకుండా వేల సంవత్సరాలుగా ప్రకృతిని దేవత గా భావించి అడవిని తల్లిగాచూసి ఇంకా నీటిని జీవంగా భావించి, జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ జీవించిన సమాజం మన గిరిజన సమాజమన్నారు. అలాగే సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్టంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో 1000 కోట్లతో అడవితల్లి బాటలు వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యం స్పష్టం చేశారు. ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి, నిమ్మాది చిట్టి, ఆముదాల పరమేష్, ముఖి సూర్యనారాయణ, గిరిజన నాయకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## యువకుడి హత్యకేసులో నలుగురు అరెస్టు

**శ్రీకాళహస్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఈ నెల 2 రాత్రి స్వర్ణముఖి ఆనకట్ట వద్ద దారుణ హత్యకు గురుకాబడిన ఎం శివకుమార్ దారుణ హత్యకు గురికాబడ్డారు. ఈ కేసును జిల్లా పోలీసు అధికారి ఎల్. సుబ్బరాయుడు, ఎయస్‌పి రవిమనోహరాచారిల పర్యవేక్షణలో శ్రీకాళహస్తి పోలీసులు తమ సత్తాను చూపి నలుగురిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు ప్రకటించారు. ఈ హత్యను తమిళనాడుకు చెందిన పాతనేరస్థుల బృందం చేసినట్లు గుర్తించారు.

పాతకక్షలతో శివకుమార్‌ను పథకం ప్రకారం హతమార్చినట్లు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి వివరించారు. అరెస్టు చేసిన వారిలో తమిళనాడుకు చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. తిరువళ్ళూరుకు చెందిన వి. కార్తీక్(32), అంబలత్తూరుకు చెందిన వేలుగోపినాథ్(27), పొన్నేరి తాలూకా ఎలమాంద్యంకు చెందిన బి. శ్రీధర్ అనే రెడ్డి(26), పుత్తూరు టౌన్ గాంధీ నగర్‌కు చెందిన మునస్వామి సూర్య(19)లను అదుపులో తీసుకొని వారు హత్యకు ఉపయోగించిన కత్తులను మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరోక నిందితుడు పరారీలో ఉన్నాడని జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు వివరించారు. ఈ కేసు ఛేదనలో చాకచక్కంగా వ్యవహారించి నిందితులను అదుపులో తీసుకోటానికి చక్కగా వ్యవహారించిన డివైయస్‌పి నరసింహమూర్తి, సిఐలు వెంకటేష్, ఇబ్రహీం, నాగరాజు, లక్ష్మీనారాయణలను అభినందించారు.

# గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

**● ఉన్నత విద్యతో గిరిజన పిల్లలు ఉన్నతస్థాయికి ఎదగాలి ● రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప**



**కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వెంకటప్ప పేర్కొన్నారు. మంగళవారం కుప్పం వాణి మహల్‌లో జరిగిన గిరిజనుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రస ంగించారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అర్హులైన గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతోందన్నారు. సిఎం చంద్రబాబు గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ 175 నియోజకవర్గాల్లో ఉన్న గిరిజనులకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులను ఆదేశిస్తున్నారన్నారు. నెలకు ఒకసారి గిరిజనుల అంశాలపై సమీక్ష నిర్వహిస్తూ అధికారులకు తగు సూచనలు అందిస్తున్నారన్నారు. గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చెందాలన్నారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. గిరిజన సమాజం నుంచి ఇప్పటికే ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నతస్థాయికి ఎదిగిన వారు ఉన్నారన్నారు. విద్యతో గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. గిరిజన గ్రామాలు, గూడేలు, తాండాలు, కొండ ప్రాంతాల్లోని ప్రజలకు విద్యుత్, సోలార్, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ప్రత్యేక చర్యలు చేపట్టి ఆధార్ కార్డులు అందించేందుకు అధికారులు కృషి చేశారన్నారు. ఆధార్ కార్డులు అందుబాటులో రావడంతో పింఛన్లు, రేషన్ ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని చెంచు గిరిజన ప్రాంతాల్లో సైతం ఆధార్‌కార్డులు, పింఛన్లు, రేషన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కుప్పంలో మూడు పరిశ్రమలు రావడంతో యువతకు ప్రయోజనం కలుగుతుందన్నారు. త్వరలో విమానాశ్రయం రావడం సంతోషకరమైన విషయం అన్నారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్ సురేష్‌బాబు, కడ ఎపిడి శ్రీనివాసులు రాజు, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎపి ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు ఎస్టీ కమీషన్ సభ్యులు వెంకటప్ప స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.



## శతాధిక వృద్ధురాలు ఆవుల చెంగమ్మ కన్నుమూత

**తిరుపతి, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పనబాకం గ్రామానికి చెందిన దేశ భక్తురాలు, శతాధిక వృద్ధురాలు ఆవుల చెంగమ్మ(101) మంగళ వారం కన్నుమూశారు. భారత స్వాతంత్రోద్యమ కాలంలో బ్రిటిష్ వారి అరాచకాల మీద తిరుగుబాటు చేసిన కుటుంబానికి చెందిన ఆమె, అన్నదాతగా కూడా పేరు గడించారు. వలసపాలనలోనే అటవీశాఖలో ఉద్యోగిగా వున్న ఆమె బావ ఒకరు, బ్రిటిష్ అధికారి నిరంకుశ వైఖరి పట్ల తొలిసారిగా తిరుగుబాటు చేశారు. దీంతో వీరి కుటుంబం కొంతకాలం అజ్ఞాత జీవితాన్ని కూడా గడపాల్సి వచ్చింది. ఆ సమయంలో కుటుంబ భారాన్ని మొత్తం చెంగమ్మ మోయడమే కాకుండా, ఎంతో ధైర్యంగా గ్రామంలో దేశభక్తి భావాలను పెంపొందించ ేశారు. అప్పట్లో ఎలాంటి విపత్కర పరిస్థితులు, బెదిరింపులు ఎదురైనా తలొగ్గని సాహసిగా పేరు పొందారు. సామాజిక చైతన్యంతో అక్షరాస్యత పెంపుకోసం ప్రయత్నిస్తూ, పేదలకు అన్నపూర్ణగా తనదైన శైలిలో సేవలందించారు. తమిళనాడు రాష్ట్రంలో 1925లో జన్మించిన ఆమె అక్కడే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. బాల్యం నుండే భారతీయ సాహిత్యాన్ని, దేశభక్తిని ప్రచారం చేస్తూ వచ్చారు. వివాహం తర్వాత భర్త స్వగ్రామం, స్వర్ణముఖి నదీపరివాహక ప్రాంతమైన పనబాకం గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. ఆమె భర్త రామయ్య అటవీశాఖ లో ఉద్యోగిగా వుంటూనే, వ్యవసాయం కూడా చేసేవారు. ప్రస్తుతం రాష్ట్ర అటవీశాఖలో డిప్యూటీ కన్జర్వేటర్ హోదాలో ఆమె కుమారుడు ఆవుల చంద్రశేఖర్ ఇటీవల లండన్‌లో అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణా ధికారి (సిఇఒ)గా విజయవాడలో ఆయన పనిచేస్తున్నారు. సిఇఒ మాతృమూర్తి, శతాధిక వృద్ధురాలు చెంగమ్మ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బుధవారం తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని పనపాకం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె బంధువులు తెలిపారు.

# రైతన్నలు పంట బీమా చేయించుకోవాలి

### ప్రకృతి వైపరీత్యాల్లో ఆసరా: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రైతన్నలు ప్రధానమంత్రి పంట బీమా పథకాన్ని (పీఎంఎఫ్ బివై) నమోదు చేయించుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలలో రైతన్నలకు ఈ పథకం ఆసరాగా ఉంటుందని ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. ఆగస్టు 15 వరకు మాత్రమే గడువు ఉన్నదని ఆయన తెలిపారు. బీమా నమోదుకు పంట సాగు ధ్రువీకరణ పత్రం సరిపోతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతన్నల ప్రయోజనాల కోసం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. రైతులను ఊహించని నష్టాల నుండి ఆదుకుని, తిరిగి వ్యవసాయం చేసుకునేలా రైతులను ప్రోత్సహించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

ఎలినినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి. అలాగే ప్రస్తుతం ఎలినినో ప్రభావాన్ని రైతులు ధైర్యంగా ఎదుర్కోవాలనీ, నీటి ఆధారిత పంటలు వేసి రైతన్నలు నష్టపోవద్దనీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. వర్షాలు కురవని కారణంగా చెరువులలో నీరు లేదని, ఎలినినో కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయన్నారు. కేవలం బోరు మోటార్లను నమ్ముకుని సాగు చేయడం ద్వారా రైతన్నలు నష్ట పోయే అవకాశం ఉందన్నారు. నీటి ఎద్దడి కారణంగా వరి పంట సాగు చేసే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు.

వాతావరణంలో వచ్చిన సమూల మార్పుల కారణంగా రైతన్నలు ఆరుతడి పంటలు సాగు చేయటం మంచిదన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనల ప్రకారం, ఎలినినో ప్రభావం కారణంగా సంప్రదాయ వరి సాగుకు దూరంగా ఉండి, ఆరుతడి పంటలు మరియు ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులు (బిందు సేద్యం) పాటిస్తే రైతులు నష్టాల నుంచి తప్పించుకుని మంచి లాభాలు పొందవచ్చన్నారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలైన వేరుశనగ, కంది, పెసర వంటి పంటలు సాగు చేసి రైతన్నలు లబ్ధి పొందాలని రైతన్నలను మంత్రి కోరారు. మరిన్ని వివరాల కోసం రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

## ఆధ్యాత్మికనగరంలో గుంతలరోడ్లు

### రోడ్లను బాగుచేయాలని సిపిఐ వినూత్న పాదయాత్ర



**తిరుపతి, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం, ఆధ్యాత్మికనగరం తిరుపతిలో గుంతలరోడ్లు దర్శనమిస్తున్నాయి. గుంతలమయమైన రోడ్లతో వాహనాల ప్రయాణం అవస్థలు తప్పడంలేదని సిపిఐ నిరసన తెలిపింది. మంగళవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాదయాత్రల్లో భాగంగా తిరుపతి నగరంలో చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రామానాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఈ పాదయాత్రల ప్రధాన ఉద్దేశమన్నారు. పాదయాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. తిరుపతి నగరంలో అనేక ప్రాంతాల్లో కాలువలు సక్రమంగా లేకపోవడం, గుంతలమయమైన రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు, నాలుగు నెలల క్రితం వేసిన రోడ్లు కూడా ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని గుంతలమయంగా మారాయని విమర్శించారు. ఎం. ఆర్. పల్లి పోలీస్ స్టేషన్, రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. పోలీస్ స్టేషన్ ముందు గత నాలుగు నెలలుగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇదే మార్గంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు, ప్రజలు, వేలాది మంది విద్యార్థులు, యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల గుంతల్లో పడి ఇద్దరు విద్యార్థులు ఆసుపత్రి పాలైన ఘటనను తాము ప్రత్యక్షంగా చూశామని పేర్కొన్నారు. తిరుపతి నగరానికి స్మార్ట్ సిటీ పేరుతో కోట్లాది రూపాయల నిధులు వచ్చినప్పటికీ ఆ నిధులను ఎక్కడ ఖర్చు చేశారు అన్న విషయాన్ని మున్సిపల్ కమిషనర్ శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 23నుండి శ్రీవారి పవిత్రోత్సవాలు

### ఒకే టిక్కెట్‌పై 3రోజులు గృహస్థ భక్తులకు దర్శనాలు



**తిరుమల, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 23నుండి 25వరకు మూడు రోజులు పవిత్రోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. 22వ తేదీ శనివారం సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు స్నపన తిరుమంజ నం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఆగస్టు 23న పవిత్రాల ప్రతిష్ట, 24న పవిత్ర సమర్పణ, 25న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**ఆర్జితసేవలు రద్దు:** పవిత్రోత్సవాల్లో ఈనెల 22న అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవ టిటిడి రద్దు చేసింది. 23 నుండి 25వ తేది వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార, 25న అష్టదళ పాదపద్మారాధన సేవను, ఆగస్టు 26న (పవిత్రోత్సవాలు ముగిసిన తర్వాత రోజు) కల్యాణోత్సవ సేవలను రద్దు చేశారు.

**ఒకే టిక్కెట్‌పై మూడురోజులు దర్శనం:** ఆలయంలోపల కల్యాణోత్సవ మండపం లో 23 నుండి 25వరకు జరిగే ఈ పవిత్రోత్సవాలకు ఏ రోజుకారోజు టిక్కెట్లు పొందిన గృహస్థభక్తులను సహజంగా అనుమతినిస్తారు. అయితే ఈ ఏడాది టిటిడి పెద్దలు వినూత్నంగా ఆలోచన చేసి ఏకంగా పవిత్రోత్సవాల టిక్కెట్‌ను రూ. 5వేలు చేశారు. ఈ టిక్కెట్ ఆన్‌లైన్‌లో పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు ఆలయంలోనికి చేరుకుని మలయప్ప ఉత్సవర్లు సేవతోబాటు శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకునే భాగ్యం కల్పించారు. పవిత్రోత్సవాల సేవా టిక్కెట్లపై ఒకే టికెట్ పొందిన గృహస్థ భక్తులు మూడురోజులు సేవలో పాల్గొనే అవకాశం కల్పించింది.

## శివయ్యకు వెండి గంట బహూకరణ

**శ్రీకాళహస్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరునికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సుమారు రూ. 4.29 లక్షల విలువ కల్గిన వెండి గంటను అందించారు. మంగళవారం జి. హరినాధ్‌రెడ్డి, జి. పుష్పలత దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామికి ప్రత్యేకంగా తయారు చేసిన 1.5కిలోల వెండి గంటను బహూకరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ అకౌంటెంట్ యుగంధర్, నాగయ్యలు పాల్గొన్నారు. గంటను బహూకరించిన భక్తులకు ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో పాటు వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## దేవాలయాల సమగ్ర వికాసానికి స్థానిక సలహా మండలి ఏర్పాటు చేయాలి

**తిరుపతి, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఇప్పటికే హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, ముంబై, భువనేశ్వర్, బెంగళూరు, కురుక్షేత్ర తదితర ప్రముఖ నగరాల్లో స్థానిక సలహా మండలుల్లు విజయవంతంగా పనిచేస్తున్న విషయం విదితమే. టిటిడిపాలకమండలి పరిధిలోనే ఈ కమిటీలకు నిర్దిష్టమైన బాధ్యతలు, సూచనలు చేసే పరిధిని కల్పించారు. అదే తరహాలో ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి నగర పరిధిలోని దేవాలయాల అభివృద్ధి, భక్తుల వసతుల పెంపునకు కూడా ఒక ప్రత్యేక స్థానిక సలహా మండలిని ఏర్పాటు చేయాలని టిటిడి యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వానికి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కమిటీకి రిటైర్డ్ ఐఎఎస్ గానీ రిటైర్డ్ జడ్జిని చైర్మన్‌గా నియమించాలని కోరారు.

# అన్నప్రసాదంలో మసాల 'వడ' కిరికిరి!

**● చైర్మన్ అభిప్రాయానికే గండి? ● అరకొరగా తయారీతో కొందరు భక్తులకే పరిమితం**



**తిరుమల, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై అధికారుల మాటలు కోటలు దాటుతున్నా ఆచరణలో మాత్రం పర్యవేక్షణ కరువై అరకొర సదుపాయాలతోనే నెట్టుకుపోతు న్నారు. శ్రీవారిపట్ల భక్తివిశ్వాసాలు కలిగిఉండే సిఎం చంద్రబాబు కూడా టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు అన్నప్రసాదంలో అదనపు మెనూగా మసాల వడ వడ్డింపు ఆలోచన, ప్రతిపాదనను అమోదించి అభినందించడం విశేషం. ఏడా దిన్నర క్రిందట టిటిడి బోర్డు తీర్మానం చేసి తిరుమల అన్నప్రసాదంలో ఎంతో ప్రతిష్టాత్మ కంగా అదనపు మెనూగా చేర్చిన మసాల వడ వడ్డింపుపై మెల్లగా సుస్తీపలికేస్తున్నారనే వాదనలు భక్తుల నుండి వ్యక్తమవుతున్నాయి. మసాలవడ (అదనంగా శనగపిండి, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, కొత్తిమీర, సోంపు వంటి పదార్థాలతో తయారుచేసేది) వడ్డించాలనే అభి ప్రాయంతో ఎంతో మంచి ప్రతిపాదనను టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు ప్రవేశపెట్టారు. ఇందుకు బోర్డు సభ్యులు, అధికారులు కూడా ఆమోదిం చారు. 2025 మార్చి 6వతేదీ తొలిసారిగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనం లో అన్నప్రసాదాలతోబాటు మధ్యాహ్నం వేళ మాత్రం భోజనంలో అదనంగా మసాల వడ వడ్డింపుతో మెనూ ప్రారంభమైంది. తొలుత 35 వేల వడలను మాత్రమే తయారుచేసి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అన్నప్రసా దాలు స్వీకరించే భక్తులకు మాత్రమే వడ్డిం చారు. ఆ తరువాత ఐదు నెలలకు ఈ అదనపు మెనూ వడను రోజుకు 75వేలు తయారుచేసి ఉదయం 11గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసా దంలో వడ్డిస్తూ వచ్చారు.

అన్నప్రసాద భవనం లో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ)ని అప్పటి వరకు వడ్డించేవారు. ఆ తరువాత గత ఏడాది మార్చి 6న మసాలవడ ప్రవేశపెట్టారు. రద్దీ పెరిగిన సమయాల్లో తరచూ అన్న ప్రసాదం భవనాన్ని టిటిడి తిరుమల అధికా రులు ఆకస్మికంగా తనిఖీ చేయడం, నాణ్యత రుచి వంటి వాటిపై భక్తుల నుండి అభిప్రాయాలు తెలుసుకోవడం చేస్తున్నారు. అన్నప్రసా దంలో అదనపు మెనూ మసాల వడ్డ పూర్తిగా టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు అభిప్రాయం తోనే అమలు చేశారనేది భక్తుల్లోనూ సదభిప్రాయంగా ఉంది. ఇంకా రానున్న రోజుల్లో అదనపు మెనూగా 'పప్పు' కూడా ప్రవేశపెట్టాలని భక్తుల నుండి సూచనలు, అభిప్రాయాలు వ్యక్తమయ్యాయని గతంలో బోర్డు సమావేశంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అన్నప్రసాదంలో మసాల వడ వడ్డింపుపై గతంలో వైసిపి నాయకులు వ్యంగ్యాస్త్రాలు కూడా సంధించారు.

అయితే అన్నప్రసాదం విభాగానికి టిటిడిలో కొందరు పైఅధికారుల నుండి హుకుం జారీ అయిందో లేక కొనసాగుతున్న బోర్డుకు చెడ్డపేరు తీసుకురావాలనే ఆలోచన తోచిందో ఏమోగానీ గత 20రోజులుగా అన్నప్రసాదంలో అదనంగా వడ్డిస్తున్న మసాల వడకు సుస్తీచేసేశారు. ఇదివరకు రోజంతా ఉదయం 11గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిరంతరాయంగా 75వేల వరకు తయారుచేసి వస్తున్న ప్రతిభక్తునికి వడ్డించే మసాల వడను ఏకంగా మధ్యాహ్నం ఒంటి గంట తరువాత కనిపించకుండా చేసేశారనేది అధిక శాతం మంది భక్తుల నుండి వస్తున్న విమర్శలు.

రెండువారాల క్రిందట గతనెల 18వ తేదీ తమిళనాడు తిరువళ్ళూరుకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారి దర్శనం తరువాత అన్నప్రసాదం స్వీకరించడానికి తరిగొండ వెంగ మాంబ భవనం వెళ్ళారు.

అక్కడ ఆ రోజు మధ్యాహ్నం 1.30గంటలకు అన్నప్రసాదంలో మసాల వడ్డ వడ్డించలేదు. ఈ విషయంగా అక్కడి సిబ్బందిని వాకబుచేస్తే లేదనే మాట వినిపించారు. భక్తులు కావడంతో సరిపెట్టుకుని వెళ్ళిపోయారు. తాజాగా గత శుక్రవారం తిరుపతికి, నెల్లూరుకు చెందిన ఇద్దరు భక్తులు అన్నప్రసాదం భవనానికి వెళ్ళారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో హాల్‌లో అన్నప్రసాదం స్వీకరించారు. వీరికి కూడా మసాలవడ అంద లేదు. వడలు తయారుచేయలేదేమోనని భావించి అన్న ప్రసాదాలు స్వీకరించి వచ్చేశారు.

ఈ విషయంపై 'వార్త'కు కొందరు భక్తులు సమాచారం అందించారు. సోమవారం మధ్యా హ్నం వార్త పరిశీలనలో వడ వడ్డించలేక పోవడం తెలిసింది. దీనిపై అన్నప్రసాదం విభాగం అధికారులను తెలుసుకున్నా పూర్తి స్థాయిలో వడలు వడ్డింపుకు కసరత్తు చేస్తున్నా మని, అరకొర వడలు తయారీ జరుగుతోందని, త్వరలోనే మరింత నాణ్యతగా రుచికరంగా వడలు తయారుచేసేలా చూసి భక్తులు అభినం దించేలా ఉంటుందని వివరణ ఇచ్చేశారు. వడల కొరత పై మాత్రం మాటదాటేశారు.

## జోరుగా పుష్కరిణి మరమ్మతు పనులు... పైపులైన్ల మార్పు



**తిరుమల, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో వేలపుణ్యతీర్థాలు కలిసే స్వామివారి పుష్కరిణి మరమ్మతులు, శుద్ధిచేసే పనులు వేగంగా సాగుతున్నాయి. గత పదిరోజులుగా పుష్కరిణిని పూర్తిగా మూసివేసిన టిటిడి ఇంజనీరింగ్ అధికారులు ఈ నెలరోజుల పాటు వివిధ రకాల మరమ్మతు పనులు చేస్తారు. ఈ నెలరోజులు భక్తులు స్నానాలాచరించేందుకు వరాహస్వామి ఆలయం సమీపంలో స్నాన కుళాయిలు ఏర్పాటుచేశారు. ప్రతి ఏటా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులపాటు స్వామి పుష్కరిణి మూసివేసి మరమ్మతులు చేపట్టడం పరిపాటి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగనున్న వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముందుగానే తిరుమలలోని పవిత్ర పుష్కరిణిని మరమ్మతులు మొదలుపెట్టారు. ఇప్పటికే పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్‌పనులు చేపడుతున్నారు. దీని కారణంగా నెలరోజులు పుష్కరిణి హారతి కూడా రద్దుచేశారు. అదనంగా మరో 10రోజులు సెప్టెంబర్ 10వరకు పుష్కరిణి మూసివేసేలా నిర్ణయం తీసుకున్నారు. స్వామిపుష్కరిణిలో నీరు నిల్వఉండే అవకాశం లేదు. పుష్కరిణిలోని నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగించేందుకు అత్యుత్తమ రీసైక్లింగ్ వ్యవస్థ అందుబాటులోఉంది.

# తిరుమల సమాచారం




## మలయప్పకు రెండు గరుడసేవలు

### - భక్తులకు ఆధ్యాత్మిక సదవకాశం

**తిరుమల, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి ఈనెలలో రెండుసార్లు గరుడసేవ జరుగుతుంది. సాధారణంగా నెలలో పౌర్ణమిన గరుడసేవ జరుగుతుంది. ఈనెల 17వతేదీ సోమవారం గరుడపంచమి పర్వదినాన ఆరోజు రాత్రి మలయప్పస్వామి గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. అలాగే 28న శ్రావణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. దివ్యాభరణాలు ధరించే మలయప్పస్వామి జగన్మోహన రూపంలో గరుడ వాహనంపై అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారు. బ్రహ్మోత్సవాలకు ముందు నెలలో రెండు సార్లు గరుడసేవ జరగనుండటంతో భక్తులకు ఆధ్యాత్మిక తన్మయత్వంతో తిరుమల వీధులన్నీ మారుమోగనున్నాయి. 108 వైష్ణవ దివ్య దేశాలలో గరుడ వాహనసేవకు ఎంతో పవిత్రమైన స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు పరమ భక్తుడు, వాహనమైన గరుడుడు వేద స్వరూపానికి, ఆధ్యాత్మిక జ్ఞానానికి వైరాగ్యానికి ప్రతీక. తనను సంపూర్ణ విశ్వాసంతో శరణు కోరిన భక్తులకు భగవంతుడు అందించే అపారమైన అనుగ్రహానికి ఈ సేవ నిదర్శనమని పండితులు చెబుతుంటారు. గరుడ వాహనంపై ఉన్న స్వామి వారిని దర్శించుకోవడం వల్ల పూర్వ జన్మల పాపాలు తొలగిపోవడమే కాకుండా, మనశ్శాంతి, సకల ఐశ్వర్యాలు లభిస్తాయని భక్తుల నమ్మకం.

## 14న ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం



**తిరుమల, ఆగస్టు 11 ప్రభాత వార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యం లోని తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో ఈనెల 14న శుక్రవారం ఆండాళ్ అమ్మ వారి తిరువడిపురం ఉత్సవం భక్తిశ్రద్ధలతో వైభవం గా నిర్వహించనున్నారు. ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థానం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుంచి గీతామందిరం, రామనగర్ క్వార్టర్స్, వైఖానసాచార్యుల వారి ఆలయం, ఆర్. ఎస్. మాడ వీధి, చిన్నజీయర్ మఠం మీదుగా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. ఈ పవిత్ర ఉత్సవంలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవారి దివ్య అనుగ్రహాన్ని పొందాలని టిటిడి కోరింది.

# నాచు సోయగం !



చర్మ సంరక్షణకు వాడే ఔషధాల జాబితాలోకి ఈసారి ఆల్గే చేరడమే కాదు, ట్రెండ్‌గానూ మారింది. ఇంతకీ ఇది మేలు చేసేనా? నాచు అంటే వర్షాకాలంలో ఇంటి చుట్టు పక్కల చేరేది అనుకునేరు! దీన్ని ప్రత్యేకంగా సముద్రాలు, నదుల నుంచి సేకరిస్తారు. ఇది కొన్ని దేశాల్లో ఆహారం కూడా. దీనిలోని పాలీశాకరైడ్లు చర్మంలో తేమను బంధించి ఉంచుతాయి. ఇన్‌ఫ్లమేషన్‌నీ దరిచేరనీయవు. వాతావరణంలో మార్పులు, కలుష్యం కారణంగా ఏర్పడే హాని నుంచి రక్షిస్తాయి. అందుకే బ్యూటీ ఉత్పత్తుల్లో నాచుకి చోటిస్తున్నారు. దీనిలోని అమైనో యాసిడ్లు, పాలీశాకరైడ్లు, పాలీఫినాల్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి. తద్వారా వృద్ధాప్యఛాయల్ని త్వరగా దరి చేరనీయవు. ఎన్నో పరిశోధనలూ దీనినన రుజువు చేస్తున్నాయి. వీగన్.. ఇప్పుడు చాలామంది బ్యూటీ ఉత్పత్తుల్లో చూస్తున్నది ఇదే! ఆల్గేని వృక్షజాతుల కిందే లెక్కేస్తారు కాబట్టి, ధైర్యంగా వాడొచ్చంటారు నిపుణులు. సీరమ్, మాయిశ్చరైజర్లలో దేన్నైనా నాచుతో తయారు చేసేనత ప్రయత్నించ మంటున్నారు. వారానికోసారి దీంతో తయారు చేసిన మాస్క్‌ని వేసుకున్నా ప్రయోజనమేనట. నిజానికి మన వాడే చాలారకాల యాంటీ పిగ్మెంటేషన్, యాంటీ యాక్నే ఉత్పత్తుల్లో చాలావరకూ ఆల్గే ప్యాక్‌ల పేరుతో ఆన్‌లైన్ వేదికల్లో ట్రెండ్ అవుతున్నాయి. నాచులోని విటమిన్లు, మినరల్స్ చర్మానికి మేలు చేస్తాయన్నది వాస్తవమే. టాక్సిన్లు, మలినాలను తొలగించి చర్మకణాల పునుద్ధరణకూ తోడ్పడతాయి. అయితే కొందరిలో ఇవి దురద, దద్దుర్లకు దారితీస్తాయి. కాబట్టి, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అదండీ సంగతి. మీరూ ప్రయత్నిస్తారా ఈ ఆల్గే ట్రెండ్? □

# హార్మోన్ల సమతుల్యత

ఒకప్పుడు హార్మోన్ల అసమతుల్యత, పీరియడ్ సమస్యలు 3540ఏళ్ల పైబడిన మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి. కానీ ఇప్పుడు 20-25 ఏళ్లలోపున్న యువతుల్లోనే కనిపిస్తున్నాయి. నెలసరి క్రమం తప్పడం, మొటిమలు, జుట్టు రాలడం, అకస్మాత్తుగా బరువు పెరగడం, మూడ్స్ వింగ్స్ వంటి



సమస్యలతో తరచూ ఆసుపత్రిలో మెట్లు ఎక్కుతున్నాయి. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం... ప్రతి ఐదుగురిలో ఒకరు పీసీఓఎస్‌తో బాధపడుతు న్నారట. కెరియార్, బిజీలైఫ్, సోషల్ మీడియా చూసి అను సరించే డైట్లు, జంక్‌ఫుడ్ వీటికితోడు నిద్రలేమి ఇవన్నీ హార్మోన్ల అసమతుల్యతకు కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య ఇలానే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. మందులతో కూడా రోజువారీ జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో వచ్చే డైట్ ప్లాన్స్ గుడ్డిగా పాటించొద్దు అంటున్నారు. ఒకవేళ డైటింగ్ చేసినా కార్బోహైడ్రేట్లను ఒక్క సారిగా పూర్తిగా మానేస్తే హార్మోన్లు మరింత దెబ్బతింటాయని చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో గుడ్లు, పప్పులు, పన్నీర్... వంటి ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోమంటున్నారు. విటమిన్లు, విటమిన్లు సమృద్ధిగా తీసుకుంటూ రోజుకు కనీసంఏడుగంటలు నిద్రపోవాలి. క్రమం తప్పకుండా 30-40నిమిషాలపాటు వాకింగ్ చేయడం అలవాటుచేసుకుంటే ఒత్తిడి తగ్గి హార్మోన్ల సమస్యలు దరిచేరవంటున్నారు. □

# ఆధారం ఆవిరి కాగా సంకల్పం 'స్వర్ణ'మైంది



ఉన్న జీవనోపాధి ఆవిరై పోయినా ఆమె సంకల్పం మారలేదు. ఎలాగైనా కరాటేలో జాతీయ ఛాంపియన్ కల నెరవేర్చుకోవడమే ఆమె కళ్ల ముందున్న లక్ష్యం. 'గమ్యం ఏదైనా సంకల్పం స్థిరంగా ఉంటే చేరుకోలేని తీరాలుండవు' ఇదే అసోంకు చెందిన పదిహేడేళ్ల క్రీడాకారిణి జన్మోని కొన్వార్ మనస్సులో బలంగా నాటుకున్న ఆశయం. ఎన్ని కష్టాలు ఎదురైనా సాధనను సంకల్పాన్ని వదులు కోలేదామె. తమకున్న గేదెల్ని అమ్మినా, చేపల్ని అమ్మినా చేరుకోగల లక్ష్యాన్ని చేరుకోవడమే ఆమె పని. ఇపుడామె భారతదేశం గర్వపడే విధంగా జాతీయ కరాటే ఛాంపయన్ షిప్‌లో 'స్వర్ణం'గెలిచి తలెత్తుకుని నిలిచేలా చేసింది. ఆమె కుటుంబానికి ఇప్పటికీ తలదాచుకునేందుకు ఇల్లు లేదు. అసోం వరదల్లో ఇల్లు కోల్పోయి, ఓ కట్ట మీద టార్పాలిన్ గూడు కింద జీవిస్తోంది. గత నెల 19న సంభవించిన వరదల్లో ఉన్న ఆమె ఇంటికి తగ్గరే ఉన్న ఆ ఒక్క ఆధారామూ చెల్లా చెదరైంది. నది కట్ట తెగడమే ఈ అనర్థానికి కారణం. అయినా ఆమె మనోసంకల్పం చెక్కు చెదరలేదు. కూడు, గుడ్డా, గూడు లేని వాళ్లకి ఆశలు, ఆశయాలు ఉండవనుకుంటే అది ముమ్మాటికీ పొరపాటే! ఆ విషయాన్ని 'జన్మోని' నిరూపించింది. అసోంలోని జోర్హాట్ జిల్లా బాగ్దోయి ఫోరియా గ్రామానికి చెందిన జన్మోని ఆగస్టు 7 నుంచి 9 వరకు ఢిల్లీలోని తల్కటోరా ఇండోర్ స్టేడియంలో జరిగే కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కాగానే ఆ కుటుంబం ఆనందానికి అంతేలేదు. తాము మూడేళ్లుగా పెంచుతున్న చేపలను అమ్మి ఆ డబ్బుతో 'జన్మోని'ని ఢిల్లీకి పంపాలని ఆమె కుటుంబం తలపెట్టింది. కానీ వరదల్లో తమకు తోడుగా ఉన్న చేపలు, కోళ్లు, బాతులు వరద



పాలవడంతో వారి ప్రణాళిక పూర్తిగా నాశమయ్యిందని ఆమె సోదరుడు కృష్ణమోని కొన్వార్ ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో ఓసారి ఆమె కరాటే పోటీల కెళ్లాల్సి వస్తే తమకున్న రెండు గేదెలను అమ్మి మరీ పంపారు. ఐదేళ్ల వయసు నుంచే 'కరాటే'కు జన్మోని దాసురాలె. శిక్షణా సౌకర్యాలు లేకున్నా 2023 కాంస్యం 2025లో స్వర్ణం గెలిచింది. ఐతే జీవితంలో తన ఆశయం నిలబెట్టుకోవడం కోసం ఎదురీదుతు జన్మోనికి ఊహించని ఆర్థిక వత్తాసు లభించింది. వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న 'ఫిజిక్స్‌వాలా' వ్యవస్థాపకుడు అలఖ్ పాండే 'జన్మోని'కి చేయూతనందించాడు. ఆమెతోపాటు 'జన్మోని. జట్టు' ఢిల్లీకి వెళ్లిరావడానికి ఖర్చులు, వసతి ఏర్పాటు చేసాడు. ఆమె కుటుంబానికి 2 లక్షల రూపాయల ఆర్థిక సాయం, సమకూర్చారు. అదే ఆమె 'జన్మోని'కి వెయ్యి ఏనుగుల బలమై ఢిల్లీ నుంచి 'స్వర్ణ'పతకంతో తిరిగొచ్చింది. □

# బచ్చలి గంజి



అద్భుత రుచి ఆకు కూరల్లో రాణీ లాంటిది బచ్చలి. ఇది ఏ కాలంలోనైనా దొరుకుతుంది. కనుక ఎప్పుడంటే అప్పుడు తినొచ్చు. మనం పప్పు, టొమాటోలతో కలిపి చేస్తే.. వేరే వేరే రాష్ట్రాల్లో వేరేవేరే విధాల్లో వండుతారు. ఉత్తరాఖండ్ వాసులు 'కాపులీ' పేరుతో చేస్తారు. పేరు బాగుంది కదూ! రుచీ సూపరే. ఎలా చేస్తారంటే. . కడాయిలో రెండు చెంచాల నూనె వేసి.. వేడయ్యాక.. ఆవాలు, ఎండుమిర్చి కచ్చాపచ్చా దంచిన వెల్లుల్లి వేయాలి. ఆవాలు చిటపటలాడాక. ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, బచ్చలికూర పేస్టు వేయాలి. కాస్త వేగాక.. రెండు చెంచాల నెయ్యి వేయాలి. కాస్త వేయించి.. రెండు చెంచాల గంజి పోయాలి. దగ్గరగా అయ్యాక.. తగినంత కారం, ఉప్పు వేసి.. ఇంకో నిమిషం ఉంచి దించేయాలి. అందులో అర కప్పు మీగడ వేస్తే.. ఘుమఘుమలాడే 'కాపులీ' సిద్ధమై పోతుంది. ఇది అన్నం, రొట్టెలు.. ఎందులోకైనా బాగుంటుంది. ఇదెంతో ఆరోగ్యకరమైన వంటకం అంటారు ఆహార నిపుణులు. రుచీ, ఆరోగ్యం రెండూ కావాలంటే ఇలాంటివి తింటుండాలి. పైగా చేయడం కూడా చాలా తేలిక. నచ్చితే మీరూ చేసి చూడండి. □

# చపాతీలకు 'సెగ' వద్దు !



వళ్లు తగ్గాలని రాత్రిపూట భోజనానికి బదులు ఆయిల్ లేని చపాతీలు, రోటీలు తింటుంటారు. అయితే అవి మెత్తగా రావాలని పెనంమీద కాసేపు వేడి చేసి తరవాత నేరుగా స్టవ్ మంటపై కాలుస్తుంటారు. దీని గురించి తాజా పరిశోధన ఏమంటోందంటే. ఇలా నేరుగా పెద్ద మంటపై కాలచ్చడంవల్ల రోటీలోని కర్బన పదార్థాలు విచ్ఛిన్నమై కొద్దిస్థాయిలో హానికర అమైన్లూ హైడ్రోకార్బన్లూ ఉత్పత్తవుతాయి. వీటివల్ల శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది అంటున్నాయి. తాజా పరిశోధనలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ విషయమై హెచ్చరికచేస్తోంది. మీరూ ఇలా చేస్తున్నారా.. కాబట్టి జాగ్రత్త. □

# బ్రహ్మదేవుని శాపం



రావణుడి కఠోర తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు అనేక వరాలను ఇచ్చాడు. అలాంటి బ్రహ్మదేవుని కుమార్తె అయిన పుంజికస్థల పట్ల రావణుడు తప్పుగా ప్రవర్తిస్తాడు. రావణుడి కారణంగా తనకి జరిగిన అవమానాన్ని గురించి ఆమె బ్రహ్మదేవుడికి చెబుతుంది. దాంతో ఆగ్రహించిన బ్రహ్మదేవుడు, పరస్త్రీని ఆమె అంగీకారం లేకుండా తాకినట్టయితే అతని శిరస్సు ముక్కలవుతుందని శపిస్తాడు. రావణుడు ఎన్ని విధాలుగా బ్రహ్మదేవుడిని ప్రాధేయపడినా, తన వాక్కు ఫలించి తీరుతుందని చెబుతాడు. ఈ కారణంగానే .. సీతాదేవిని అపహరించి నప్పటికీ రావణుడు ఆమె సమీపంలోకి కూడా వెళ్లలేక పోతాడు. బ్రహ్మదేవుడు రావణుడికి ఇచ్చిన శాపం, సీతాదేవికి వరంగా మారుతుంది. ఇలా నారదుడు .. వశిష్ఠుడు .. నందికేశ్వరుడు రావణుడికి ఇచ్చిన శాపాలు, ఆయన బారి నుంచి సీతమ్మ తల్లిని రక్షి స్తూ వచ్చాయి.

## తెర

# 'అగధ'ప్రీ రిలీజ్ ఈవెంట్




శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీవిశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగద'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్‌కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వైవా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ప్రముఖ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ..నాకు హనీ (ఎం.ఎస్. రాజు) మంచి స్నేహితుడు. 45 ఏళ్ల క్రితం మా జర్నీ మొదలైంది. మా నాన్న, వాళ్ల నాన్న నిర్మాతలే. ఇద్దరం సినిమా ఇండస్ట్రీలోనే పెరిగాం. సినిమాలే తీయాలని చిన్నప్పటి నుంచీ అనుకున్నాం. ఇద్దరం కోడి రామకృష్ణ గారితోనే జర్నీ ప్రారంభించాం. 1985, 1986 నుంచి ఎం.ఎస్. రాజుని గమనిస్తూనే ఉన్నాను. ఆయన ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ప్రతీ క్రాఫ్ట్ మీద గ్రిప్‌ను సాధించారు. ఆయనకు ఆయనే ట్రెండ్ సెటర్‌గా మారారు. అన్ని రకాల చిత్రాల్ని ఆయన నిర్మించారు. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ.. .అగధ టీజర్, ట్రైలర్ అందరూ చూశారు. నేను చెప్పడానికి ఇంకా ఏమీ లేదు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మరీ ముఖ్యంగా కాశీ విశాలాక్షి కి,అజయ్‌కి ధన్యవాదాలు. ఆగస్ట్ 15న సక్సెస్ మీట్ నిర్వహిస్తాం. లాస్ట్ ఓవర్‌లో 24 రన్స్ కొట్టాలంటే ఆ మ్యాచ్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. కానీ నేను సూపర్ ఓవర్‌లా సినిమాని తీశాను. అగధలో టెక్నికల్ టీం, ఆర్టిస్టుల టీం కలిసి పోటాపోటీగా చేశారు. సాయి రాజేష్ మాట్లాడుతూ..'రాజు వద్ద నేను రెండేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ఆఫీస్‌లో కూర్చుని ఎన్నో నేర్చుకున్నాను.

# 'పళ్ళ బురుసు' 14న విడుదల




అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న చిత్రం పళ్ళబురుసు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్‌గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది,"పళ్ళ బురుస్తు ఆగస్టు 14న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకకు కింగ్ నాగర్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ:"అందరికీ నమస్కారం. అన్నపూర్ణ స్టూడియోస్‌కు ఇది 50వ సంవత్సరం. నాన్నగారు ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో అద్భుతమైన చిత్రాలను నిర్మించాం. జాతీయ అవార్డులు అందుకున్న సినిమాలను కూడా రూపొందించాం. ఈ 50వ సంవత్సరం సందర్భంగా మా టీమ్ అంతా కలిసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం.అందులో భాగంగా డిస్ట్రిబ్యూషన్‌ను విస్తరించాం. నిర్మాత వివేక్ కృష్ణాణి మాట్లాడుతూ: అన్నపూర్ణ స్టూడియోస్‌తో కలిసి పనిచేయడం నాకు ఎంతో గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమా జర్నీలో వారితో కలిసి భాగం కావడం మరింత ఆనందంగా ఉంది. నిర్మాత సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ: ఈ కథ మొదటిసారి విన్నప్పుడే సినిమాగా తీయాలని నిర్ణయించుకున్నాను. చాలా స్వీట్ స్టోరీ. ఇలాంటి కథను చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఎప్పుడూ కొత్త కథలనే వెతుకుతుంది. ఈసారి ఎపిక్ స్టూడియోస్‌తో కలిసి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ ఉదయ్ చౌహాన్ మాట్లాడుతూ: నాకు పునర్జన్మనిచ్చిన అమ్మలాంటి ప్రొడక్షన్ హౌస్‌లు అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్‌కి థాంక్యూ సో మచ్. నేను చిన్నప్పటి నుంచి నాగార్జునకి వీరాభిమానిని. ఆయన సినిమాల ప్రభావం నాపై ఎంతో ఉంది. అలాంటి నాగార్జున గారికి నా కథ చెప్పే అవకాశం వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

# 'ఐ యామ్ గేమ్ 20న వరల్డ్‌వైడ్ రిలీజ్



దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్"ఐ యామ్ గేమ్ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. ఎవరే నువ్వే పేరుతో విడుదలైన ఈ పాటకు జేక్స్ బిజోయ్ సంగీతం అందిం చారు. తమిళ వెర్షన్‌కు విఘ్నేష్ రామకృష్ణ, హిందీ వెర్షన్‌కు నుమాన్ ఖోకర్, కన్నడ వెర్షన్‌కు హృదయ శివ సాహిత్యం అందించారు. కన్నడ వెర్షన్‌ను అనిరుద్ధ్ సుస్వరం ఆలపించారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆగస్టు 20, 2026న ఓనం కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు పాన్ ఇండియా స్థాయిలో అద్భుతమైన స్పందన వచ్చింది. అద్భుతమైన విజువల్స్, హైవోల్టేజ్ యాక్షన్, థ్రిల్లింగ్ ఛేజ్ సీక్వెన్స్‌లతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. దక్షి ణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సినిమా మలయాళ సినీ పరిశ్రమలోనే భారీ స్థాయిలో తెరకెక్కిన చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో ఇది 40వ చిత్రం కావడం మరో ప్రత్యేకత. ఆంటోనీ వర్గీస్, తమిళ నటుడుదర్శకుడు మిస్కిన్, కాయదు లోహర్, కతిర్, పార్థ్ తివారీ, సంయుక్త విశ్వనాథన్ తదితరులు కీలకపాత్రల్లో నటిస్తున్నారు. జీ మ్యూజిక్ ఈ చిత్రం మ్యూజిక్ రైట్స్‌ను సొంతం చేసుకుంది.లోకః వంటి భారీ విజయాన్ని అందుకున్న తర్వాత వే2ఫేర్ ఫిల్మ్స్ నుంచి వస్తున్న చిత్రం కావడం, ఆర్డీఎక్స్ తర్వాత నహాస్ హిదాయత్ తెరకెక్కిస్తున్న సినిమా.

# 'ఓ మై డాగ్' కు మంచి స్పందన వచ్చింది

'ఓ మై డాగ్' సెలబ్రేట్ చేసుకునే సినిమా: శశికిరణ్ తిక్కఅమిత్ రాయ్ దర్శకత్వంలో



పంకజ్ త్రిపాఠి, రాజేష్ కుమార్, గీతా అగర్వాల్ శర్మ, పవన్ మల్హోత్రా, శ్రీధర్ దూబే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మై డాగ్' రాజేష్ భరద్వాజ్, అమిత్ రాయ్, సనా వార్సీ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 7న విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ప్రెస్ మీట్ లో దర్శకుడు అమిత్ రాయ్ మాట్లాడుతూ..నేను హైదరాబాద్‌కు ఎన్నోసార్లు వచ్చాను. పవన్ కళ్యాణ్ , రామ్ చరణ్ గారు, దిల్ రాజు గారితో పాటు ఎంతోమందిని కలిశాను. కొన్ని ప్రాజెక్టులు కూడా అనుకున్నాం. కానీ అవి కుదరలేదు. ఇప్పుడు హైదరాబాద్ నుంచే నాకు పిలుపు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇదే వేదికపై రానాని, వెంకటేష్ గారిని కలిశాను. దర్శకుడు శశికిరణ్ తిక్క మాట్లాడుతూ.. ఇది ప్రతి ఒక్కరూ సెలబ్రేట్ చేసుకోవాల్సిన సినిమా. అమిత్ రాయ్ గారు గతంలో తీసిన ఓ మై గాడ్ 2 ఎంత పెద్ద విజయం సాధించిందో మనందరికీ తెలుసు. ఇప్పుడు"ఓ మై డాగ్ కూడా అందరూ తప్పకుండా చూసి ఆనందించాల్సిన సినిమా. దేశం మొత్తం గర్వించాల్సిన సినిమా ఇది.

# సీనియర్ నటుడు కృష్ణేశ్వరరావు కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసు కుంది. ప్రముఖ సీనియర్ నటుడు నాటక రంగ దిగ్గజం, రచయిత ఎల్లాప్రగడ సౌభాగ్య కృష్ణశ్వరరావు (వైఎస్ కృష్ణశ్వరరావు) కన్ను మూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందేత్తె మంగళవారం గుంటూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. పాఠశాల రోజులు తన సుదీర్ఘ ప్రస్థానంలో 1,500 కు పైగా నాటకాల్లో నటించారున కెరియర్‌లో ఎన్నో ప్రయోగాత్మక నాటకాలను రచించి ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో అనేక మంది అవార్డును అందుకున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ, నాటకరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు

# 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' మూవీ ఫోటో రిలీజ్



వైవిధ్యమైన పాత్రల్లో నటించి విలక్షణ నటుడిగా పేరు పొందిన స్టార్ యాక్టర్ ఫహాద్ ఫాజిల్, ఇండస్ట్రీ హిట్ బాహుబలి మూవీని నిర్మించిన మేకర్స్‌తో పాటు సెన్సేష నల్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందు తోన్న చిత్రం"డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. షోయింగ్ బిజినెస్ బ్యానర్‌పై తన తొలిసారి డిస్ట్రి బ్యూట్ చేసిన ప్రేమలు చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ప్యాషనేట్ ప్రొడ్యూసర్ ఎస్.ఎస్. కార్తికేయ.. ఇప్పుడీ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ను ఇండియన్ సినిమాకు గర్వకారణం గా నిలిచిన బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాతలైన ఆర్కా మీడియాతో కలిసి రూపొందిస్తున్నారు."డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ చిత్రానికి కొత్త దర్శకుడు శశాంక్ యేలేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో వెర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాసిల్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ కలసి ఈ ఆసక్తికరమైన, కంటెంట్ రిచ్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాల భైరవ సంగీత సారథ్యంలో స్వరపరిచిన ఈ పాట సూరి అనే పాత్రను, అతని పిచ్చితనాన్ని ఓ ప్రత్యేకమైన సెటప్‌లో పరిచయం చేస్తుంది. కాల భైరవ, ఫహాద్ ఫాసిల్, స్వారా కలయికలో ఈ ప్రత్యేక మ్యూజిక్ వీడియోను మేకర్స్ రూపొందించారు. ముందు కూల్‌గా ప్రారంభమైన ఈ పాట..కాల భైరవ తన థంపింగ్ బీట్స్‌తో ఎంట్రీ ఇచ్చిన వెంటనే పూర్తి స్థాయి వాకీ మోడ్‌లోకి మారుతుంది. కాల భైరవ, ఎంసీ హరి కలిసి ఈ పాటకు క్యాచీ లిరిక్స్ అందించారు. సూరి డేర్‌డెవిల్ స్వభావాన్ని, అతనికి ప్రతి పని ఎంత ఈజీగా"కేక్‌వాక్‌లా ఉంటుందనే విషయాన్ని చక్కటి పదాలతో హైలైట్ చేశారు. వీరిద్దరూ పాటను ఎనర్జీతో పాడుతూ మరింత స్పెషల్ అనిపించేలా చేశారు. ఫహాద్ ఫాజిల్ ఎనర్జీ, వైబ్స్ చూస్తే ఆవేశం సినిమాలోని రంగ చేట్టా పాత్ర గుర్తుకు వస్తుంది.

# మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా 'సర్దార్ సర్వాయి పాపన్న' ట్రైలర్ లాంచ్



బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన మూవీ "సర్దార్ సర్వాయి పాపన్న". ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ మూవీ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.తెలంగాణ ట్రాన్స్ పోర్ట్, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యం నెలకొల్పాలి, మన రాజ్యం మనమే పరిపాలించుకోవాలని పోరాటం సాగించిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న. ఆయన కోటలను జయిస్తూ గోల్కొండ కోటదాకా వెళ్లిన ఆయన పోరాటం ఈ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. అలాంటి ధీరుడి చరిత్రతో వెంకటేష్ గౌడ్ సినిమా రూపొందించడం, ఆ సినిమాను రామకృష్ణ గౌడ్ రిలీజ్ చేస్తుండటం సంతోషకరం. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను పుస్తకరూపంలోనూ వెంకటేష్ గౌడ్ తీసుకొస్తుండటం అభినందనీయం. డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ మా సర్దార్ సర్వాయి పాపన్న సినిమా ట్రైలర్ ను మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా రిలీజ్ చేసుకోవడం ఆనందంగా ఉంది.

# రోహిత్, విరాట్, బుమ్రా రీఎంట్రీ



## బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌కు టీమిండియా కూర్పు

**న్యూఢిల్లీ:** సెప్టెంబర్‌లో జరగనున్న బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియాను పంపించేందుకు బిసిసిఐ సన్నాహాలు చేస్తోంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం దిగ్గజ ఆటగాళ్లతో కూడిన 15 మంది సభ్యుల భారత జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు విజ్ఞప్తి మేరకు సెప్టెంబర్ 1 నుంచి 6 వరకు జరగాల్సిన మూడు వన్డేల సిరీస్ కోసం టీమిండియాను పంపించేందుకు బిసిసిఐ కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరేందుకు సిద్ధమైంది. కేంద్ర సర్కార్ నుంచి పచ్చజెండా లభిస్తే భారత జట్టు వెంటనే అక్కడకు పయనమవుతుంది. ఈ క్రమంలోనే సీనియర్లు, యంగ్ ప్లేయర్ల కలయికతో ఒక పటిష్టమైన 15 మంది సభ్యుల స్క్వాడ్‌ను సిద్ధం చేసేందుకు సెలెక్టర్లు కసరత్తు చేన్నారు. ముఖ్యంగా లార్డ్స్‌లో సెంచరీతో పాత ఫామ్‌ను రీ క్రియేట్ చేసిన రోహిత్ శర్మకు మరో అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. యశస్వి జైస్వాల్‌ను బ్యాకప్ ఓపెనర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే యోచనలో మేనేజ్‌మెంట్ ఉంది. వైస్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ వ్యవహరించే అవకాశాలను పరిశీలిస్తోంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా ఈ జట్టులో కొనసాగనున్నాడు. వికెట్ కీపింగ్ విభాగంలో మొదటి ప్రాధాన్యతగా కేఎల్ రాహుల్ ఉండగా, రెండో వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకోనున్నారు. యువత, అనుభవజ్ఞుల కలయికతో కూడిన ఈ బ్యాటింగ్ లైనప్ బంగ్లాదేశ్ పరిస్థితుల్లో భారీ స్కోర్లు సాధించడానికి బాగా ఉపయోగపడుతుందని సెలక్టర్లు భావిస్తున్నారు. రైట్ ఆర్మ్ పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌తో మళ్లీ వన్డే జట్టులోకి అడుగుపెట్టడం దాదాపు ఖాయంగా మారింది. దీంతో శివమ్ దూబేకు చోటు దక్కకపోవచ్చు.

స్పిన్ విభాగంలో ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లతో పాటు ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఎంపికయ్యే సూచనలు ఉన్నాయి. పేస్ విభాగానికి స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా నాయకత్వం వహించనున్నాడు. అతడితో పాటు మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్ బౌలింగ్ దళంలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రసిద్ధ్ కృష్ణస్థానంలో సిరాజ్‌కు జట్టులో చోటు లభించవచ్చని భావిస్తున్నారు. యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ ఇంకా గాయాల నుంచి పూర్తిస్థాయిలో కోలుకోలేదు. దాంతో ఈ ఇద్దరు ఆటగాళ్లు బంగ్లాదేశ్ పర్యటనకు అందుబాటులో ఉండటం కష్టమేనని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.



## వెస్టిండీస్ కొంపముంచిన అఫ్గాన్

### వరల్డ్ కప్ డైరెక్ట్ క్వాలిఫికేషన్‌కు దూరం

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఒకప్పుడు క్రికెట్ రారాజుగా వెలుగొందిన వెస్టిండీస్ దారుణమైన ప్రదర్శనతో పాతాళానికి పడిపోయి వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీకి నేరుగా అర్హత సాధించలేకపోయింది. గత వన్డే ప్రపంచకప్ 2023 టోర్నీ కూడా వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించకపోగా, క్వాలిఫయర్స్‌లోనూ పసికూన జట్లతో ఓడి టోర్నీకి దూరమైంది. క్వాలిఫయర్స్‌లోనూ పేలవ ప్రదర్శనతో టోర్నీకి అర్హత సాధించలేదు. ఇప్పుడు కూడా వెస్టిండీస్ అదే పరిస్థితి ఎదుర్కొంటుంది. తాజాగా ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ విజయం సాధించి ప్రపంచకప్ బెర్త్‌ను దక్కించుకుంది. దాంతో వెస్టిండీస్ ఆశలు ఆవిరయ్యాయి. వన్డే ర్యాంకింగ్స్ ద్వారా నేరుగా టోర్నీకి అర్హత సాధించడానికి ఐసిసి ఈ సెప్టెంబర్ 30 వరకు డెడ్‌లైన్ విధించింది. వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్8లో ఉన్న దేశాలు నేరుగా అర్హత సాధిస్తాయి. ఈ 8 జట్లతో పాటు ఆతిథ్య దేశాలుగా ఉన్న సౌతాఫ్రికా, జింబాబ్వే కూడా క్వాలిఫై అవుతాయి. 8వ స్థానంతో అఫ్గాన్ నేరుగా క్వాలిఫై అయ్యింది. ప్రస్తుతం వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో పదో స్థానంలో ఉన్న కరేబియన్ టీమ్, కటాఫ్ తేదీ నాటికి రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఆ రెండూ సెప్టెంబర్‌లో భారత్‌తోనే జరగనున్నాయి. ఆ రెండింటిలో గెలిచినా వెస్టిండీస్ టాప్8లో నిలవదు. ఆ జట్టు ప్రపంచకప్‌లో ఆడాలంటే ఫిబ్రవరి 2027లో నిర్వహించే క్వాలిఫయర్ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. లేదంటే వరుసగా రెండోసారి ప్రపంచకప్‌నకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

## వన్డే వరల్డ్ కప్: అఫ్ఘాన్‌కు అర్హత

### ఐర్లాండ్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్‌పై విజయం సాధించి అఫ్ఘానిస్థాన్ వన్డే ప్రపంచ కప్-2027కు అర్హత సాధించింది. వన్డే మ్యాచ్‌లో అఫ్గాన్ 3 వికెట్లు తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 46.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయింది. గావిన్ హోయ్ 36 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, కేడ్ కారనఇమచల్ 32, జై మూంద్రా 31తో పర్వాలేదనిపించారు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్‌ఖాన్, గజన్‌ఫర్ చెరో 3 వికెట్లతో విజృంభించగా, యామిన్ అహ్మద్‌జయ్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం అఫ్గానిస్తాన్ 44.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ రహమనుల్లా గుర్బాజ్ 71 పరుగులతో అర్ధ సెంచరీ చేసి రాణించగా, చివర్లో రషీద్‌ఖాన్ 37 పరుగులతో నాటౌట్‌గా మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఐర్లాండ్ బౌలర్లలో గావిన్ హాక్షయ్ 4 వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో అఫ్గానిస్తాన్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది.

## రేప్ కేసులో.. ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్



**న్యూఢిల్లీ:** భారత దేశవాళీ క్రికెట్‌తో పాటు, ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున మెరుపులు మెరిపించిన యువ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణల్లో చిక్కుకున్నాడు. రేప్, వేధింపుల కేసులో అభిషేక్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్‌చేశారు. పెళ్లిచేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకుని మోసం చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని హుగ్లీలోని మొగ్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు హుగ్లీలోని ఎమామి సిటీలో 23 ఏళ్ల పోరెల్‌ను అదుపులోకి తీసుకుని, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చించురా న్యాయ స్థానంలో హాజరుపరిచారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం, 2023 జనవరి నుంచి అభిషేక్ పోరెల్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి, పోరెల్ తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని సదరు విద్యార్థిని ఆరోపించింది. తాము కలిసి విదేశాలకు సైతం వెళ్లామని తెలిపింది. యేడాది కాలంగా వీరి మధ్య విబేధాలు తలెత్తాయి. ప్రశ్నించిన తనపై దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ కేసులో పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని బాధితురాలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ధర్మాసనం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, నిందితుడైన అభిషేక్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, అతడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేయాలని బెంగాల్ పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కీలక ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి పోరెల్‌ను కస్టడీలోకి తీసుకున్నారు.

## సింక్‌ఫీల్డ్ కప్.. డ్రాతో ప్రజ్ఞానంద ప్రారంభం




**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్‌లోని చివరికి ముందు జరిగే ఈవెంట్ అయిన సింక్‌ఫీల్డ్ కప్ మొదటి రౌండ్‌లో, భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అమెరికన్ జీఎం శామ్యూల్ సెవియన్‌తో డ్రా చేసుకుని తన ప్రయాణాన్ని పారంభించాడు.

మంగళవారం నల్ల పావులతో ఆడుతూ, ప్రజ్ఞానంద చాలావరకు నియంత్రణలో ఉన్న ఆటలో రూయ్ లోపెజ్ యొక్క ఆర్ఖంగెల్స్క్ వేరియేషన్‌ను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నా ఇరు పక్షాలలో ఏ ఒక్కరికీ గెలిచేందుకు గట్టి అవకాశాలు లేకుండా పోయాయి. ఈ విధంగానే 48 ఎత్తుల పాటు సాగిన ఈ పోరు డ్రాగా ముగిసింది. 10 మంది ఆటగాళ్లు పాల్గొని, తొమ్మిది రౌండ్లు జరిగే ఈ టోర్నమెంట్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ ఫాబియానో కరువానా ఏకైక విజేతగా నిలిచాడు. ఆట మధ్యలో తన ప్రత్యర్థి ఒక పాన్‌ను కోల్పోయేలా చేసిన వ్యూహాత్మక తప్పిదాన్ని సద్వినియోగం చేసుకుని, ఈ అమెరికన్ ఆటగాడు డచ్ ఆటగాడైన జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌ను ఓడించాడు. కరువానా తనదైన కచ్చితత్వంతో వస్తుపరమైన ఆధిక్యాన్ని సద్వినియోగం చేసుకుని, 55 ఎత్తుల తర్వాత పూర్తి పాయింట్‌ను కైవసం చేసుకుని, టోర్నమెంట్‌లో తొలి ఆధిక్యాన్ని సాధించాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీదారు, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జవోఖిర్ సిందరోవ్, యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన లెవాన్ అరోనియన్‌తో డ్రా చేసుకున్నాడు. నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరి మరియు ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్‌లగ్రావ్ రెండవ డ్రాను పూర్తి చేశారు. రూక్‌అండ్‌పాన్స్ ఎండింగ్‌కు చేరుకున్న ఈ మ్యాచ్, ఆటగాళ్లు స్ప్లిట్ పాయింట్‌కు అంగీకరించే వరకు పోటీగా కొనసాగింది.

## స్మాల్‌క్యాప్ ఫండ్లలో రికార్డు స్థాయి పెట్టుబడులు..

### డెట్ ఫండ్లకు భారీగా నిధులు




**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాలలో పెట్టుబడులు గత జులైలో కొంత మందగించాయి. జూన్‌లో రూ.28,973 కోట్లుగా ఉన్న మొత్తం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ ఇన్‌ఫ్లోస్ జులైలో 15 శాతం తగ్గి రూ.24,697 కోట్లకు చేరాయి. ఈక్విటీ ఫండ్ పెట్టుబడులు మొత్తం మీద తగ్గినప్ప టికీ, అన్ని విభాగాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించలేదు. స్మాల్‌క్యాప్ ఫండ్లు పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షించాయి. జులైలో ఈ పథకాల్లోకి రూ.7,767 కోట్ల తాజా పెట్టుబడులు వచ్చాయి. ఈ విభాగానికి ఒక నెలలో వచ్చిన అత్యధిక పెట్టుబడులు ఇవే కావడం విశేషం. జూన్‌తో పోలిస్తే స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి వచ్చిన పెట్టుబడులు 39 శాతం పెరిగాయి. దీంతో 11 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ విభాగాల్లో నెలవారీ వృద్ధి పరంగా స్మాల్‌క్యాప్ ఫండ్లు అగ్రస్థానంలో నిలిచాయి. మిడ్‌క్యాప్ ఫండ్లు రూ.6,192 కోట్ల ఇన్‌ఫ్లోతో రెండో స్థానంలో నిలిచాయి. ఫ్లెక్సీక్యాప్ ఫండ్లలోకి రూ.4,709 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. లార్జ్ అండ్ మిడ్‌క్యాప్, మల్టీక్యాప్ ఫండ్లు కూడా జూలైలో సానుకూల ఇన్‌ఫ్లోలను నమోదు చేశాయి. ఈ రెండు విభాగాల్లో వరుసగా రూ.3,425 కోట్లు, రూ.3,227 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అయితే లార్జ్‌క్యాప్ ఫండ్ల నుంచి అత్యధికంగా రూ.1,321 కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు. ఈఎల్ఎస్ఎస్ ఫండ్ల నుంచి రూ.959 కోట్ల ఔట్‌ఫ్లో నమోదైంది. డివిడెండ్‌యీల్డ్ ఫండ్లు, వ్యాల్యూ/కాంట్రా ఫండ్ల నుంచి కూడా వరుసగా రూ.169 కోట్లు, రూ.144 కోట్ల నిధులు బయటకు వెళ్లాయి. ఫోకస్డ్ ఫండ్లలోకి వచ్చిన పెట్టుబడులు గత నెలతో పోలిస్తే 43 శాతం తగ్గడం కూడా గమనార్హం. మరోవైపు మల్టీక్యాప్ ఫండ్లలో ఇన్‌ఫ్లోస్ 5 శాతం పెరగగా, స్మాల్‌క్యాప్ ఫండ్లు 39 శాతం వృద్ధితో డెట్ ఫండ్లలోకి ఏకంగా రూ.1.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు రెండు నెలల్లో కలిపి రూ.2.06 లక్షల కోట్ల ఔట్‌ఫ్లో నమోదైన నేపథ్యంలో జూలై గణాంకాలు భారీ రికవరీని సూచిస్తున్నాయి.

## వేదాంత కొత్త కంపెనీల్లోకి రూ.1,300 కోట్ల నిధులు!




**న్యూఢిల్లీ,ఆగస్టు 11:** వేదాంత గ్రూప్ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన నాలుగు కంపెనీలు వేదాంత అల్యూమినియం మెటల్, వేదాంత ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్, వేదాంత పవర్‌లు సెప్టెంబర్ 2026లో జరగనున్న ఎన్ఎస్ఇ సూచీల పునర్వ్యవస్థీ కరణతో భారీగా ప్రయోజనం పొందే అవకాశం ఉందని అంచనాలు వెలువడ్డాయి. ఈ నాలుగు కంపెనీల్లోకి కలిపి సుమారు రూ.1,300 కోట్ల వరకు నిధులు రావచ్చు.ఇది ముఖ్యంగా ఇండెక్స్ ఫండ్లు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు వంటి ఎన్ఎస్ఇ సూచీలను అనుసరించే పాసివ్ ఫండ్లపై ప్రభావం చూపనుంది. ఒక స్టాక్ సూచీలో చేరినప్పుడు, ఆ సూచీని అనుసరించే ఫండ్లు తమ పోర్ట్‌ఫోలియోలను సర్దుబాటు చేసి కొత్తగా చేరిన షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఆయా కంపెనీల షేర్లకు అదనపు డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. వేదాంత అల్యూమినియం మెటల్‌కే అత్యధిక వాటా దక్కనుంది. వేదాంత పవర్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలకు మాత్రం తక్కువ స్థాయిలో పాసివ్ ఫ్లోస్ ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే ఈ కంపెనీల షేర్లను కలిగిఉన్న ఇన్వెస్టర్లకు స్వల్పకాలంలో ఇది సానుకూల పరిణామంగా మారవచ్చు. సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి కొనుగోళ్లు పెరగడం వల్ల షేర్లలో లిక్విడిటీ మెరుగుపడటంతో పాటు ధరలకు కొంత మద్దతు లభించే అవకాశం ఉంది. వేదాంత గ్రూప్ డీమెర్జర్ తర్వాత ఈ కంపెనీలు ప్రత్యేక సంస్థలుగా ఏర్పడిన నేపథ్యంలో ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యత ఉంది. కొత్తగా పెట్టుబడి పెట్టాలనుకునే వారు కేవలం ఇండెక్స్ రీబ్యాలెన్సింగ్ ద్వారా వచ్చే అంచనా నిధుల ప్రవాహాన్ని ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా, సూచీల రీబ్యాలెన్సింగ్ ఈ నాలుగు కొత్త వేదాంత కంపెనీల షేర్లకు డిమాండ్ పెంచే ఉత్ప్రేరకంగా పనిచేసే అవకాశం ఉన్నప్పటికీ, ఇది షేర్ ధర పెరుగుదలకు పెట్టుబడి హామీ మాత్రం కాదని నిపుణులు చెబుతున్నారు.

## వార్ ఎఫెక్ట్... నష్టాల్లో ముగిసిన బెంచ్‌మార్క్ సూచీలు




**ముంబయి, ఆగస్టు 11:** ముడిచమురు ధరలు పెరగడం, అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ఆశలు సన్నగిల్లడంతో మళ్లీ భౌగోళిక రాజకీయ అనిశ్చితి నెలకొనడం దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది. మంగళవారం కీలక బెంచ్ మార్క్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. బ్యారెల్ ముడిచమురు ధర 90 డాలర్లకు చేరువ కావడంతో భారత్ దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణం, కంపెనీల లాభాల మార్జిన్లపై ఆందోళనలు పెరిగాయి. బలహీనమైన అంతర్జాతీయ మార్కెట్ సంకేతాలు కూడా దేశీయ మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. ఎఫ్ఎంసీజీ, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో నిఫ్టీ ఒత్తిడికి లోనయింది.

ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 388.19 పాయింట్లు నష్టపోయి 78,154.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 112.10 పాయింట్లు శాతం తగ్గి 24,471.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో మహీంద్ర 1.62 శాతం, ఎయిర్‌టెల్ 1.43 శాతం,యాక్సిస్‌బ్యాంకు 1.40 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ దాదాపు మార్పు లేకుండా ముగియగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.24 శాతం లాభపడింది. బిఎస్ఇలో మొత్తం 2,033 షేర్లు లాభపడగా, 2,279 షేర్లు నష్టపోయాయి. మరో 209 షేర్లలో ఎలాంటి మార్పు కనిపించలేదు. కమోడిటీ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 2.14 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 89.86 డాలర్లకు చేరింది.ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. గత సెషన్‌లో 95.3050 వద్ద ముగిసిన పాక్షిక కన్వర్టబుల్ రూపాయి,

మంగళవారం 95.4450 వద్ద ట్రేడైంది.ఎంసిఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.50 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,53,869కు చేరాయి.మ్యాట్రిమొనీ డాట్‌కామ్ షేరు 10.34 శాతం ఎగిసింది. కోల్టేపాటిల్ షేరు 11.48 శాతం దూసుకెళ్లింది.ఇండ్ స్విఫ్ట్ ల్యాబ్స్ షేరు 20 శాతం లాభపడింది. త్రివేణి టర్బైన్స్ షేరు 5.63 శాతం పడిపోయింది.

కంపెనీ ఏకీకృత నికర లాభం 20.78 శాతం తగ్గి రూ.51.1 కోట్లకు చేరినట్లు ప్రకటించడంతో షేరుపై ఒత్తిడి నెలకొంది. వొడాఫోన్ ఐడియా షేరు 0.23 శాతం తగ్గింది. 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టెలికాం సంస్థ ఏకీకృత సర్దుబాటు చేసిన నికర నష్టం రూ.5,361.99 కోట్లకు తగ్గింది.భారత్ ఫోర్జ్‌షేరు 2.01 శాతం నష్టపోయింది.ఫినోలెక్స్ కేబుల్స్ షేరు 14.64 శాతం పెరిగి ర్యాలీ తీసింది.

## మూడు బిలియన్ డాలర్ల నిధుల సమీకరణలో ఐదు బ్యాంకులు




**ముంబయి,ఆగస్టు 11:** భారతీయ ప్రైవేట్ బ్యాంకులు విదేశీ మార్కెట్ల నుంచి భారీగా నిధులు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఐదు బ్యాంకులు సుమారు 3 బిలియన్ డాలర్లు సమీకరించేందుకు డాలర్ బాండ్లు లేదా విదేశీ రుణాల జారీని పరిశీలిస్తున్నాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ డాలర్ బాండ్ల జారీ ద్వారా గరిష్ఠంగా 1 బిలియన్ డాలర్లు సమీకరించాలని యోచిస్తోంది. మరో నాలుగు బ్యాంకులు ఫెడరల్‌బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఆర్బీఎల్ బ్యాంకు, యెస్ బ్యాంక్ ఒక్కొక్కటి 250 మిలియన్ డాలర్ల నుంచి 500 మిలియన్ డాలర్ల వరకు బాండ్లు లేదా రుణాల ద్వారా సమీకరించేందుకు పరిశీలిస్తున్నాయి. భారతీయ రూపాయిపై ఒత్తిడిని తగ్గించి, దేశంలోకి డాలర్ల ప్రవాహాన్ని పెంచేందుకు ఆర్బీఐ తీసుకుంటున్న చర్యలకు ప్రైవేట్ బ్యాంకుల తాజా విదేశీ నిధుల సమీకరణ ప్రణాళికలు ప్రత్యక్ష స్పందనగా నిపుణులు భావిస్తున్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు ఇది రెండో డాలర్ బాండ్ జారీ కానుంది.

ఈ యేడాది జూన్‌లో ఐదేళ్ల కాలపరిమితి కలిగిన డెట్ సేల్ ద్వారా బ్యాంక్ 750 మిలియన్ డాలర్లు సమీకరించింది. ఆర్‌బిఐ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గతంలో చేపట్టిన 750 మిలియన్ డాలర్ల బాండ్ జారీకి ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. కరెన్సీ మారకం రేటు, భవిష్యత్తులో రుణాల రీఫైనాన్సింగ్‌కు సంబంధించిన రిస్కులు ఉన్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, చమురు ధరలు అధికంగా ఉండటం, అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో రూపాయిపై ఒత్తిడి కొనసాగుతున్న సమయంలో విదేశీ మారక ద్రవ్య లిక్విడిటీని పెంచి, రూపాయిపై ఒత్తిడిని తగ్గించేందుకే ఆర్‌బీఐ డాలర్ ఇన్‌ఫ్లోలను ప్రోత్సహిస్తోందని మరికొందరు విశ్లేషకులు చెబుతున్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గతంలో జారీ చేసిన 750 మిలియన్ డాలర్ల బాండ్ ఆర్‌బిఐ ప్రత్యేక స్వాప్ సదుపాయాన్ని వినియోగించిన తొలి బ్యాంకింగ్ లావాదేవీగా నిలిచింది. ఆర్‌బిఐ స్వాప్ సదుపాయం గడువు ముగిసిన తర్వాత హెడ్జింగ్ ఖర్చులు పెరిగితే విదేశీ కరెన్సీ రుణాలపై అదనపు భారం పడే అవకాశం ఉందని, కరెన్సీ మారకం రేటు, రీఫైనాన్సింగ్‌కు సంబంధించిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు విదేశీ రుణాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని వారు సూచిస్తున్నారు.

## భారత్‌లో కుటుంబ వ్యాపారాలు రూ.138 లక్షల కోట్లు

### నంబర్ వన్ స్థానంలో జిందాల్ కుటుంబం

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** భారత్‌లో కుటుంబ వ్యాపార సంస్థల విలువలు భారీగా పెరుగుతున్నాయి. దేశంలోని టాప్ 300 కుటుంబ వ్యాపారాల సంయుక్త విలువ 1.46 ట్రిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.138 లక్షల కోట్లు కు చేరుకుంది. 2026 బార్క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూబుల్ ఫ్యామిలీ బిజినెసెస్ జాబితాలో భారీ పరిశ్రమలు, ఇంజినీరింగ్, తయారీ రంగాల్లోని కుటుంబ వ్యాపారాలు అత్యధికంగా విలువను సృష్టించగా టెక్నాలజీ, రియల్ ఎస్టేట్, వినియోగదారుల వ్యాపారాల విలువలు గత మూడేళ్లలో తగ్గినట్లు నివేదిక తెలిపింది.జిందాల్ కుటుంబం టాప్‌లో జెఎస్‌డబ్ల్యు స్టీల్ అధినేత జిందాల్ కుటుంబం అత్యధిక విలువను సృష్టించింది. గత మూడేళ్లలో రూ.3.3 లక్షల కోట్ల విలువను జోడించడంతో కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ 70 శాతం పెరిగి రూ.8.02 లక్షల కోట్లకు చేరుకుంది. వేదాంతకు చెందిన అనిల్ అగర్వాల్ కుటుంబం రూ.3.03 లక్షల కోట్ల విలువను జోడించింది. కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ రూ.4.45 లక్షల కోట్లకు చేరింది. వేదాంతను ఐదు వేర్వేరు లిస్టెడ్ సంస్థలుగా విభజించడం ఈ పెరుగుదలకు ప్రధాన కారణమైంది. కుమార మంగళం బిర్లా కుటుంబం రూ.2.75 లక్షల కోట్ల విలువను జోడించింది. దీంతో ఆదిత్య బిర్లా గ్రూప్ వ్యాపారాల మొత్తం విలువ 51 శాతం పెరిగి రూ.8.14 లక్షల కోట్లకు చేరింది. మహీంద్రా కుటుంబం రూ.1.69 లక్షల కోట్ల విలువను జోడించగా, ఇది 49 శాతం వృద్ధి. దీంతో మొత్తం విలువ రూ.5.15 లక్షల కోట్లకు చేరుకుంది.నాదర్ కుటుంబానికి భారీ నష్టంకాగా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్‌కు చెందిన నాడార్ కుటుంబం మూడేళ్లలో రూ.1.39 లక్షల కోట్ల విలువ తగ్గి రూ.2.95 లక్షల కోట్లకు పడిపోయింది. డిఎల్ఎఫ్ రాజీవ్ సింగ్ కుటుంబం రూ.51,000 కోట్ల మేరవిలువ కోల్పోవడంతో మొత్తం విలువ రూ.1.53 లక్షల కోట్లకుపడిపోతే ఏసియన్‌పెయింట్స్ యజమానులు చోక్సీ, వకీల్ కుటుంబాలు రూ.23,000 కోట్లను కోల్పోయి రూ.2.48 లక్షల కోట్లకు చేరింది. గోద్రెజ్ ఇండస్ట్రీస్ కుటుంబం రూ.19,300 కోట్ల విలువను కోల్పోయింది. అదానీ కుటుంబం విలువ రూ.19.6 లక్షల కోట్లు, సునీల్ భారతి మిట్టల్ కుటుంబం విలువ రూ.12.1 లక్షల కోట్లు, దిలీప్ సంఘ్వి కుటుంబం విలువ రూ.4.55 లక్షల కోట్లుగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.